Published from Visakhapatnam
PRGI NO:APTEL/25/A1888

# ప్రజాభూమి

ఇది ప్రజల వెలుగు

Prajabhoomi Telugu Daily
www.prajabhoomi.com


మనిషి మనుగడలో అతిముఖ్యమైనది
శాంతి సుఖం సంతోషం ఆర్థికాభివృద్ధిఎదుగుదల,
ఇలాంటివి సాధించుకోవటానికి ఎదురయ్యే సమస్యలకు
గృహవాస్తు, జాతకదోషాలు,
అనేక రకాల సందేహాల నివృత్తి కోసం
చక్కటి పరిష్కారం కోసం సంప్రదించగలరు.
వాస్తు - జ్యోతిష పండితులు
మహామంత్రోపాసకులు
శ్రీ లలితాంబికా పీఠం వ్యవస్థాపకులు
బ్రహ్మశ్రీ మాడుగుల శివప్రసాద్ గురూజీ
79970 39039

| విశాఖపట్నం Visakhapatnam | సంపుటి : 01 | సంచిక : 175 | శనివారం | జూన్ 6, 2026 | ఎడిటర్ : రామమోహన్ రెడ్డి అంకిరెడ్డిపల్లి | పేజీలు : 12 | వెల : 3 రూ |
|---|---|---|---|---|---|---|---|
| | Vol.No : 01 | Issue No : 175 | Saturday | 6 JUNE 2026 | Editor : Ankireddypalle Ramamohan Reddy | Pages 12 | Rs 3/- |

Published From : Vijayawada, Anathapuramu, Eluru, Kadapa, Kakiknada, Tirupathi Circulated at Andharapradesh & Telangana



## భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం

### పుతిన్ ప్రశంసలు

మాస్కో: భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశమని, ఆదేశంతో తమ సంబంధాలను మరింత విస్తరించుకోవాలని నిర్ణయించుకున్నట్లు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్పష్టం చేశారు. రష్యాతో సహకారాన్ని తగ్గించుకోవాలని భారత్‌పై అమెరికా మరియు ఇతర పశ్చిమ దేశాలు చేస్తున్న ప్రయత్నాలు నిష్ఫలమైనవని, అవి అంతర్జాతీయ సంబంధాలకు నష్టం కలిగిస్తాయని ఆయన పేర్కొన్నారు. గురువారం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడిన ఆయన.. భారతదేశ ఆర్థిక వృద్ధిని, ఆ దేశ స్వతంత్ర విదేశాంగ విధానాన్ని ప్రశంసించారు.

- మిగతా 2లో..

### డాక్యుమెంటేషన్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్..

# ఆపై ఇన్‌చార్జ్ లైబ్రేరియన్..!



### ఎస్వీయూలో హోదాలు, ఇంక్రిమెంట్లు, పదోన్నతులపై అనేక ప్రశ్నలు

- నిబంధనలకు అనుగుణంగా జరిగాయా..? లేక ప్రత్యేక వెసులుబాట్లు కల్పించారా..?

ప్రజాభూమి ప్రతినిధి,తిరుపతి :

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో డాక్టర్ కె. సురేంద్ర బాబు సేవా వ్యవహారాలకు సంబంధించిన పలు పరిపాలనా నిర్ణయాలు ప్రస్తుతం విశ్వవిద్యాలయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. డాక్యుమెంటేషన్ ఆఫీసర్‌గా నియమితులైన ఉద్యోగికి అనంతరం అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా కల్పించడం, పీహెచ్‌డీ అర్హత ఆధారంగా నాలుగు అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయడం, వాటిని తిరిగి వ్యక్తిగత వేతనంగా మార్చడం, ఇన్‌చార్జ్ లైబ్రేరియన్‌గా నియమించడం, అనంతరం కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (సీఏఎస్) కింద పదోన్నతులు కల్పించడం వంటి పరిణామాలు అనేక సందేహాలకు తావిస్తున్నాయి.రికార్డుల ప్రకారం, డాక్టర్ కె. సురేంద్ర బాబు 16 డిసెంబర్ 2003న ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదంతో లైబ్రరీ విభాగంలో డాక్యుమెంటేషన్ ఆఫీసర్‌గా రూ.8000-275-13500 యూజీసీ-1996 వేతన శ్రేణిలో నియమితులయ్యారు.



ఈ పదవి ప్రధానంగా గ్రంథాలయ సేవలు, సమాచార నిర్వహణ, పరిశోధనకు అవసరమైన డాక్యుమెంటేషన్ సేవలకు సంబంధించినదిగా పరిగణించబడుతుంది. అనంతరం ఉన్నత విద్యాశాఖ జారీ చేసిన జీవో నెం.35 ప్రకారం డాక్యుమెంటేషన్ ఆఫీసర్ హోదాను అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పునర్నామకరణం చేశారు. అయితే ఈ పునర్నామకరణానికి ఎలాంటి అమలు

2 లో



## ప్రధాని మోడీ నాకు మంచి మిత్రుడు

- ట్రంప్

వాషింగ్టన్ : ప్రధాని మోడీ తనకు మంచి మిత్రుడని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్నారు. అలాగే అమెరికా, భారత్ లు వాణిజ్య ఒప్పందానికి వస్తాయని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం ఓవల్ కార్యాలయంలో ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ తనకు చాలా ఇష్టమని,తమ మధ్య మంచి సాన్నిహిత్యం ఉందని, త్వరలో తాము కచ్చితంగా ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుంటామని అన్నారు. ఇరుదేశాల మధ్య కొనసాగుతున్న వాణిజ్య ఒప్పంద చర్చలకు సంబంధించిన ప్రశ్నకు స్పందిస్తూ.. భారత్ చాలా ఏళ్లుగా అమెరికా విధానాలను తనకు అనుకూలంగా వినియోగించుకుంటూ, భారీ సుంకాలు విధిస్తోందని అన్నారు. భారత్ తమ కంపెనీలపై భారీ మొత్తంలో సుంకాలు విధించిందని, కానీ తాము ఎటువంటి సుంకాలు విధించలేదని అన్నారు.

- మిగతా 2లో..



### వైభవంగా శ్రీకళ్యాణ వేంకటేశ్వరుడి

## బ్రహ్మోత్సవాలు

- శాస్త్రోక్తంగా చక్రస్నానం నిర్వహణ

ప్రజాభూమి ప్రతినిధి, తిరుపతి :

తిరుపతి సమీపంలోని నారాయణవనంలోని శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరి రోజైన శుక్రవారం చక్రస్నానం వైభవోపేతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ దివ్య ఘట్టాన్ని దర్శించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులు భక్తి పారవశ్యంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారి అనుగ్రహాన్ని పొందారు. అంతకుముందు ఉదయం 7 గంటల నుండి 8.15 గంటల వరకు స్వామి, అమ్మవార్లకు పల్లకీ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.అనంతరం పుష్కరిణి సమీపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారికి, శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం ఘనంగా నిర్వహించారు.

- మిగతా 2లో..

### స్వచ్ఛతకు, పచ్చదనానికి

## ఏయూ ఆదర్శం కావాలి

### రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ లక్ష్యం

- పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతన్న సీఎం చంద్రబాబు
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూలో మొక్క నాటిన సీఎం
- స్టీల్ సిటీలో సీఎం సైకిల్ సవారీ
- ఐదున్నర కి.మీ. ప్రయాణం



ప్రజాభూమి ప్రతినిధి,విశాఖపట్నం :

రాష్ట్రంలో 50 శాతం గ్రీన్ కవర్ సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రోజురోజుకూ పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని... ఓవైపు విపరీతమైన ఎండలు, లేదంటే తుఫానులు వస్తున్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం ముఖ్యమంత్రి పాల్గొన్నారు.

శాసన సభ స్పీకర్ అయ్యన్న పాత్రుడు, జిల్లా ప్రజా ప్రతినిధులు, అధికారులు దీనికి హాజరయ్యారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏయూ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి మొక్క నాటారు. తిరు మల తరహాలో ఏయూ క్యాంపస్ లోనూ గ్రీనరీ పెరగాల్సిన అవసరం ఉందన్నారు.

2 పేజీలో..

### 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ

## ప్రక్రియకు శ్రీకారం

- మహిళలు, చిన్నారులతో కలసి స్వయంగా విత్తన బంతులు తయారు చేసిన పవన్ కళ్యాణ్
- డ్రోన్ల ద్వారా సీడ్ బాల్స్ వెదజల్లే ప్రక్రియను వీక్షించిన ఉప ముఖ్యమంత్రి

ప్రజాభూమి ప్రతినిధి, విజయవాడ: ఉప ముఖ్యమంత్రి, అటవీ పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఎన్టీఆర్ జిల్లా, మూలపాడులో శుక్రవారం ఉదయం బటర్ ఫ్లై పార్క్ లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కలసి స్వయంగా సీడ్ బాల్స్ తయారు చేశారు. అంకుడు, తెల్లపాణికి, వేప, కుంకుడు, రావి, మర్రి, వెదురు, ఉసిరి, చింత, మోదుగ తదితర స్వదేశీ జాతి విత్తనాలతో ఈ సీడ్ బాల్స్ తయారు చేశారు.



**రాష్ట్రవ్యాప్తంగా 300 ప్రాంతాల్లో సీడ్ బాల్స్ తయారీ**

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 300 ప్రాంతాల్లో విస్తృతంగా సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మూలపాడు బటర్ ఫ్లై పార్క్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఈ కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ వీక్షించారు.

2 పేజీలో..

- మచిలీపట్నంలో ఘనంగా ప్రజాదర్బార్.. ప్రజల నుంచి అర్జీల స్వీకరణ
- మచిలీపట్నం అభివృద్ధికి 'స్పెషల్ పర్పస్ వెహికల్' ఏర్పాటు
- తీర ప్రాంత మహిళలకు సీవీడ్ సాగు ద్వారా ఉపాధి అవకాశాలు
- ఓటరు జాబితాల సవరణ పారదర్శకంగా జరుగుతుంది గనుల శాఖ మంత్రి వెల్లడి

### ప్రజా సమస్యల పరిష్కారమే

## ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి : ప్రజల సమస్యలను సత్వరంగా పరిష్కరించి మెరుగైన సేవలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక బృందావన థియేటర్ సమీపంలోని టీడీపీ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక – ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలను స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపిగ్గా ఆలకించిన మంత్రి, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

2 పేజీలో..



### కేరళలో భారీ వర్షాలు..

## ఐఎండి రెడ్ అలర్ట్

న్యూఢిల్లీ : కేరళలో నైరుతి రుతుపవనాల రాకతో భారీ వర్షాలు పడుతున్నాయి. దీంతో భారత వాతావరణ శాఖ శుక్రవారం ఐదు జిల్లాలు కొజికోడ్, వయనాడ్, మలప్పురం, కన్నూర్, కాసరగోడ్‌లకు శనివారం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఈ ఐదు జిల్లాల్లో రాబోయే 24 గంటల్లో 204 మి.మీ కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున ఐఎండి రెడ్ అలర్ట్ ప్రకటించింది.

- మిగతా 2లో..

### రాజస్థాన్‌లో ఎబోలా

## అనుమానిత కేసు




జైపూర్ : రాజస్థాన్ లో ఎబోలా అనుమానిత కేసు నమోదైంది. ఉగాండా నుండి రాజస్థాన్ వచ్చిన ఒక మహిళలో ఎబోలా వైరస్ లక్షణాలను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం షార్జా నుండి జైపూర్ విమానాశ్రయానికి చేరుకున్న ఆ మహిళకు సాధారణ తనిఖీల్లో వైరస్ లక్షణాలు కనిపించాయని అన్నారు. వెంటనే ఆమెను జైపూర్‌లోని ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఐసోలేషన్ లో ఉంచామని చెప్పారు. ఆ మహిళ నుండి సేకరించిన నమూనాలను పరీక్షల కోసం పూణేలోని ల్యాబ్‌కు పంపనున్నట్లు తెలిపారు. ఎబోలా వైరస్ ఇంకా నిర్ధారణ కాలేదని, నివేదిక అందిన తర్వాతే ఈ ఇన్ఫెక్షన్‌ను నిర్ధారించగలమని రాజస్థాన్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ సూపరింటెండెంట్ అనిల్ గుప్తా పేర్కొన్నారు.

- మిగతా 2లో..

## సంపాదకీయం

### ఏటేటా పెరుగుతున్న

# పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యవారణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగృతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

## వైభవంగా శ్రీకళ్యావణ వేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాలు

ఉదయం 9.15 గంటల నుండి 10.30 గంటల వరకు పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో అభిషేకాలు నిర్వహించి విశేష పూజలు చేశారు. అనంతరం ఉదయం 10.30 గంటలకు శ్రీ సుదర్శన చక్రత్తాళ్వార్లకు చక్రస్నానం ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించిన బ్రహ్మోత్సవాల్లో జరిగిన అన్ని సేవలు సఫలమై, లోకక్షేమం, సకాల వర్షాలు, ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం చక్రస్నానం నిర్వహించినట్లు ఆగమ పండితులు తెలిపారు. బ్రహ్మోత్సవాల్లో పాల్గొని చక్రస్నానాన్ని దర్శించిన భక్తులు సమస్త పాప విముక్తులై, ఐశ్వర్యాలు, ధనధాన్య సమృద్ధిని పొందుతారని విశ్వాసం. రాత్రి 7 గంటల నుండి 8 గంటల వరకు ధ్వజావరోహణం నిర్వహించి తొమ్మిది రోజుల పాటు వైభవంగా సాగిన బ్రహ్మోత్సవాలకు పూర్ణాహుతి పలుకనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, చెంగల్రాయులు, అర్చకులు, అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## రాజస్థాన్‌లో ఎబోలా అనుమానిత కేసు

నివేదిక శనివారం వెలువడే అవకాశం ఉందని అన్నారు. మరోవైపు గురువారం హైదరాబాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంలో సూడాన్ జాతీయుడిలో ఎబోలా లక్షణాలను గుర్తించారు. ఆ వ్యక్తిని సికింద్రాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించామని అధికారులు తెలిపారు. ఆ వ్యక్తి నమూనాలను పరీక్షల కోసం హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సిసిఎంబి)కి పంపినట్లు ఆస్పత్రి అధికారులు వెల్లడించారు. కాంగో మరియు ఉగాండాల్లో ఎబోలా వ్యాధి తీవ్రంగా వ్యాప్తి చెందడంతో డబ్ల్యుహెచ్ ఒ అత్యవసర పరిస్థితిని ప్రకటించిన సంగతి తెలిసిందే. వ్యాధి తీవ్రత దృష్ట్యా కాంగో, ఉగాండా, దక్షిణ సూడాన్ దేశాలకు ప్రయాణాలను నివారించాలని కేంద్ర ప్రభుత్వం భారత పౌరులకు సూచించింది.

### కేరళలో భారీ వర్షాలు..

## ఐఎండి రెడ్ అలర్ట్

ఇక తిరువనంతపురం, కొల్లాం, అలప్పుజా వంటి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. కాగా, ఐఎండి మలప్పురం, కొజికోడ్, వయనాడ్ జిల్లాలకు ఆదివారం వరకు రెడ్ అలర్ట్ ప్రకటించింది. ఇదేరోజు వరకు కాసర్‌గోడ్, కన్నూర్, త్రిస్సూర్, పాలక్కాడ్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది.

# స్వచ్ఛతకు, పచ్చదనానికి ఏయూ ఆదర్శం కావాలి

ప్రస్తుతం క్యాంపస్‌లో 25 శాతమే గ్రీనరీ ఉందని... దీనిని 50 శాతానికి పెంచేలా చర్యలు తీసుకోవాలంటూ ఏయూ వీసీని సీఎం ఆదేశించారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ... 'స్వచ్ఛత, పచ్చదనం, పర్యావరణానికి ఏయూ క్యాంపస్ ఆదర్శంగా మారాలి. నెట్ జీరో క్యాంపస్‌గా ఏయూను నిలపాలి. ఆంధ్ర యూనివర్శిటీకి 450 ఎకరాల సువిశాల క్యాంపస్ ఉంది. ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడంతో పాటు... బిల్డింగుల మీద సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాలి. క్యాంపస్‌కు అవసరమైన విద్యుత్‌ను సొంతంగా ఉత్పత్తి చేసుకోవాలి. ఇప్పటికే రూ.5,18,000 విలువైన విద్యుత్ ఆదా అయింది. క్యాంపస్ ను బయో డైవర్సిటీ పార్కుగా తీర్చిదిద్దాలి. హాస్టళ్లు, కాలేజీల నుంచి వచ్చే చెత్త, చెట్ల ఆకులను కంపోస్ట్‌గా మార్చాలి. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్, వ్యర్థాల నుంచి బయో గ్యాస్ ఉత్పత్తిపై దృష్టి పెట్టాలి. వేస్ట్ వాటర్ మేనేజ్మెంట్ చేపట్టాలి. క్యాంపస్ నుంచి ఒక్క చుక్క నీరు కూడా బయటకు వెళ్లకూడదు. శుద్ధి చేసిన నీటిని చెట్లకు ఉపయోగించాలి. పీఎన్జీ, ఎలక్ట్రికల్ స్టవ్స్ వంటలకు వినియోగించుకోవాలి. నెట్ జీరో విధానం అమలు చేయడానికి ప్రొఫెసర్స్ టీం ఏర్పాటు చేయాలి. పర్యావరణానికి సంబంధించి విద్యార్థులకు ఏయూ క్యాంపస్ ఓ నాలెడ్జ్ హబ్‌గా తయారవ్వాలి. ప్రపంచంలోని టాప్ నాలెడ్జ్ వర్సిటీల సరసన ఏయూను నిలపాలి. క్యాంపస్ లోపల ఎలక్ట్రికల్ సైకిళ్లను అందుబాటులోకి తీసుకురావాలి.' అన్నారు.

**విశాఖలో కాలుష్య నియంత్రణ చర్యలు**

విశాఖలో కాలుష్యాన్ని తగ్గించేందుకు పోర్టు దగ్గర నుంచి మొదలుకుని అన్ని ప్రాంతాల్లోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ సీఎం సరదాగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో 2.5 కోట్ల సీడ్ బాల్స్‌తో గ్రీనరీ పెంచేలా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కృషి చేస్తున్నారని చెప్పారు. విశాఖలో సైక్లింగ్, వాకింగ్ కోసం ప్రత్యేక మార్గాలు ఏర్పాటు చేస్తామన్నారు. సైక్లింగ్ ద్వారా రెండు విధాలుగా లాభం ఉందని... కాలుష్యం తగ్గడమే కాకుండా ఫిట్?నెస్ పెంచుకోవచ్చని సీఎం అన్నారు.

**సీఎం సైకిలింగ్...**ఏయూ గ్రౌండ్స్ లో నిర్వహించిన మీడియా సమావేశం అనంతరం... పర్యావరణ పరిరక్షణపై అందరిలో చైతన్యం తెచ్చేలా విశాఖలో సీఎం సైకిల్‌పై ప్రయాణించారు. ఎర్రటి ఎండ కాస్తున్నా.. సీఎం ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం సైకిల్ ర్యాలీ చేపట్టారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్ నుంచి 3 టౌన్ పీఎస్ జంక్షన్, పోలమాంబ గుడి, వుడా పార్క్, వైఎంసీఏ, బీచ్ రోడ్ మీదుగా నోవోటెల్‌కు సైకిల్‌పై వెళ్లారు. మొత్తం ఐదున్నర కిలోమీటర్ల దూరాన్ని 21 నిమిషాల్లోనే చేరుకున్నారు. ముఖ్యమంత్రితో పాటు సైకిల్ ర్యాలీలో కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడు, జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

### డాక్యుమెంటేషన్ ఆఫీసర్ నుంచి అసిస్టెంట్ ప్రొఫెసర్...

# ఆపై ఇన్‌చార్జ్ లైబ్రేరియన్..!

తేదీని నిర్దేశించలేదు. అంతేకాకుండా, ఈ మార్పు వల్ల ప్రభుత్వం లేదా విశ్వవిద్యాలయంపై ఎటువంటి అదనపు ఆర్థిక భారం పడకూడదని స్పష్టమైన షరతు విధించారు.ఇక్కడే పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అదే ఉత్తర్వుల్లో లైబ్రేరియన్లు, డాక్యుమెంటేషన్ అధికారులు రెగ్యులర్ టీచింగ్ సిబ్బంది కాదని, అవసరమైతే మాత్రమే వారికి తరగతులు నిర్వహించే బాధ్యతలు అప్పగించవచ్చని పేర్కొన్నట్లు తెలుస్తోంది. అటువంటి పరిస్థితుల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ హోదా కల్పించడం కేవలం పేరు మార్పు మాత్రమేనా? లేక అధ్యాపక హోదాతో సమానమైన అన్ని ప్రయోజనాలు కూడా వర్తింపజేశారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఇదిలా ఉండగా, డాక్టర్ సురేంద్ర బాబు పీహెచ్‌డీ పట్టా పొందిన నేపథ్యంలో 17 డిసెంబర్ 2003 నుంచి నాలుగు అడ్వాన్స్ ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని అభ్యర్థించారు. విశ్వవిద్యాలయం ఆ అభ్యర్థనను పరిశీలించి ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకుంది. అయితే అనంతరం ప్రభుత్వం జారీ చేసిన స్పష్టీకరణల ప్రకారం ఈ నాలుగు ఇంక్రిమెంట్లు కేవలం అడ్వాన్స్ ఇంక్రిమెంట్లే కానీ ప్రోత్సాహక ఇంక్రిమెంట్లు కావని తేల్చింది. దీంతో అవి శాశ్వత ప్రయోజనాలుగా కొనసాగకుండా వ్యక్తిగత వేతనం (పర్సనల్ పే) రూపంలో చూపినట్లు రికార్డులు సూచిస్తున్నాయి.అయితే మొదట ఇచ్చిన ప్రయోజనాలను తర్వాత సవరించాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ప్రారంభంలో నిబంధనలను సక్రమంగా పరిశీలించలేదా? లేక ప్రభుత్వ వివరణల తర్వాత మాత్రమే లోపాలు గుర్తించారా? అనే అంశాలు చర్చనీయాంశంగా మారాయి.

మరో ముఖ్యమైన అంశం ప్రొబేషన్ ప్రకటన. సాధారణంగా ఉద్యోగ నియామకం అనంతరం నిర్దిష్ట కాలవ్యవధిలో ప్రొబేషన్ పూర్తి చేసి ప్రకటించడం పరిపాలనా విధానం. కానీ డాక్టర్ సురేంద్ర బాబు విషయంలో 17 డిసెంబర్ 2005 నుంచి అమల్లోకి వచ్చినట్లు చూపుతూ, దాదాపు పది సంవత్సరాల తర్వాత 22 ఏప్రిల్ 2015న ప్రొబేషన్ ప్రకటించడం గమనార్హం. ఇంత సుదీర్ఘ ఆలస్యం వెనుక కారణాలేమిటి? మధ్య కాలంలో సేవా ధ్రువీకరణ ఎందుకు జరగలేదు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.ఇదే సమయంలో 31 మే 2014 నుంచి ఆయనను శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఇన్‌చార్జ్ లైబ్రేరియన్‌గా నియమించింది. డాక్యుమెంటేషన్ ఆఫీసర్‌గా నియమితులైన వ్యక్తికి ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ బాధ్యతలు అప్పగించడానికి అనుసరించిన ప్రమాణాలు ఏమిటి? ఆ సమయంలో అర్హత కలిగిన సీనియర్ లైబ్రేరియన్‌లు అందుబాటులో లేరా? అనే అంశాలపై కూడా స్పష్టత రావాల్సి ఉంది. అనంతరం 30 మార్చి 2016న కెరీర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ కింద ఏజీపీ 7000 నుంచి ఏజీపీ 8000కు పదోన్నతి కల్పించారు. అయితే సీఏఎస్ పదోన్నతులకు అవసరమైన ప్రమాణాలు, బోధనా అనుభవం, పరిశోధనా ప్రచురణలు, యూజీసీ నిర్దేశించిన అర్హతలు పూర్తిగా పరిశీలించారా అనే అంశం కూడా చర్చకు వస్తోంది.

**సమాధానం లభించాల్సిన కీలక ప్రశ్నలు**

- డాక్యుమెంటేషన్ ఆఫీసర్ హోదా పునర్‌నామకరణం కేవలం పరిపాలనా చర్యేనా?




- లేక అధ్యాపక హోదాతో సమానమైన ప్రయోజనాలు కూడా కల్పించారా?
- లైబ్రేరియన్, డాక్యుమెంటేషన్ అధికారులను టీచింగ్ సిబ్బందిగా పరిగణించని పరిస్థితిలో సీఏఎస్ పదోన్నతులు ఎలా వర్తింపజేశారు?
- పీహెచ్‌డీ ఆధారంగా మంజూరు చేసిన నాలుగు ఇంక్రిమెంట్ల విషయంలో మొదట తీసుకున్న నిర్ణయం, తర్వాత చేసిన సవరణకు కారణాలేమిటి?
- నియామకం తర్వాత దాదాపు పదేళ్లకు ప్రొబేషన్ ప్రకటించడం వెనుక పరిపాలనా కారణాలేమిటి?
- ఇన్‌చార్జ్ లైబ్రేరియన్ నియామకంలో అనుసరించిన అర్హతలు, ఎంపిక ప్రమాణాలు ఏమిటి?
- ఈ మొత్తం వ్యవహారంపై విశ్వవిద్యాలయం పూర్తి వివరాలతో శ్వేతపత్రం విడుదల చేస్తుందా?

**ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి**

విశ్వవిద్యాలయ పరిపాలనలో పారదర్శకత, నిబంధనల అమలు, పదోన్నతుల ప్రక్రియపై స్పష్టత కోసం ఈ అంశాలపై సమగ్ర వివరణ ఇవ్వాల్సిన అవసరం ఉందని విద్యావేత్తలు, ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.

# 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియకు శ్రీకారం

సీడ్ బాల్స్ తయారీ ప్రక్రియలో పాల్గొన్న ప్రజలతో ముచ్చటించారు. ఏఏ విత్తనాలతో సీడ్ బాల్స్ తయారు చేస్తున్నారు? ఎంత మొత్తంలో రూపొందిస్తున్నారు? అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. వన సంరక్షణకు పని చేస్తున్న మహనీయుల స్ఫూర్తితో విత్తన బంతుల తయారీ ప్రక్రియను బాధ్యతగా ముందుకు తీసుకువెళ్లాలన్నారు. సీడ్ బాల్స్ ఆవశ్యకతను వివరించిన చిన్నారులను అభినందించారు. జూన్ 15వ తేదీ నాటికి 2.5 కోట్ల సీడ్ బాల్స్ రూపొందించాలని అధికారులకు శ్రీ పవన్ కళ్యాణ్ గారు దిశానిర్దేశం చేశారు. అనంతరం డ్రోన్ల సహాయంతో కొండ శిఖరాలపై విత్తన బంతులు జారవిడిచే ప్రక్రియను పరిశీలించారు.

**ప్రతి ఎకో పార్కులో ఒక యోగా హాల్**

అంతకు ముందు మూలపాడు బటర్ ఫ్లై పార్కులో అటవీ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ను పవన్ కళ్యాణ్ సందర్శించారు. బటర్ ఫ్లై పార్కు నమూనా పరిశీలనలో అక్కడ యోగా హాల్ నిర్మాణం ఆయనను ఆకట్టుకుంది. ప్రతి ఎకో టూరిజం పార్కులో ఒక యోగా హాల్ నిర్మించే ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

**కొయ్య బొమ్మలు, కళాకృతుల ప్రచారానికి హామీ**

అనంతరం కొండపల్లి కొయ్య బొమ్మలు తయారీకి వినియోగించే తెల్ల పొణికి దుంగలను పరిశీలించారు. పక్కనే ఏర్పాటు చేసిన కొండపల్లి కొయ్య బొమ్మలు, ఉదయగిరి కళాకారులు నిర్ద, బిల్ల నిర్ద, వేప కర్రతో తయారు చేసిన గ్లాసులు, గరిటలు వంటి వంట ఇంటి సామాగ్రిని ఆసక్తిగా తిలకించారు. కళాకారులు రూపొందించిన చెక్క వాచ్, ల్యాప్ టాప్ పవన్ కళ్యాణ్ ని ఆకట్టుకున్నాయి. చిత్తూరు నుంచి వచ్చిన కళాకారులు బొమ్మల తయారీకి అవసరం అయిన చెక్క లభించడం లేదని తెలుపగా, వుడ్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ



సందర్భంగా కొయ్య బొమ్మల కళాకారుల చేత ప్రముఖ స్వతంత్ర సమరయోధులు, హైదరాబాద్ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు ప్రతిమను తయారు చేయించాలని కోరారు. అద్భుతమైన కళారూపాలకు మార్కెటింగ్ కల్పించేందుకు, ప్రచారం ద్వారా ప్రాచుర్యం కల్పించేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి రెండు నెలలకి ఓ ప్రాంతంలో చేతి వృత్తుల కళాకారులను కలిసే ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మైలవరం శాసన సభ్యులు వసంత కృష్ణప్రసాద్ , అటవీ, పర్యావరణ శాఖల ముఖ్యకార్యదర్శి కాంతిలాల్ దండే , పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు అటవీశాఖ సలహాదారుడు మల్లికార్జునరావు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జనసేన ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు సామినేని ఉదయభాను మైలవరం ఇంఛార్జ్ అక్కల రామ్మోహన రావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

- అనంతరం రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి మంత్రి కొల్లు రవీంద్ర మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీల అమలుకు, సమస్యల శాశ్వత పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తోందని అన్నారు. మచిలీపట్నం నియోజకవర్గ సమగ్ర పురోగతికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.



**మచిలీపట్నం అభివృద్ధికి సరికొత్త మోడల్..**

- మచిలీపట్నం నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ముందంజలో ఉంచేందుకు ప్రత్యేక ప్రయోజన వాహనం (Special Purpose Vehicle - SPV) ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు.
- దీర్ఘకాలిక ప్రణాళిక: పోర్టు, ఆక్వాకల్చర్, గోల్డ్ కవరింగ్ పరిశ్రమ, రోడ్డు, రైల్వే అనుసంధానం, పర్యాటకం, పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.
- ఉపాధి – సాధికారత: స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పన, మహిళా సాధికారతకు ప్రాధాన్యం.
- **సీవీడ్ సాగు:** ముఖ్యంగా తీర ప్రాంత మహిళల ఆర్థికాభివృద్ధి కోసం సీవీడ్ (సముద్రపు నాచు) సాగు వంటి సరికొత్త ఉపాధి అవకాశాలను ప్రోత్సహిస్తాం.
- పైలట్ ప్రాజెక్ట్: మచిలీపట్నంలో అమలు చేయబోయే ఈ అభివృద్ధి నమూనాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకుని, త్వరలోనే జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాలకు విస్తరిస్తాం.

**పారదర్శకంగా ఓటరు జాబితా సవరణ**

- ఓటరు జాబితాల ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) అత్యంత పారదర్శకంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు. చనిపోయిన వారి పేర్ల తొలగింపు, కొత్తగా ఓటు హక్కు పొందిన వారి పేర్ల నమోదు వంటి ప్రక్రియలన్నీ నిబంధనల మేరకే పక్కాగా జరుగుతాయని స్పష్టం చేశారు.

**ప్రజాదర్బార్‌లో వెల్లువెత్తిన వినతులు.. కొన్ని ప్రముఖ అర్జీలు:**

- పంచాయతీరాజ్ కాలనీలో రోడ్డు నిర్మాణం: 46వ డివిజన్ ఎస్‌బీఐ ఏటీఎం పక్కన ఉన్న మట్టి రోడ్డు గుంతలమయంగా మారిందని, వర్షాకాలంలో నరకం కనిపిస్తోందని స్థానికులు మంత్రికి మొరపెట్టుకున్నారు. మున్సిపల్ అధికారులకు చెప్పినా పట్టించుకోలేదని, వెంటనే రోడ్డు నిర్మించాలని కోరారు.
- స్మశాన వాటిక అభివృద్ధి: పోతిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన మేక గంగాధర్ రావు తమ గ్రామ శివారులోని స్మశాన వాటికకు ప్రహరీ గోడ, షెడ్డు, బావి ఏర్పాటు చేయాలని, పొదలను తొలగించి మెరక పనులు చేపట్టాలని అర్జీ ఇచ్చారు.
- స్వాతంత్ర్య సమరయోధురాలి భూమి ఆక్రమణ: 39వ డివిజన్ రాజుపేటకు చెందిన కొంకేపూడి అనసూయ.. స్వాతంత్ర్య సమరయోధురాలైన తన తల్లి పంచపర్వాల శ్యామలాంబకు ప్రభుత్వం గతంలో పెదయాదరలో కేటాయించిన 4.97 ఎకరాల భూమిని కొందరు ఆక్రమించి రికార్డులు మార్చేశారని, తమ భూమిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని మంత్రిని వేడుకున్నారు.

**హాజరైన ప్రముఖులు :**

ఈ కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ, కూటమి నాయకులు లోగిశెట్టి వెంకటస్వామి, ఇలియాజ్ పాషా, తలారి సోమశేఖర్, కే సుశీల, సుబ్రహ్మణ్యం, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్ గొప్ప ప్రజాస్వామ్య దేశం

మొదటి పేజీ తరువాయి

భారత్‌తో ఆర్థిక బంధాన్ని మరింత బలోపేతం చేసుకోవడానికి రష్యా నిశ్చయించుకుందని, రాబోయే సంవత్సరాల్లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 100 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుంటుందనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.రష్యాతో సంబంధాలను పరిమితం చేయాలంటూ భారత్‌పై పశ్చిమ దేశాలు ఒత్తిడి తెస్తున్నప్పటికీ, దానివల్ల తమపై ఎటువంటి ప్రతికూల ప్రభావం పడలేదని పుతిన్ సూచించారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన, బలమైన నాయకత్వం ఉన్న భారతదేశంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నాలు నిష్ఫలమని అన్నారు. ఈ ఒత్తిళ్లు ఎక్కడి నుంచి వస్తున్నాయనేది ముఖ్యం కాదని, ప్రస్తుత పరిస్థితుల వల్ల ఇరు దేశాల బంధానికి ఎటువంటి ఢోకా లేదని, భవిష్యత్తులోనూ ఇరుదేశాల మధ్య స్నేహం ఇలాగే కొనసాగుతుందని స్పష్టం చేశారు. రష్యా నుండి ముడి చమురు కొనుగోళ్లను తగ్గించుకోవాలని అమెరికా ఒత్తిడి చేస్తున్న నేపథ్యంలో పుతిన్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. అమెరికాతో భారతదేశానికి ఉన్న అనుబంధం వల్ల రష్యాతో ఉండే చిరకాల సంబంధాలకు ఎటువంటి ఆటంకం కలగదని, భారత్‌ను తాము ఒక "విశ్వసనీయ భాగస్వామి"గా పరిగణిస్తామని ఆయన పునరుద్ఘాటించారు. భారతదేశం ఒక గొప్ప ప్రజాస్వామ్య దేశమని, ఆ దేశానికి ఇతర దేశాలతో ఉండే దౌత్య సంబంధాల వల్ల రష్యాకు ఎటువంటి ఇబ్బంది లేదని అన్నారు. మరోవైపు ఉక్రెయిన్ సంక్షోభంపై స్పందిస్తూ.. సమస్యను పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉన్నానని, అయితే ఉక్రెయిన్ ను ఒప్పించడమే ఇప్పుడు చేయాల్సిన పని అని పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో శాంతి చర్చలలో యూరోపియన్ యూనియన్ దేశాలు మధ్యవర్తులుగా వ్యవహరించగలవన్న మీడియా వ్యాఖ్యలను తోసిపుచ్చారు. ఆయుధాలు సరఫరా చేయడం ఆపి, ఉక్రెయిన్ ను రాజీకి ఒప్పించడం ద్వారానే ఇయు ఈ వివాద పరిష్కారానికి సహాయపడగలదని సూచించారు. రష్యాకు వ్యూహాత్మక ఓటమిని కలిగించాలని పదేపదే కోరుకునే పశ్చిమ దేశాలను తాము ఎలా నమ్మగలమని ఆయన ప్రశ్నించారు. అలాగే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీ అధ్యక్ష పదవీకాలం ముగిసిపోయిందని పేర్కొంటూ.. అధ్యక్షుడిగా ఆయన చట్టబద్ధతను ప్రశ్నించారు. ఉక్రెయిన్ సంక్షోభం ‑ప్రాంతీయ' సమస్య మాత్రమేనని, కానీ ఇరాన్ సమస్య ప్రపంచ సమస్య అని పేర్కొన్నారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలను తగ్గించడానికి దోహదపడే ఏ నిర్ణయానికైనా మద్దతు ఇవ్వడానికి రష్యా సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు.

## ప్రధాని మోడీ నాకు మంచి మిత్రుడు : ట్రంప్

ఈ వారం ప్రారంభంలో అమెరికా ప్రతినిధి బృందం భారత్ లో పర్యటించిన సంగతి తెలిసిందే. గురువారం నాటికి మధ్యంతర ద్వైపాక్షిక ఒప్పందంపై నాలుగు రోజుల చర్చలను ముగిసినట్లు భారత వాణిజ్య శాఖ ప్రకటించింది. ద్వైపాక్షిక వాణిజ్య, ఆర్థిక సంబంధాలను బలోపేతం చేసేలా, పరస్పర ప్రయోజనకరమైన ఒప్పందాన్ని కుదుర్చుకోనున్నట్లు పునరుద్ఘాటించిం

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం

# మంగినపూడి బీచ్‌లో ఘనంగా స్వచ్ఛభారత్





మచిలీపట్నం/ రూరల్ ప్రజాభూమి ప్రతినిధి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణాజిల్లా మచిలీపట్నం నార్త్ మండలంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మంగినపూడి బీచ్ తీరంలో భారీ ఎత్తున స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర మంత్రివర్యులు కొల్లు రవీంద్ర పాల్గొని, స్వయంగా బీచ్ తీరంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను, చెత్తాచెదారాన్ని తొలగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.ప్లాస్టిక్ రహిత తీరమే లక్ష్యంబీచ్ తీరం వెంబడి పేరుకుపోయిన ప్లాస్టిక్ బాటిళ్లు, కవర్లు మరియు ఇతర వ్యర్థాలను జిల్లా అధికారులు, పంచాయతీ, మున్సిపల్ సిబ్బందితో కలిసి మంత్రి మరియు ఇతర నాయకులు శుభ్రం చేశారు. పర్యావరణానికి ప్లాస్టిక్ వల్ల జరుగుతున్న నష్టాన్ని ఈ సందర్భంగా అందరికీ వివరించారు.మంగినపూడి బీచ్‌ను సుందరంగా తీర్చిదిద్దడం మన అందరి బాధ్యత. ప్లాస్టిక్ మహమ్మారి వల్ల పర్యావరణానికి, సముద్ర జీవులకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది. బీచ్‌ను సందర్శించే పర్యాటకులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, పరిసరాలను శుభ్రంగా ఉంచాలి.కొల్లు రవీంద్ర, రాష్ట్ర మంత్రిపర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలిబీచ్ సుందరీకరణ మరియు పర్యావరణ రక్షణ కేవలం అధికారుల బాధ్యతే కాదని, పర్యాటకులు, స్థానిక ప్రజలు కూడా ఇందులో భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. మంగినపూడి బీచ్‌కు పర్యాటకుల తాకిడి పెరుగుతున్న నేపథ్యంలో, ఇక్కడ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మీడియా సమావేశంలో స్పష్టం చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులుఈ స్వచ్ఛభారత్ కార్యక్రమంలో జిల్లా ఉన్నతాధికారులు మరియు రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం చేశారునవీన్ (కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్)సాంబశివ రావు (మచిలీపట్నం ఆర్డీఓ)ధనలక్ష్మి (కృష్ణా జిల్లా డీపీఓ) మచిలీపట్నం మున్సిపల్ కమిషనర్ బాపిరాజుబండి రామకృష్ణ (జనసేన పార్టీ ఇంచార్జ్) మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని దుర్గాప్రసాద్‌కాగిత వెంకటేశ్వరరావు (తెలుగు దేశం రూరల్ పార్టీ అధ్యక్షులు)లోగిశెట్టి స్వామి (టౌన్ పార్టీ అధ్యక్షులు), అస్సిం బేగ్, కొనకల్ల నాగరాజు,బెరక మినిస్ట్రీస్ అధినేత కిరణ్ పాల్, వారి సిబ్బంది మరియుమంత్రి తో పాటు జిల్లా అధికారులు, మున్సిపల్ సిబ్బంది మరియు కూటమి పార్టీల కార్యకర్తలు స్వయంగా పాల్గొని బీచ్‌లోని చెత్తను పూర్తిగా తొలగించి, తీరాన్ని పరిశుభ్రంగా మార్చారు. పర్యావరణాన్ని కాపాడుకుందాం – స్వచ్ఛమైన సమాజాన్ని నిర్మిద్దాం ఈ పర్యావరణ దినోత్సవం వేళ ప్లాస్టిక్‌కు గుడ్‌బై చెబుదాం అని అన్నారు.

## వైకాపా అరాచక పాలనకు చరమగీతం పాడి రెండేళ్లు కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్ర పునర్నిర్మాణం



### - ఏపీ ప్రజలకు రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి శుభాకాంక్షలు

అమరావతి/ప్రజాభూమి ప్రతినిధి రాష్ట్రంలో వైకాపా సాగించిన అరాచక, విధ్వంసక పాలనకు ఆంధ్రప్రదేశ్ ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో చరమగీతం పాడి నేటికి విజయవంతంగా రెండేళ్లు పూర్తయిన సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ రాష్ట్ర మాదిగ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉండవల్లి శ్రీదేవి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. గత ఐదేళ్ల రాక్షస పాలనను అంతమొందించి, రాష్ట్ర భవిష్యత్తును మార్చిన ప్రజా తీర్పునకు నేటితో రెండేళ్లు నిండాయని పేర్కొంటూ ఒక ప్రకటన విడుదల చేశారు.పరదాల పాలనకు ముగింపు ప్రజాస్వామ్యాన్ని పరదాల మాటున బంధించి, ప్రజల గొంతు నొక్కిన గత ప్రభుత్వానికి ప్రజలు సరైన బుద్ధి చెప్పారు.అరాచకాలపై ప్రజా తీర్పు రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆలయాలు, కులాలు, మతాలపై దాడులు చేసిన అరాచక శక్తుల పాలనకు ముగింపు పలికి రెండేళ్లు అయింది.

అప్పుల ఊబి నుంచి విముక్తి: సంక్షేమం పేరుతో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టడమే కాకుండా... భయాందోళనలు, కక్షసాధింపులు, రాజకీయ వేధింపులతో ఏపీని వెనక్కి నెట్టిన పాలకులను ప్రజలు తరిమికొట్టారు.

ప్రతి వర్గానికి ఊరట: రైతులు, యువత, మహిళలు, ఉద్యోగులు, వ్యాపారులు, పారిశ్రామికవేత్తలను ఇబ్బందులకు గురిచేసిన పాలన అంతమైంది. గత ప్రభుత్వ భయానికి పరిశ్రమలు పారిపోవడం వల్ల వేల కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉద్యోగాలు కోల్పోవాల్సి వచ్చింది."పరిశ్రమలను భయపెట్టి తరిమేసిన పాలన మీది - రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకొచ్చే పాలన మాది"చంద్రబాబు నాయకత్వంలో వేగంగా అభివృద్ధిముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, అనుభవం, సమర్థ నాయకత్వంతో ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతున్నాయని ఉండవల్లి శ్రీదేవి కొనియాడారు.

యువనేత లోకేష్ కృషి: యువనేత నారా లోకేష్ దేశ విదేశాల్లో పర్యటిస్తూ భారీగా పెట్టుబడులను ఆకర్షిస్తున్నారని, యువతకు ఉపాధి కల్పించే దిశగా నిరంతరం కృషి చేస్తున్నారని చెప్పారు.

వేగంగా పునర్నిర్మాణం: అమరావతి, పోలవరం ప్రాజెక్టులతో పాటు పారిశ్రామిక అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో రాష్ట్ర పునర్నిర్మాణం యుద్ధప్రాతిపదికన జరుగుతోందని వివరించారు.అభివృద్ధికి ప్రతీకగా కూటమి ప్రభుత్వంగత పాలన విధ్వంసానికి ప్రతీకగా నిలిస్తే... నేటి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలనకు బ్రాండ్ అంబాసిడర్‌గా నిలుస్తోందని స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్న బలమైన సంకల్పంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ఈ అభివృద్ధి యాత్రలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నట్లు ఉండవల్లి శ్రీదేవి ప్రకటించారు.

## కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన 40 రోజుల వేసవి శిక్షణ

### తరగతుల ముగింపు వేడుకలు




మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి మచిలీపట్నంలోని కేంద్ర గ్రంథాయంలో ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ ముగింపు సభకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ, మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మరియు పలువురు ప్రముఖులు హాజరయ్యారు.ఈ సంద ర్భంగా గ్రంథాలయాల ప్రాముఖ్యతను, విద్యార్థుల భవిష్యత్తుకు అవి ఎలా ఉపయోగపడతా యో ప్రముఖులు వివరించిన వివరాలు ఇలా ఉన్నాయి:గ్రంథాలయాలు జ్ఞాన భాండాగారాలు: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్సభకు అధ్యక్షత వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎంకే బేగ్ మాట్లాడుతూ, గ్రంథాలయాలు కేవలం పుస్తకాల నిలయాలు కావని, అవి సమాజ చైతన్యానికి, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు పునాదులని కొనియాడారు. 40 రోజుల పాటు సాగిన ఈ వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు అద్భుతంగా సద్వినియోగం చేసుకున్నారని హర్షం వ్యక్తం చేశారు. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న విలువ తగ్గలేదని, ప్రతి ఒక్కరూ గ్రంథాలయాలను ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలను మరింత ఆధునీకరించి, పాఠకులకు అన్ని వసతులు కల్పిస్తామని ఆయన స్పష్టం చేశారు.వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలే దిక్సూచి డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణా జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ మాట్లాడుతూ, విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడానికి ఇలాంటి వేసవి శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. గ్రంథాలయాల్లో లభించే మహానుభావుల జీవిత చరిత్రలు, నైతిక విలువల పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థుల్లో ఉత్తమ వ్యక్తిత్వం అలవడుతుందని తెలిపారు. సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి పుస్తక పఠనం ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి రోజులో కొంత సమయాన్ని గ్రంథాలయంలో గడపాలని ఆయన ఆకాంక్షించారు.విజ్ఞాన సముపార్జనకు గ్రంథాలయాలు కేరాఫ్ అడ్రస్: లంకిశెట్టి బాలాజీమచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ, చదువుతో పాటు లోకజ్ఞానం సంపాదించినప్పుడే జీవితంలో స్థిరపడగలమని, అందుకు గ్రంథాలయాలే సరైన వేదికలని పేర్కొన్నారు. నాడు ఎందరో మహానుభావులు గ్రంథాలయాల్లో చదువుకుని దేశానికి దిశా నిర్దేశం చేశారని గుర్తుచేశారు. కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం ఇలాంటి ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు.ఘనంగా సర్టిఫికెట్ల పంపిణీ..ఈ ముగింపు సభలో వేసవి శిక్షణ తరగతుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు చైర్మన్ ఎంకే బేగ్, అతిథులు బండి రామకృష్ణ, లంకిశెట్టి బాలాజీల చేతుల మీదుగా సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పాఠశాలల్లో బోధనా నైపుణ్యాలు, మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంచడమే లక్ష్యం

### జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు






పెడన/ప్రజాభూమి ప్రతినిధి జిల్లాలో నిర్వహిస్తున్న ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్.ఎల్.ఎన్) శిక్షణ కార్యక్రమంలో భాగంగా, పెడన మండలంలోని బీజీకే జెడ్పీ హైస్కూల్‌లో జరుగుతున్న శిక్షణను జిల్లా విద్యాశాఖాధికారి యు. వి. సుబ్బారావు సందర్శించారు.ఈ సందర్భంగా శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో ఆయన సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణా కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని, విద్యార్థుల అభ్యాస ఫలితాలను మెరుగుపరిచేలా ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రాథమిక (ఫౌండేషనల్) స్థాయిలో విద్యార్థులకు చదవ డం, రాయడం, గణిత నైపుణ్యాలను పెంపొం దించ డంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. శిక్షణలో నేర్చు కున్న అంశాలను తరగతి గదుల్లో సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు.మధ్యా హ్న భోజన పథకంలో పరిశుభ్రత పాటించాలి అనంతరం పెడన పట్టణంలోని ఎంపీపీఎస్ 12వ వార్డు బంగ్లాలో నిర్వహి స్తున్న కుక్-కమ్-హెల్పర్స్ (సి.సి.హెచ్) శిక్షణా కార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలులో పరిశుభ్రత, నాణ్య తా ప్రమాణాలు, ఆహార భద్రతా నియమాలను వంట సిబ్బంది తప్పనిసరిగా పాటించాలని సూచించారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, రుచికరమైన భోజనాన్ని అందించడంలో ఎటువంటి అలసత్వాన్ని సహించేది లేదని పేర్కొన్నారు.



## గొల్లనపల్లి వసతి గృహంలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ప్రారంభం

### రాష్ట్రవ్యాప్తంగా 1,047 విద్యాసంస్థల ఎంపిక

### కృష్ణా జిల్లాలో 19 సంస్థల్లో కార్యక్రమం అమలు

### పనులను పరిశీలించిన సాంఘిక సంక్షేమ శాఖ డైరెక్టర్ లావణ్య వేణి



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గంలోని గొల్లనపల్లి సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో నెట్ జీరో హెల్తీ క్యాంపస్ కార్యక్రమం అధికారికంగా ప్రారంభమైంది. సాంఘిక సంక్షేమ శాఖ డైరె క్టర్ లావణ్య వేణి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. వసతి గృహ ప్రాంగణంలో జరుగుతున్న పనులను పరిశీలించిన ఆమె.. ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) సిబ్బంది, హార్ట్‌ఫుల్ నెస్ బృంద సభ్యులతో పనుల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు.పర్యావరణహిత ప్రాంగణాలుగా విద్యాసంస్థలురాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇతర విద్యా సంస్థలను పర్యావరణహితంగా మార్చేందుకు ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా అమ లు చేస్తోందని లావణ్య వేణి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1,047 విద్యాసంస్థలను ఈ ప్రాజెక్ట్ కింద గుర్తించగా, కృష్ణా జిల్లాలో 19 విద్యా సంస్థలు ఎంపికైనట్లు వివరించారు.ఆదర్శ నమూ నాగా 'అనంత ఆరణ్య 'గొల్లనపల్లి వసతి గృహాన్ని ఒక ఆదర్శ నమూనాగా అభివృద్ధి చేస్తున్నట్లు డైరెక్టర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా "అనంత ఆరణ్య" (Ultra High Density Plantation) విధానంలో 0.25 ఎకరాల విస్తీర్ణంలో 1,650కు పైగా మొక్కలను నాటుతున్నట్లు వెల్లడించారు. మొక్కల పెంపకం, సంరక్షణ, పనుల నాణ్యతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని, మొక్కల మనుగడను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. నెట్ జీరో హెల్తీ క్యాంపస్ ముఖ్య లక్ష్యాలుసౌర విద్యుత్: క్యాంపస్‌లలో సోలార్ వ్యవస్థల ఏర్పాటు.వ్యర్థాల నిర్వహణ: కంపోస్టింగ్ యూనిట్ల స్థాపన.జల సంరక్షణ: వర్షపు నీటి సంరక్షణ గుంతల నిర్మాణం.పచ్చదనం: అనంత ఆరణ్య నమూనాలో అధిక సాంద్రతతో మొక్కల పెంపకం. పర్యావరణ సమతుల్యత: కార్బన్ ఉద్గారాల తగ్గింపు, జీవ వైవిధ్య పరిరక్షణ, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల (SDGs) సాధన.భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన, పచ్చని పర్యావరణాన్ని అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని లావణ్య వేణి స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ కె. జగదీశ్వరరావు, ఏఎస్‌డబ్ల్యూఓ, హెచ్‌డబ్ల్యూఓ, ఉపాధి హామీ సిబ్బంది, హార్ట్‌ఫుల్‌నెస్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

## అతి చిన్న వయసులోనే డాక్టరేట్ సాధించిన భావ్య

### పలువురి అభినందనలు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ డ ఉండవల్లి శ్రీదేవి కుమార్తె ఉండవల్లి భావ్య అరుదైన రికార్డు సృష్టించారు. విద్యా రంగంలో అత్యున్నత ప్రతిభ కనబరుస్తూ, అతి చిన్న వయసులోనే ఆమె డాక్టరేట్ డిగ్రీని కైవసం చేసుకున్నారు. ఎంతో నిశ్శబ్దంగా, సౌమ్యంగా తన విద్యాభ్యాసాన్ని కొనసాగిస్తూ, పట్టుదలతో శ్రమించి ఈ గొప్ప మైలురాయిని అధిగమించడం విశేషం.చిన్న వయసులోనే ఇంతటి అత్యున్నత విద్యా పురస్కారాన్ని అందుకోవడం పట్ల పలువురు ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు మరియు సామాజిక వర్గాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భావ్య ప్రతిభను అభినందిస్తూ ఆమెకు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ఉండవల్లి శ్రీదేవి ఆశయాలకు అనుగుణంగా ఆమె కుమార్తె భావ్య విద్యా రంగంలో ఇంతటి ఉన్నత శిఖరాలను అధిరోహించడం గర్వకారణమని కొనియాడారు. నేటి యువతకు, ముఖ్యంగా విద్యార్థినులకు భావ్య ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని ఉన్నత పదవులను, విజయాలను అందుకోవాలని ఆకాంక్షించారు. తన కుమార్తె



సాధించిన ఈ ఘనత పట్ల తల్లి డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ఆనందం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా

## సైకిల్ తొక్కిన ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

భావితరాల బంగారు భవిష్యత్తు కోసం పర్యావరణ పరిరక్షణ, ఇంధన పొదుపు ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక 20వ డివిజన్‌లో సైకిల్ తొక్కి ప్రజలకు కాలుష్య నియంత్రణ, ఇంధన పొదుపుపై అవగాహన కల్పించారు.అనంతరం కృష్ణ కాలువ గట్టు సమీపంలోని పంపుల చెరువు ప్రాంతంలో కూటమి నాయకులు, కార్పొరేషన్ అధికారులతో కలిసి మొక్కలు నాటి వాటికి రక్షణ గార్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సైకిల్ వినియోగం ఆరోగ్యానికి, పర్యావరణానికి ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.హరిత ఏలూరు నిర్మాణంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చిన ఆయన, చెట్ల పెంపకమే భావితరాలకు నిజమైన సంపద అని పేర్కొన్నారు.కార్యక్రమంలో రాష్ట్ర మాలల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఈడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎ ఎం సి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారథి, డిప్యూటీ మేయర్ కర్రీ శ్రీనివాసరావు, నగర పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

నీట్ లీకేజీకి బాధ్యత వహించి

## ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి: ఏఐఎస్ఎఫ్

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఏఐఎస్ఎఫ్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు డి.శివకుమార్ డిమాండ్ చేశా రు.శుక్రవారం ఏలూరులోని ధర్నా చౌక్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వ హించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు సిద్ధమై రాసిన నీట్ పరీక్ష పేపర్ లీక్ కావడం దురదృష్టకరమన్నారు.వరుసగా జరుగుతున్న అవకతవకలకు కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు.విద్యార్థుల భవిష్యత్తుతో చెల గాటమాడుతున్న కేం ద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఎన్‌టిఏను రద్దు చేసి పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా, నగర నాయకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ దినోత్సవం

## సైకిల్‌పై డిఆర్‌సి సమావేశానికి వెళ్లిన ఎమ్మెల్యే చింతమనేని

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ వినూత్నంగా వ్యవహరిస్తూ ఇంధన పొదుపు, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు సందేశం ఇచ్చారు. ఏలూరులోని కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశం (డీఆర్సీ)కు జిల్లా పరిషత్ అతిథి గృహం నుంచి సైకిల్‌పై వెళ్లి అందరి దృష్టిని ఆకర్షించారు.ఇంధన వినియోగాన్ని తగ్గించడం, కాలుష్య నియంత్రణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. దేశ ఆర్థిక భద్రతకు ఇంధన పొదుపు అవసరమని, పర్యా వరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు.కాగా, గత నెల రోజులుగా తన ప్రత్యేక వాహనాన్ని వినియోగించకుండా సాధారణ వాహనంలోనే నియోజకవర్గ పర్యటనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ప్రజాప్రతినిధులు ఆచరణ ద్వారా సందేశం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.పర్యావరణ దినోత్సవం రోజున ఎమ్మెల్యే చేసిన ఈ చర్యకు ప్రజలు, పార్టీ నాయకులు ప్రశంసలు వ్యక్తం చేస్తున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం..

–ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బడేటి చంటి



ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఏలూరులోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు.అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించా రు.ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో భాగ స్వామ్యం కావడం ప్రజాప్రతినిధుల బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ, రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పనిచే స్తోందన్నారు.ఆర్థిక సవాళ్లు ఉన్నప్ప టికీ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రభుత్వం వెనుకడుగు వేయడం లేదని తెలిపారు.ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరిం చేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం ఉపయోగకరమైన వేదికగా మారిందన్నారు.

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : ఎమ్మెల్సీ సోము వీర్రాజు

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లపూడి మండలం అన్నదేవరపేట గ్రామంలో బుధవారం (జూన్ 5) మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి సీనియర్ నాయకులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. టిడిపి యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య మరియు స్థానిక నాయకులు, కూటమి కార్యకర్తలతో కలిసి ఆయన గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలను నాటారు.ఈ సందర్భంగా సోము వీర్రాజు మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం, పర్యావరణాన్ని పరిరక్షించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని పిలుపునిచ్చారు. టిడిపి యువ నాయకులు అల్లూరి విక్రమాదిత్య మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం, గ్లోబల్ వార్మింగ్ సవాళ్లను ఎదుర్కోవాలంటే విస్తృతంగా మొక్కలు నాటడం ఒక్కటే మార్గమని ఆయన స్పష్టం చేశారు. కేవలం మొక్కలు నాటడమే కాకుండా, అవి వృక్షాలుగా మారేంత వరకు వాటిని దత్తత తీసుకుని సంరక్షించాల్సిన బాధ్యతను గ్రామస్తులు తీసుకోవాలని కోరారు. ప్రకృతిని మనం కాపాడితే, ఆ ప్రకృతి మనల్ని కాపాడుతుంది. రాబోయే తరాలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి పచ్చని పర్యావరణం అని ఆయన తెలిపారు. బిజెపి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర మాట్లాడుతు అడవుల క్షీణత వల్ల కాలానుగుణంగా రావాల్సిన వర్షాలు పడటం లేదని, పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి ఇంటా ఒక మొక్కను నాటి, పచ్చదనాన్ని పెంపొందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పైడిమెట్ట ఎత్తిపోతల పథకం అధ్యక్షులు శ్రీ రామచంద్రమూర్తి, టీడీపీ నాయకులు కొఠారు వెంకట్రావు, తాళ్లపూడి మండల బిజెపి అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ, అన్నదేవరపేట జనసేన నాయకులు చెవ్వూరి



బంగారు రాజు, రాము, బీజేపీ నాయకులు ఎలుగుబంటి బాలకృష్ణ, పసుపులేటి దత్తాత్రేయులు, స్థానిక నాయకులు, జనసేన–టీడీపీ–బీజేపీ కూటమి ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణపై అందరూ కలిసికట్టుగా సాగాలని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు.

## పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత: ఎమ్మెల్యే బండారు

- పర్యావరణాన్ని కాపాడుకోకపోతే నష్టపోయేది మనమే.
- నా దేశం, నా బాధ్యత అనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ ముందడుగు వేయాలి.
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ
- మోదేకుర్రు పంచాయతీకి రూ.5.22 లక్షల విలువైన ఈ–కార్ట్ వాహనాల అందజేత

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

ప్రకృతి ప్రసాదించిన భూమి, నీరు, గాలి వంటి వనరులను సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పర్యావరణాన్ని కాపాడుకోకపోతే నష్టపోయేది మనమేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొత్తపేటలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాడపాలెంలోని తన నివాసం నుంచి కమ్మిరెడ్డిపాలెం వరకు సైకిల్‌పై ప్రయాణించిన ఎమ్మెల్యే, అక్కడి నుంచి కొత్తపేట బస్టాండ్ సెంటర్ వరకు భారీ సైకిల్ ర్యాలీలో పాల్గొన్నారు. ఈ ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, యువతతో పాటు ఎమ్మెల్యే మనవడు సత్యాన్స్ కూడా పాల్గొనడం విశేషం. అనంతరం మోదేకుర్రు గ్రామపంచాయతీకి ఓఎన్‌జీసీ రాజమండ్రి సీఎస్ఆర్ నిధులతో దీప్తి ఎడ్యుకేషనల్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ.5.22 లక్షల విలువైన రెండు ఈ–కార్ట్ వాహనాలను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి కలిసి పంచాయతీకి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ



కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, చెట్ల నరికివేతను అరికట్టాలని సూచించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి జ్యూట్ వంటి పర్యావరణహిత వస్తువులను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. గాలి, నీరు, భూమి కాలుష్యాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలను తగ్గించేందుకు ఇంధన పొదుపు అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలు, సైకిళ్ల వినియోగం పెరగడం వల్ల ఇంధన వినియోగం తగ్గడంతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రాష్ట్రంలో స్వచ్ఛ ఆంధ్ర––స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ "నా దేశం – నా బాధ్యత" అనే భావనతో ముందుకు వచ్చి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పిలుపునిచ్చారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌కు

## పూలమొక్క అందజేసిన ఎమ్మెల్యే బడేటి చంటి

ప్రజాభూమి ప్రతినిధి–ఏలూరు

జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం ఏలూరు కలెక్టరేట్ ప్రాంగణంలో ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే బడేటి చంటి మంత్రిని స్వాగతించి



శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ ఎం.జె. అభిషేక్ గౌడ్, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ రీజియన్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ జుత్తుగ నాగరాజు, డీసీఎంఎస్ ఛైర్మన్ చాగంటి మురళీకృష్ణ మంత్రికి పూలమొక్కలు, పూలబొకేలు అందజేశారు.కార్యక్రమంలో డీఆర్వో ఎల్. దేవకీదేవి, సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవో కె. లక్ష్మీప్రసన్నతో పాటు పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



### పర్యావరణ పరిరక్షణకు సైకిల్ పై ప్రచారం చేసిన వి గాంధీబాబు

ప్రజాభూమి ప్రతినిధి–వి.ఆర్.పురం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వి. గాంధీ బాబు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించే లక్ష్యంతో తన కార్యాలయం నుండి శుక్రవారం వివిధ వనమహోత్సవ కార్యక్రమాలకు సైకిల్ పై ప్రయాణించారు.

ఏ ఎస్ డి ఎస్ కార్యాలయం నుండి అటవీ శాఖ కార్యాలయం వరకు సైకిల్‌పై ప్రయాణిస్తూ పర్యావరణ సంరక్షణ, కాలుష్య నియంత్రణ మరియు పచ్చదనం పెంపు యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా గాంధీ బాబు మాట్లాడుతూ "పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. చెట్ల పెంపకం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం మరియు సైక్లింగ్ వంటి పర్యావరణహిత అలవాట్లను ప్రోత్సహించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చు" అని పేర్కొన్నారు.



## ప్రజాసమస్యల పరిష్కారానికి విశేష కృషి

పేరవరంలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట


ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. శుక్రవారం ఆయన ఆత్రేయపురం మండలం పేరవరంలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారు జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ఆకుల రామకృష్ణ, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పల్లి మంగాదేవి భీమరావు లతో కలిసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన పిలుపు మేరకు ఇంధన పొదుపులో భాగంగా ప్రజా దర్బార్ కు ఈ.వి స్కూటర్ పై వెళ్ళి పర్యావరణ స్పృహ చాటారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. అనంతరం ప్రజా దర్బార్ లో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో భాగంగా 45 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే బండారు అధికారులతో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు. మిగిలిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

- పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి
- పాలూరి సత్యానందం.

## "అమ్మ పేరుతో ఒక మొక్క" నాటాలి

ప్రజాభూమి ప్రతినిధి–కొత్తపేట

అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన "అమ్మ పేరుతో ఒక మొక్క" పిలుపును ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం కోరారు.మందపల్లి దేవస్థానం పాలకమండలి సభ్యులు కోటిపల్లి సుబ్బలక్ష్మి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని బోడిపాలెం వంతెన సమీపంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులు వంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ప్రస్తుత పరిస్థితుల్లో మొక్కలు నాటడం అత్యంత అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, అది వృక్షంగా ఎదిగే వరకు సంరక్షించాలని సూచించారు. రైతులు పొలాల గట్లు, ఖాళీ స్థలాల్లో నీడనిచ్చే, పండ్లను అందించే మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పిలుపునిచ్చారు."మనకు జన్మనిచ్చిన అమ్మను స్మరిస్తూ, భూమాతను కాపాడేందుకు 'అమ్మ పేరుతో ఒక మొక్క' కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలి" అని పాలూరి సత్యానందం అన్నారు.



ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ గొలకోటి వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు మద్దంశెట్టి శ్రీనివాసరావు, పాలాటి మాధవస్వామి, యువమోర్చా నాయకులు పాలూరి జయప్రకాశ్ నారాయణ, కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## అమ్మ పేరుతో మొక్కలు నాటిన బిజెపి శ్రేణులు

రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యదర్శి ఆధ్వర్యంలో పలుచోట్ల నాటిన మొక్కలు.

ప్రజాభూమి ప్రతినిధి–రామచంద్రపురం

ప్రపంచ పర్యావరణాన్ని పురస్కరించుకొని ప్రధాని మోదీ పిలుపు మేరకు డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం మండలం హసన్ బాద, ఆదివారపుపేట, కందులపాలెం గ్రామాలలో భారతీయ జనతా పార్టీ,కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో అమ్మ పేరున ఒక మొక్క కార్యక్రమంలో భాగంగా పలుచోట్ల మొక్కలను నాటారు.ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చ రాష్ట్ర కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కోనసీమ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి సలాది వీరబాబు, మండల బిజెపి అధ్యక్షుడు ఆకేటి శ్రీకృష్ణ, జిల్లా బిజెపి మండల బిజెపి ప్రధాన కార్యదర్శి పుల్లెల రామమూర్తి, మండల ఓ.బి.సి అధ్యక్షుడు ఇంధన సత్యనారాయణ తదితర బిజెపి నాయకులు పాల్గొన్నారు.హసన్ బాద గ్రామ పంచాయతీ ఆవరణలో డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కిసాన్ మోర్చ కార్యదర్శి నాగిరెడ్డి సతీష్ రావు మాట్లాడుతూ మానవ జీవనానికి పర్యావరణం ఆధారమని.స్వచ్ఛమైన గాలి, నీరు,నేల,పచ్చదనం మన ఆరోగ్యానికి, భవిష్యత్ తరాలకు ఎంతో అవసరమని ప్రస్తుతం





పెరుగుతున్న కాలుష్యం, అడవుల నరికివేత, వాతావరణ మార్పులు ప్రపంచానికి పెద్ద సవాలుగా మారాయని,ఈ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని,ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని నీటిని ఆదా చేయాలనీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్థులను కోరారు.చిన్న చిన్న చర్యలే పెద్ద మార్పులకు దారి తీస్తాయని తెలియజేశారు.మోదీ 12 సంవత్సరాల సుపరిపాలనలో జరిగిన అభివృధి గురించి వివరించారు.

ఈ కార్యక్రమంలో బిజెపి నేతలు కిసాన్ మోర్చ నేతలు,పంచాయితీ కార్యదర్శి సబ్బెళ్ల ప్రసాద్ రెడ్డి,సచివాలయం రెవిన్యూ సిబ్బంది,స్థానికులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సోము వీర్రాజు పిలుపు

## అమ్మ పేరిట ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తాళ్లపూడి మండలంలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమాన్ని బీజేపీ ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడి మండల బీజేపీ అధ్యక్షులు ఇందుగుల రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర విచ్చేశారు.ఈ సందర్భంగా వేగేశ్వరపురం హైస్కూల్ ఆవరణలో మరియు అన్నదేవరపేట బంకు సమీపంలో ముఖ్య అతిథులు, నాయకులు కలిసి మొక్కలు నాటారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ముఖ్య అతిథి సోము వీర్రాజు మాట్లాడుతూ... "మొక్కలు మనకు ప్రాణాధారమైన ఆక్సిజన్ (ప్రాణవాయువు) అందిస్తాయి, మన నుండి కార్బన్ డై ఆక్సైడ్‌ను గ్రహించి పర్యావరణాన్ని కాపాడతాయి. ప్రకృతిని రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రతి ఒక్కరూ తమ తల్లిపై ఉన్న ప్రేమతో, పర్యావరణ పరిరక్షణ కోసం 'అమ్మ పేరిట' కనీసం ఒక మొక్కనైనా నాటి, దాన్ని సంరక్షించాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కైగాల శ్రీనివాస్, రాధాకృష్ణ, మల్లిపూడి రాజేష్, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కూటమి నాయకులు మరియు స్థానిక



ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# కూటమి రెండేళ్ల పాలనలో సంబరాలు - వైసిపి నిరసన ఆందోళనలు.

- రామచంద్రపురంలో ఇరు పార్టీలు శ్రేణులు ఒకరిపై ఒకరు ఆరోపణలు.
- రెండేళ్ల పాలనలో అభివృద్ధి సంక్షేమం భేష్ అని కూటమి.
- ఇచ్చిన హామీలు గాలికి వదిలేసారని వైసీపీ శ్రేణులు.
- నిరసన, ఆందోళన మధ్య మేనిఫెస్టో పత్రాలు తగలబెట్టిన వైసీపీ శ్రేణులు





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

రెండేళ్ల కూటమి ప్రభుత్వం పాలనలో కూటమి శ్రేణులు కేకులు కట్ చేసి సంబరాలు జరుపుకుంటూ తమ ప్రభుత్వం రెండేళ్ల కాలంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిందంటూ ప్రచారం హోరెత్తిస్తుండగా,మరోపక్క రెండేళ్ల పాలనలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేశారంటూ నాడు చంద్రబాబు టిడిపి తరఫున విడుదల చేసిన మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేసి వైసీపీ శ్రేణులు నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపట్టి రాష్ట్ర ప్రజలకు తమ గళాన్ని వినిపిస్తున్నారు. ఈ మేరకు గురువారం కూటమి పార్టీ శ్రేణులు, వైసిపి శ్రేణులు, తమ తమ గళాన్ని రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు వినిపించారు. ముఖ్యంగా రామచంద్రపురం పట్టణంలో గురువారం రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తండ్రి వాసంశెట్టి సత్యం , కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో ఆయా పార్టీల శ్రేణులతో కేకును కట్ చేసి ప్రభుత్వ రెండేళ్ల పాలనలో విజయోత్సావం కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకుని స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా తమ ప్రభుత్వం రెండేళ్ల పాలల్లో ప్రజలకు చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజల ముందుకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా వైసిపి కుట్రపూరిత ప్రచారాలు చేస్తుందంటూ ఓ రేంజ్‌లో విరుచుకుపడి గతంలో వైసిపి పార్టీ ద్వారానే రాష్ట్రానికి కనీసం రాజధాని లేని రాష్ట్రంగా తయారు చేసిందని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ప్రస్తుతం తమ నాయకుడు చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చి తీర్చిదిద్దేందుకు పనుల వేగవంతంగా కొనసాగుతున్నాయని చెప్పుకొచ్చారు. దీంతో ఈ ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి , సంక్షేమాన్ని చూసి వైసిపి జీర్ణించుకోలేకపోతుందని హలో ఆరోపణలు గురువారం కూటమి పార్టీ శ్రేణుల ఆరోపించారు. ఇదిలా ఉండగా రామచంద్రపురం నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో గత రెండు రోజుల నుండి కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమీ లేదని ప్రచారం చేస్తూ తమ గళాన్ని వినిపిస్తున్నారు. బుధవారం రామచంద్రపురం పట్టణంలో పార్టీ కార్యాలయం వద్ద రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఆయన తనయుడు ఇన్చార్జి పిల్లి సూర్యప్రకాష్ నియోజకవర్గం వైసీపీ పార్టీ శ్రేణులతో భారీ సమావేశం ఏర్పాటు చేసి కూటమి పార్టీ రెండేళ్ల పాలనలో వైసిపి శ్రేణుల పట్ల అవలంబించిన తీరుతోపాటు ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల ముందుకు తీసుకువెళ్లారు. ముఖ్యంగా కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో కనీసం వృద్ధులకు పెన్షన్లు కానీ, గూడులేని ప్రజలకు ఇళ్ళపట్టాలు గానే ఇంటి నిర్మాణాలు గానీ ఇచ్చే ప్రయత్నమే చేయలేదని విమర్శలు గుప్పించారు. ఇలాంటివన్నీ తమ నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హయాం లోనే జరుగాయని చెప్పుకొచ్చారు. అలాగే గురువారం కాజులూరు మండలం గొల్లపాలెంలో కాకినాడ -కోటిపల్లి ప్రధాన రహదారిలో రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద భారీగా వైసీపీ శ్రేణులు చేరి కోటకు ప్రభుత్వం రెండేళ్ల పాలల్లో ప్రజా వ్యతిరేక విధానంలో ఎండ కొడుతూ ఇచ్చిన హామీలను నెరవేర్చ లేదు అంటూ నాడు చంద్రబాబు నాయుడు ఇచ్చిన మేనిఫెస్టో ప్రజలను సైతం దగ్ధం చేసి తమ నిరసన గళాన్ని విప్పి ఆందోళన చేపట్టే ప్రజలకు వినిపించారు. ఏది ఏమైనాపటికి గత రెండేళ్ల పాలల్లో కూటమి ప్రభుత్వం ఓరేంజ్ లో అభివృద్ధి సంక్షేమం చేసిందని చెప్పుకుంటుంటే, అలాంటిదేమీ జరగలేదని వైసీపీ శ్రేణులు తమ నిరసనగలాళాన్ని వినిపించి ప్రజల్లోకి తమ తమ పార్టీల అది నేతల పిలుపుమేరకు ప్రజల్లోకి వెళ్తున్నారు. ఏది ఏమైనా రానున్న స్థానిక సంస్థల్లో తమ ఆధిపత్యాన్ని చూపించుకునేందుకే అటు కూటమి ప్రభుత్వం ,ఇటు వైసిపి శ్రేణులు తమ గళాలను వినిపిస్తున్నాయని రాజకీయ ప్రముఖులతోపాటు ప్రజల సైతం పేర్కొంటున్నారు.

# మొక్కుబడి సమాధానాలకు తావులేదు

- అర్జీల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి
- కలెక్టర్ కీర్తి చేకూరి

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం, మొక్కుబడి సమాధానాలకు తావులేకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. "ఒక నియోజకవర్గం - నాలుగు వారాలు" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కొవ్వూరులో నిర్వహించిన మూడో వారపు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ (పీ.జి.ఆర్.ఎస్.) కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం 36 అర్జీలను స్వీకరించారు.గత రెండు వారాల్లో స్వీకరించిన పలు అర్జీల పరిష్కార వివరాలను సంబంధిత తహసీల్దార్లు, అధికారులు సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, అర్జీల విషయంలో కేవలం మొక్కుబడి సమాధానాలు ఇచ్చి పరిష్కరించినట్లు పేర్కొంటే సంబంధిత అధికారులు, సిబ్బందినే బాధ్యులుగా పరిగణిస్తామని హెచ్చరించారు. పరిష్కారం కాని అర్జీల విషయంలో వాస్తవ పరిస్థితులను ఎండార్స్‌మెంట్‌లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. తదుపరి గ్రీవెన్స్ కార్యక్రమానికి అర్జిదారులను కూడా తీసుకురావాలని, పరిష్కారం చేసిన అర్జీలపై వారి సంతృప్తి స్థాయిని స్వయంగా తెలుసుకుని ఎండార్స్‌మెంట్ పత్రాలను అందజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్జీల పరిష్కార ప్రక్రియలో క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి, వాస్తవ సమాచారం ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలని చెప్పారు. ప్రజలకు ప్రభుత్వం నేరుగా జవాబుదారీతనంతో సేవలు అందించాలనే ఉద్దేశంతోనే నియోజకవర్గ స్థాయిలో పీ.జి.ఆర్.ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.అర్జీల పరిష్కారంలో హేతుబద్ధత, జవాబుదారీతనం, మార్గదర్శకాల ప్రకారం నిర్ణీత గడువులో చర్యలు చేపట్టాలని కలెక్టర్ కీర్తి చేకూరి సూచించారు. నిర్లక్ష్య ధోరణి ప్రదర్శించే అధికారులను ఉపేక్షించబోమని హెచ్చరించారు.కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, తూర్పు గోదావరి జిల్లాలో తొలిసారిగా స్థానిక ప్రజాప్రతినిధుల సమక్షంలో నియోజకవర్గ స్థాయిలో పీ.జి.ఆర్.ఎస్ కార్యక్రమం నిర్వహించడం విశేషమన్నారు. మొదటి వారంలో 70, రెండో వారంలో 34, మూడో వారంలో 36 అర్జీలు స్వీకరించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరై చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిందన్నారు.

"ఒక నియోజక వర్గం - నాలుగు వారాలు" కార్యక్రమంలో భాగంగా జూన్ 12న చివరి విడత పీ.జి.ఆర్.ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు ఇప్పటివరకు స్వీకరించిన అర్జీల పరిష్కార వివరాలతో కూడిన ఎండార్స్‌మెంట్ పత్రాలను అర్జిదారులకు



అందజేస్తామని చెప్పారు. ప్రజల సంతృప్తికే ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. జాయింట్ కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ప్రజల నుంచి స్వీకరించిన ప్రతి అర్జీపై క్షేత్రస్థాయిలో సమగ్ర విచారణ నిర్వహించి నాణ్యమైన పరిష్కారం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్జీల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో స్పందన అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజల సంతృప్తినే ప్రామాణికంగా తీసుకుని శాఖల మధ్య సమన్వయంతో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్డీవో కె. ఆనందరావు, తహసీల్దార్లు డి. దుర్గాప్రసాద్, లక్ష్మీ లావణ్య, ఎం. మెరికమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## బుట్టాయగూడెం తహశీల్దార్‌గా విధులు చేపట్టిన డి. ప్రమెద్వర.




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

బుట్టాయిగూడెం మండల రెవెన్యూ అధికారి (తహశీల్దార్) గా డి.ప్రమెద్వర బాధ్యతలు చేపట్టారు. చింతలపూడి తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూ, ఎస్ ఐ ఆర్ నేపథ్యంలో సాధారణ బదిలీలలో భాగంగా ప్రమెద్వర బుట్టాయగూడెం తహశీల్దారుగా బదిలీ అయ్యారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం తహసీల్దారుగా ఆమె విధులు చేపట్టారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్‌గా పనిచేసిన రాధాకృష్ణను కొయ్యలగూడెం డిప్యూటీ తహశీల్దారుగా బదిలీ చేశారు.

## ఖతర్‌లో నర్సులకు విదేశీ ఉద్యోగావకాశాలు

ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్ఎస్‌డీసీ), ఆంధ్రప్రదేశ్ ఓవర్సీస్ మానవ వనరుల సంస్థ (ఓఎంసీఏపీ) ఆధ్వర్యంలో ఖతర్‌లోని దోహా నగరంలో హోమ్ కేర్ నర్సుల నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎన్. జితేంద్రబాబు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ లేదా జీఎన్ఎం అర్హతతో పాటు కనీసం రెండేళ్ల అనుభవం ఉన్న 21 నుంచి 40 సంవత్సరాల మధ్య వయస్సు గల మహిళలు, పురుషులు ఈ ఉద్యోగాలకు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు ఖతర్ కరెన్సీలో 5 వేల రియాల్స్ (సుమారు రూ.1.30 లక్షలు) వేతనం లభిస్తుందని, వీసా, విమాన ప్రయాణం, వసతి, వైద్య సదుపాయాల ఖర్చులను యాజమాన్యమే భరిస్తుందని తెలిపారు. రెండేళ్ల ఒప్పంద ప్రాతిపదికన నియామకాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు అవసరమైన విద్యార్హత, అనుభవ ధ్రువపత్రాలతో జూన్ 8లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99888 53335 నంబర్‌ను సంప్రదించవచ్చని తెలిపారు.

# మానవాళి మనుగడకు చెట్లే ప్రధాన ఆధారం

- పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యతగా భావించండి.
- రామచంద్రపురంలో కూటమి శ్రేణులు సైకిల్ ర్యాలీ.





ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు రామచంద్రపురంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కూటమి నాయకులు వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ ర్యాలీ తెలుగుదేశం పార్టీ కార్యాలయం నుంచి ప్రారంభమై మెయిన్ రోడ్డు మీదుగా రాజగోపాల్ సెంటర్ వరకు సాగింది.ఈ సందర్భంగా సత్యం మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని మానవాళి మనుగడకు చెట్లు ప్రధాన ఆధారమని, స్వచ్ఛమైన గాలి, సమృద్ధిగా వర్షాలు, పర్యావరణ సమతుల్యత చెట్ల ద్వారానే సాధ్యమవుతాయని పేర్కొన్నారు.అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, అధిక ఉష్ణోగ్రతలు ప్రపంచానికి సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ సైకిల్ వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా ఇంధన వినియోగాన్ని తగ్గించడంతో పాటు వాయు కాలుష్యాన్ని నియంత్రించవచ్చని తెలిపారు. సాధ్యమైనంత వరకు రోజువారీ జీవితంలో సైకిళ్ల వినియోగాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు.ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, నీటి వనరులను కాపాడాలని, పరిశుభ్రమైన పరిసరాల కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. నియోజకవర్గం పరిశీలకురాలు మజ్జి పద్మావతి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ఒక రోజు కార్యక్రమం కాదని, నిరంతర బాధ్యతగా భావించి భవిష్యత్ తరాలకు హరితమైన భూమిని అందించాలని అన్నారు.ఈ సైకిల్ ర్యాలీలో నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, పట్టణ మహిళ అధ్యక్షురాలు వజ్రపు రాజేశ్వరి, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువత, ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా ముగిసిన ర్యాలి ప్రీమియర్ లీగ్-2 క్రికెట్ టోర్నమెంట్

ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ర్యాలి ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్)-2 రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ముగిసింది. గత రెండు సంవత్సరాలుగా నిర్వహిస్తున్న ఈ టోర్నమెంట్‌కు క్రీడాభిమానుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. గత ఏడాది 30 జట్లు పాల్గొనగా, ఈసారి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 62కు పైగా జట్లు పోటీలో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నాయి. టోర్నమెంట్ ప్రారంభం నుంచి లీగ్ దశ వరకు ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లు ప్రేక్షకులను అలరించాయి. ఫైనల్ పోరులో ర్యాలి జట్టు, తణుకు జట్టు తలపడగా, తొలుత బ్యాటింగ్ చేసిన ర్యాలి జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 71 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన తణుకు జట్టు కేవలం 7 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి విజయాన్ని అందుకుంది. ఈ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తనయుడు, యువనాయకుడు బండారు సంజీవ్ హాజరై ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించారు. అనంతరం విజేత



జట్టుకు రూ.70 వేల నగదు బహుమతితో పాటు ట్రోఫీని, రన్నరప్ జట్టుకు రూ.30 వేల నగదు బహుమతితో పాటు షీల్డ్‌ను అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఒకప్పుడు అరణ్యాన్ని తలపించే స్థితిలో ఉన్న ఈ మైదానాన్ని క్రీడలకు అనుకూలంగా తీర్చిదిద్ది రాష్ట్ర స్థాయి టోర్నమెంట్‌లు నిర్వహించే స్థాయికి తీసుకువచ్చిన యువనాయకుడు బండారు సంజీవ్‌కు గ్రామ యువత, పెద్దల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ యువతలో క్రీడాస్ఫూర్తి పెంపొందించడంలో ఇలాంటి పోటీలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆత్రేయపురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కుసంపూడి రామకృష్ణంరాజు (బాబు), సీనియర్ నాయకులు మద్దూరి సుబ్బారావు, కొత్తపేట డివిజన్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు పాలింగి రవిచంద్ర, బ్యాంకు చైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, నామాల యేసు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి గుడేల నాగేంద్ర, తదితరులు పాల్గొన్నారు. క్రీడాకారులు, గ్రామ యువత, క్రీడాభిమానులు భారీ సంఖ్యలో హాజరై టోర్నమెంట్ విజయవంతం కావడంలో భాగస్వాములయ్యారు.

## విఆర్ పురం బీజేపీ ఆద్వర్యంలో అమ్మ పేరిట ఒక మొక్క కార్యక్రమం



ప్రజాభూమి ప్రతినిధి-వి.ఆర్.పురం

భారతీయ జనతా పార్టీ ఆదేశాల మేరకు, మండల బీజేపీ ఆద్వర్యంలో నాయకులు కార్యకర్తలు, నూతన పోలీస్ స్టేషన్ నందు 12 మొక్కల" అమ్మ పేరట ఒక మొక్క" కార్యక్రమంనీ నిర్వహించారు. ప్రధాని మోడీ సుదీర్ఘ 12 ఏళ్ల పాలనలో దేశం ఆర్థికంగా, సాంకేతికంగా ముందుకు దూసుకుపోవడమే కాకుండా, పర్యావరణ పరిరక్షణలోనూ ప్రపంచానికి ఆదర్శంగా నిలిచింది. ఇందులో భాగంగానే, నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని (జూన్ 5) పురస్కరించుకుని, ప్రతి ఒక్కరూ తమ తల్లి పట్ల గల గౌరవంతో పాటు ప్రకృతి పట్ల బాధ్యతను చాటుకునేలా ఈ 12 మొక్కల "అమ్మ పేరిట ఒక మొక్క" కార్యక్రమంనీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముత్యాల రాంబాబు, సొంది నాగేశ్వరావు (మండల కార్యదర్శి), ఉయిక రత్తయ్య (డివిజన్ నాయకులు ), బొర్రా కామేశ్వరి (జిల్లా కార్యదర్శి), ఉయిక శంకర్ (యువర్ మోర్చా అధ్యక్షులు), సన్యాసి మల్లయ్య (సీనియర్ నాయకులు), కుందూరు పావని (మహిళా మోర్చా నాయకురాలు), కడుపు వెంకటరమణ, గుటాల రాంబాబు, నాలారపు దివాకర్, తదితరులు పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల కల్పించాలని కలెక్టర్ కు విన్నపం

ప్రజాభూమి ప్రతినిధి-తాళ్లపూడి



తాళ్లపూడి మండలం ప్రక్కిలంక గ్రామ పరిధి లోకి వచ్చే పైడిమెట్ట గ్రామానికి చెందిన పలు సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందించినట్లు బాబు జగజీవన్ రావ్ సమైక్య సంఘ అధ్యక్షులు జొన్నకూటి ప్రమోద్ కుమార్ తెలిపారు. పైడిమెట్ట గ్రామంలో మాదిగ సామాజిక భవ నం స్థలం ఆక్రమణలకు గురికాకుండా చూడాలని, ఆస్థలంలో మంచి నీటి కుళాయి, సామాజిక భవనానికి విద్యుత్ సదుపాయం కల్పించాలని, సామాజిక భవనం చుట్టూ ప్రహరీ గోడ నిర్మిం చాలని కోరారు. అలాగే గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్య కు పరిస్కారంగా 3 ఫేజ్ కరెంట్ నిరంతరాయంగా ఉండేలా ట్రాన్సఫార్మర్స్ ఏర్పాటు చేయాలనీ వేరు వేరు వినతి పత్రాలను అందించామని పేర్కొన్నారు. కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం లో జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి, కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, రెవిన్యూ డివిజన్ అధికారి ఆనందరావు అధ్యక్షతన జరిగిన ప్రజా సమస్యల పరిస్కార వేదికలో ఫిర్యాదు చేసినట్లు ప్రమోద్ కుమార్ తెలిపారు.గ్రామ పెద్దలు పసలపూడి ఆశీర్వాధం, కొప్పాక జవహర్, జగ్గజీవన్ సమైఖ్య అధ్యక్షు లు జొన్నకూటి ప్రమోద్ కుమార్, కొల్లి చినబాబు, కొడమంచిలి విమల్, కొప్పాక రాంబాబు లు పాల్గొన్నారు.

## తల్లి పేరుతో ఒక మొక్క

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అడవి నెక్కలం పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠ శాలలో గురువారం మొక్కల నాటకం, ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు కార్యక్రమాలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు పి.వి. రమణ తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఆనంద్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5 నుంచి సెప్టెంబర్ 30 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించే కార్య క్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా "ఏక్ పేడ్ మాకే నామ్ 3.0" కార్యక్ర మం కింద ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్క నాటి దాని సంరక్షణ బాధ్యత తీసుకోవా లని సూచించారు. అలాగే నీటి, శక్తి పొదుపు, వ్యర్థాల నిర్వహణ, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపు, ఆరోగ్యకర జీవనశైలిపై అవగాహన కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యత

-కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన లోక్ అదాలత్ చైర్మన్.




ప్రజాభూమి ప్రతినిధి-రామచంద్రపురం

పర్యావరణ పరిరక్షణ మన అందరి బాధ్యతని,ప్రకృతి లేనిదే ప్రగతి లేదని పర్యావరణం లేనిదే పరవశం లేదని పర్యావరణాన్ని కాపాడితేనే మనం బ్రతుకుతామని లేకపోతే మన బ్రతుకులు ప్రశ్నార్థకమే అవుతుందని రామచంద్రాపురం మండల లోక్ అదాలత్ చైర్మన్,13వ అదనపు జిల్లామరియు సెషన్స్ కోర్టు జడ్జ్ బి. హెచ్ వి లక్ష్మీ కుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆమె కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటారు.రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటిపల్లి లావరాజు ఈసంధర్భంగా మాట్లాడుతూ గాలి నీరు నేల పవిత్రమని వాటిని కలుషితం చేయవద్దని ప్లాస్టిక్ వాడకం ప్రతి ఒక్కరూ నిషేధించాలని రేపటి తరాలకు పచ్చని ప్రకృతిని బహుమతిగా అందించాలని అన్నారు. అనంతరం పట్టణంలో మండల లోక అదాలత్ ఆధ్వర్యంలోర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు,మహిళా న్యాయవాదులు, లోక్ అదాలత్ ప్యానల్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి: ఎంపీడీవో వెంకటలక్ష్మి

ప్రజా భూమి ప్రతినిధి-జీలుగుమిల్లి



ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా తాటి ఆకుల గూడెం పంచాయతీ నందు మొక్కలు నాటే కార్యక్రమంలో జీలుగుమిల్లి ఎంపీడీవో కె వెంకటలక్ష్మి పాల్గొన్నారు ఉపాధి హామీ ఏపీవో, టీ ఏ, బీఫ్ట్, ఫ్ ఏ,లు మరియు జనసేన మండల అధ్యక్షులు పసుపులేటి రాము కూటమి నాయకులు సుంకవల్లి సాయి, సర్పంచ్ వనమా రాంబాబు జనసేన ప్రెసిడెంట్ రాయి సుబ్బారావు, మరియు పంచాయతీ సెక్రెటరీ, ఉపాధి హామీ శ్రామికులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణ సామాజిక బాధ్యత

## -: ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సైకిల్ తొక్కిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం




సమాజంలోని ప్రతి ఒక్కరూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మరియు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం నగరంలోని అనంతపురం కలెక్టరేట్ నుంచి ఉప్పరపల్లిలోని యాక్సియన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మరియు ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రారంభించారు. ముందుగా ప్రజలకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి జిల్లా కలెక్టర్ కొంత దూరం వరకు ఈ సైకిల్ ను తొక్కారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగానే కాకుండా వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని, ప్రకృతి తల్లిలాంటిదని, పకృతికి ప్రాణాధారమైన చెట్లు ప్రాణికోటికి ప్రాణాధారమని పేర్కొంటూ మొక్కల యొక్క విశిష్టతను తెలియజేశారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ తమ చుట్టూ ఉన్న పరిసరాలను పచ్చదనంతో నింపాలని ఆయన ఆకాంక్షించారు. సామాజిక అడవుల పెంపకం ద్వారా గ్రామీణ ఉపాధి హామీ పథకం భాగస్వామ్యంతో ప్రజలకు ఒకవైపు ఉపాధి కల్పిస్తూనే పచ్చదనాన్ని పెంచడం జరుగుతుందన్నారు. మొక్కలను వ్యక్తిగతంగా అభిమానిస్తూ మన ఇంటి పరిసరాల్లో మనకు చేరువలో పచ్చదనాన్ని ఉంచుకోవాలని యువతను కోరారు. మనం నాటిన మొక్కలను మనమే క్రమం తప్పకుండా సంరక్షించే బాధ్యతను కూడా స్వీకరించాలని తెలిపారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూర దృష్టితో పర్యావరణ పరిరక్షణ ప్రభుత్వ ధ్యేయంగా మలుచుకుంటూ రాష్ట్ర అభివృద్ధిని హరిత దిశలో నడిపిస్తున్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో కనీసం ఒక 50 రెసిడెన్షియల్ పాఠశాలలు వసతిగృహాలు, నెట్ జీరో కాన్సెప్ట్ లో అంటే ఎటువంటి కార్బన్ బయటికి వెళ్లినది సీక్వెస్ట్ ట్రేడ్ చేసినట్లు నెట్ జీరో కాన్సెప్ట్ లో కూడా ఒక 50 హాస్టల్స్ అండ్ రెసిడెంట్ ఇన్స్టిట్యూషన్ ని కన్వర్ట్ చేయాలని ఆదేశాలు ఇవ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా ఈ లొకేషన్స్ లో అల్ట్రా హైడెన్సిటీ ప్లాంటేషన్స్ అంటే కనీసం ఒక 25 సెంటర్ నుంచి రెండు, మూడు సెంట్లు వరకు ప్రాంతాన్ని గుర్తించి దానిలో కూడా అల్ట్రా హైటెక్ సిటీ ప్లాంటేషన్స్ చేసుకోవడం, అలాగే సోప్ బిట్స్ లేదా రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ సోలార్ ఎన్.ఆర్.డి క్యాప్ హెల్ప్ తో స్టేట్ లెవెల్ లోనే టెండర్ కి వెళ్లి వెళ్ళిపోతున్నారని, సుమారుగా ఒక 50 దాకా ఆ ఇన్స్టిట్యూషన్ ని నెట్ జీరో కి చేయడం కూడా మొదలుపెడుతున్నట్లు తెలిపారు. ప్రతి మండలంలో ప్రతి సచివాలయాల్లో విరివిగా చెట్లు నాటే కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తనబంతులు, అలాగే మన జిల్లాలో 13 లక్షల విత్తన బంతులు, 1 కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టే దిశగా సమాయత్తమవుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఆరోగ్యవంతమైన వాతావరణంలో ఉండాలని, పర్యావరణానికి పెనుముప్పుగా మారిన కాలుష్యం తదితర లాంటి వాటిపై అవగాహనను కలిగి ఉండాలన్నారు. ఈ సీజన్ లో మొక్కలు నాటడమే కాకుండా విత్తన బంతుల్ని మొత్తం వర్షానికి ముందు ముందు అంతట వెదజల్లడానికి శ్రీకారం చుడుతున్నట్లు తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాలి : ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ పర్యావరణంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# మహిళల భద్రత, హక్కులపై ప్రత్యేక అవగాహన -అదనపు ఎస్పీ కేవీ మహేష్

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మహిళల భద్రత, సంక్షేమం చట్టపరమైన హక్కులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని హిందూపురం అడిషనల్ ఎస్పీ కేవి మహేష్ పేర్కొన్నారు. శుక్రవారం హిందూపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాల, బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కేవీ మహేష్ మహిళలకు భద్రతా చర్యలు, ప్రభుత్వ పరిరక్షణ వ్యవస్థలు, చట్టపరమైన రక్షణల గురించి వివరించారు. మహిళలు ఎలాంటి వేధింపులు, హింస, ఇతర సమస్యలను ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112, 100 అత్యవసర సేవలను వినియోగించుకోవడంతో పాటు శక్తి యాప్ ద్వారా కూడా ఫిర్యాదులు నమోదు చేసి తక్షణ సహాయం పొందవచ్చని తెలిపారు. స్థానికంగా ఏదైనా సమస్య ఎదురైనప్పుడు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించి రక్షణ పొందాలని సూచించారు. మహిళలపై జరిగే నేరాల నివారణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొంటూ చట్టాలపై అవగాహన పెంపొందించుకోవడం ద్వారా తమ హక్కులను కాపాడుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో సీఐ అబ్దుల్ కరీం, ఎస్ఐ ప్రసన్న,

# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరి బాధ్యత

## -మొక్కలు నాటడంతో పాటు సంరక్షించాలి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



పర్యావరణ పరిరక్షణకు విరివిగా మొక్కలు నాటడం తో పాటు వాటిని సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హిందూపురం పట్టణం లోని పెనుకొండ రోడ్ డివైడర్లపై కమిషనర్ తో పాటు ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, డాక్టర్ సురేంద్ర, బాలాజీ మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించాలంటే ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. హిందూపురం పట్టణాన్ని మరింత పచ్చదనంతో తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మొక్కలు మనిషి జీవనానికి ప్రాణాధారమని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణపై అందరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపు నిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా అందరికీ సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్లు వాణి, మదన్ మోహన్, జనార్ధన్, శానిటరీ ఇన్స్ పెక్టర్లు నిజాం, కేశవ, మెప్మా డీఎంసీ గంగులయ్య, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, సీనియర్ నాయకులు అమర్నాథ్, మాజీ కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని మొక్కలు నాటారు. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్ ఫర్ ఉమెన్స్ విద్యార్థినులు, శ్రీనివాస ఐటీఐ కళాశాల విద్యార్థులు, మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.

# సిద్దేశ్వర స్టీల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను పరిశీలించిన: జిల్లా కలెక్టర్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



రాయదుర్గం మండలంలోని బి.ఎన్.హళ్లి గ్రామం వద్దనున్న గవి సిద్దేశ్వర స్టీల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను శుక్రవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పరిశీలించారు. గవి సిద్దేశ్వర స్టీల్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ మొత్తం 22.26 ఎకరాల్లో విస్తరించి ఉండగా, పరిశ్రమ గురించిన వివరాలను, సమగ్ర సమాచారాన్ని ఏపీపీసీబీ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీపీసీబీ పర్యావరణ ఇంజనీర్ ఎం.శశికళ, తహసీల్దార్ హరికుమార్, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకం నిర్మూలనతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాభూమి, హిందూపురం టౌన్



మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణం దెబ్బతినకుండా కాపాడుకోవచ్చని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సుదర్శన్ పేర్కొన్నారు. దీనికి తోడు దీనికి తోడు ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలన్నారు. జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అదనపు జిల్లా న్యాయస్థానం ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ, పర్యావరణం దెబ్బ తినడానికి ప్రధాన కారణం ప్లాస్టిక్ వాడకమేనన్నారు. ప్లాస్టిక్ ను నిషేధించడంతోపాటు విరివిగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఓ మొక్క నాటి కాపాడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# చిన్నారుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

## –రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి

ప్రజాభూమి, హిందూపురం టౌన్



బాలసదనంలలో ఆశ్రయం పొందుతున్న చిన్నారుల పట్ల నిర్వాహకులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ మూర్తి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికా సదన్, సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రేమ సదన్ ను ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాలలో పిల్లలకు కల్పిస్తున్న వసతి, సౌకర్యాలు, ఆధార్ కార్డులు, కుల ధ్రువీకరణ పత్రాలు, పిల్లలకు అందించబడుతున్న ఆరోగ్య పరిరక్షణ చర్యలు, విద్య గురించి పరిశీలించి ఆయా అంశాలను సక్రమంగా పిల్లలందరికీ సమకూరే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల సంక్షేమం ప్రభుత్వం మాత్రమే కాక సమాజం మొత్తం బాధ్యతగా పేర్కొన్నారు. ప్రతి చిన్నారి భయరహిత, సురక్షిత, ప్రేమాభిమానాలతో కూడిన వాతావరణంలో ఎదగాలన్నారు. పిల్లలకు నాణ్యమైన విద్యతో పాటు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాభివృద్ధి, భావోద్వేగ పరిరక్షణ కూడా ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ అధికారి మహేష్, హిందూపురం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ సిడిపిఓ సుధా వరలక్ష్మీ , సంరక్షణ అధికారులు నాగలక్ష్మి, మురళీధర్, బాలసదనం ఇన్చార్జ్ నాగజ్యోతి, అకౌంటెంట్ గౌతమి, శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ నిర్వాహకులు రామ్ కుమార్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి -కరపత్రాలను విడుదల చేసిన రాజకీయ పార్టీల నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని ఆర్.అండ్.బి. అతిథి గృహ ఆవరణలో రాజకీయ పార్టీల నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 9వ తేదీన రాజకీయ పార్టీలు, వామపక్ష పార్టీల ఇచ్చిన పిలుపుమేరకు పెంచిన పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న నిరసన కార్యక్రమ విజయవంతంపై చర్చించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, మే నెల నుంచి నేటికీ నాలుగు సార్లు డీజిల్, పెట్రోల్, గ్యాస్, వాణిజ్య గ్యాస్ ధరలను భారీగా పెంచారని పేర్కొన్నారు. దీని ఫలితంగా చిన్న వ్యాపారులు కుదేలతో వ్యాపారాలు దివాలా తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సామాన్య ప్రజలు మొదలుకొని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ధరలు ఆకాశం అంటుతుండటంతో నిత్యావసరాలను కొనుగోలు చేయలేని స్థితిలో ఉన్నారని వాపోయారు. దీనితోపాటు ఖరీఫ్ సీజన్ ఎరువుల ధరలు కూడా విపరీతంగా పెంచారని, యుద్ధం పేరు చెప్పి దేశ, రాష్ట్ర ప్రజలపై అధిక బారాల మోపి ప్రజల జీవన విధానాన్ని దెబ్బతీస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్లలో క్రూడ్ ఆయిల్ రేటు తగ్గినా రాష్ట్రంలో దేశంలో డీజిల్ పెట్రోల్ పై మాత్రం అధిక భారంగా పన్నులు వేసి నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. అంతర్జాతీయ సమస్య ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో కేజీబీ బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న చమురు, సహజవాయువు, గ్యాస్ పక్క రాష్ట్రాలకు, విదేశాలకు తీసుకెళ్తున్నారని, మన రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న ఆయిల్ గ్యాస్ ఈ రాష్ట్ర ప్రజలకు 50% వాటాగా ఇవ్వాలని కేంద్ర 12 ఆర్థిక కమిషన్ చెప్పినప్పటికీ దీనిని సాధించకపోవడం పాలకుల నిరంకుశత్వానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రజలపై ప్రేమ ఉంటే ఆంధ్ర రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా, గోదావరి బేసిన్ లో ఉత్పత్తి అవుతున్న గ్యాస్ ఈ రాష్ట్ర వాటాగా ఇవ్వాలని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రేవలేషనరీ సోషలిస్ట్ పార్టీ ఆర్ఎస్పీ జిల్లా కార్యదర్శి ఏ. శ్రీనివాసులు, బీఎస్పీ పార్టీ రాష్ట్ర నాయకులు శ్రీరాములు, దళిత సమైక్య జిల్లా అధ్యక్షులు ఎస్. నారాయణ, ఎమ్మెస్ ఎఫ్ జిల్లా అధ్యక్షులు రవి కుమార్, ఎస్.యు.సి.ఐ పార్టీ నాయకులు రంగనాయకులు, కిర్తీ, జై భీమ్రావు భారత్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ఊటుకూరు నాగరాజు, ఆల్ ఇండియా బీఎస్పీ పార్టీ హరికుమార్, ఆర్ఎస్పీ పార్టీ పత్తికుంటపల్లి రామాంజి తదితరులు పాల్గొన్నారు.

# మొక్కలు పెంచకపోతే.. భవిష్యత్ లో ప్రమాదం తప్పదు

## పర్యావరణ దినోత్సవం సందర్భంగా హెచ్చెల్సీ కాలనీలో మొక్కలు నాటిన ఎమ్మెల్యే దగ్గుపాటి, మున్సిపల్ కమిషనర్

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



మొక్కలు పెంచకపోతే భవిష్యత్ లో చాలా ప్రమాదాల్ని ఎదుర్కొక తప్పదని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం నగరంలోని హెచ్చెల్సీ కాలనీలో ఎమ్మెల్యే మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. మున్సిపల్ కమిషనర్ జస్వంత్ రావు, అధికారులు, విద్యార్థినీలు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఏటా ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయన్నారు. భవిష్యత్ లో ఇంకా ఎండలు పెరిగే అవకాశం ఉందని శాస్త్రవేత్తల హెచ్చరికలను అంతా గమనించాలన్నారు. అంతే కాకుండా రోజు రోజుకీ పెరుగుతున్న కాలుష్యం వలన వాతావరణంలో కార్బన్డైయాక్సైడ్ కూడా పెరుగుతోందన్నారు. వీటిని కట్టడి చేయాలంటే మొక్కలు నాటడమే ఏకైక పరిష్కారం అన్నారు. అయితే ప్రతి ఏటా చాలా మంది మొక్కలు నాటుతున్నారని.. అయితే వాటి పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదన్నారు. కేవలం మొక్కలు నాటి వదిలేస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. కనీసం ఆరు నెలలైనా వాటిని పరిరక్షించాలన్నారు. కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యావరణ పరిరక్షణ కోసం పచ్చదనం పెంచే విషయంలో చాలా సీరియస్ గా దృష్టి సారించారన్నారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో కోటి మొక్కలు నాటడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో జనాభా, వాహనాల వలన కాలుష్యం కూడా ఎక్కువగా ఉంటుందని.. అందుకే ఇక్కడ మొక్కలు భారీగా నాటి పచ్చదనం పెంచే చర్యలు చేపట్టినట్టు వివరించారు. దీనిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# " లక్షకు మూడు లక్షలు" ఆశ చూపి దోపిడీలకు పాల్పడుతున్న ఘరానా ముఠా పట్టివేత

ప్రజాభూమి, ప్రతినిధి అనంతపురం



ముగ్గురు అంతర్జిల్లా నిందితులు అరెస్ట్ చేసిన అనంతపురం టౌన్ పోలీసులు రూ. 1,35,000 నగదు, బైక్, 3 సెల్ ఫోన్లు స్వాధీనం ఒక లక్ష రూపాయల ఒరిజినల్ కరెన్సీ ఇస్తే మూడు లక్షల నకిలీ నోట్లు ఇస్తాం" అని, అలాగే "బ్లాక్ నోట్లను కెమికల్స్ ద్వారా ఒరిజినల్ నోట్లుగా మారుస్తాం" అంటూ అమాయక ప్రజలను నమ్మించి, వారిని నిర్జన ప్రదేశాలకు పిలిపించి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల అంతర్జిల్లా ముఠాను శుక్రవారం అనంతపురం టౌన్ పోలీసులు అత్యంత చాకచక్యంగా అరెస్ట్ చేశారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను టౌన్ ఎస్సై ప్రసాద్ మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన నిందితుల వివరాలు పానుగంటి నాగ శంకర్ ఏ రామకృష్ణ (వయస్సు 23 సం,,లు), త్రిపురాంతకం గ్రామం, ప్రకాశం జిల్లా గొల్ల వెంకటేష్ ఏ వెంకి యాదవ్ (వయస్సు 28 సం,లు), బ్యాతోలి గ్రామం, సి.బెళగాల మండలం, కర్నూలు జిల్లా, కమ్మరి పరశురాముడు (వయస్సు 24 సం,,లు), సి.బెళగాల గ్రామం, మండలం, కర్నూలు జిల్లా నేర ప్రవృత్తి మోసపూరిత విధానం నిందితులు ముగ్గురూ ముఠాగా ఏర్పడి, సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో ప్రజల జీవితాలతో చెలగాటమాడుతున్నారు. ఒక లక్షకు మూడు లక్షల నకిలీ నోట్లు ఇస్తామని ఆశ చూపడమే కాకుండా, బ్లాక్ పేపర్లను కెమికల్స్ సహాయంతో ఒరిజినల్ నోట్లుగా మారుస్తామని నమ్మించేవారు. వీరి మాటలు నమ్మి భారీ మొత్తంలో నగదుతో వచ్చే బాధితులను ముందే ప్లాన్ చేసుకున్న నిర్జన ప్రదేశాలకు పిలిపించుకునేవారు. బాధితులు అక్కడికి రాగానే, నిందితులు తమ సహచరులతో కలిసి కత్తులతో బెదిరించి, కళ్ళల్లో కారంపొడి చల్లి వారి వద్ద ఉన్న అసలు నగదును దోచుకొని పరారయ్యేవారు. అరెస్ట్ చేసిన వివరాలు దర్యాప్తులో భాగంగా టౌన్ ఎస్సై ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసులు నిఘా ఉంచగా.. అనంతపురం తపోవనం సమీపంలోని సర్వీస్ రోడ్డు వద్ద అనుమానాస్పదంగా తిరుగుతున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా, వారు చేసిన నేరాలను అంగీకరించారు. నిందితులు కేవలం అనంతపురంలోనే కాకుండా నంద్యాల, కర్నూలు పరిసర ప్రాంతాలలో కూడా ఇలాంటి అనేక దోపిడీలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడించారు. పోలీసుల హెచ్చరిక ఈ సందర్భంగా ఎస్సై ప్రసాద్ ప్రజలకు కీలక సూచనలు చేశారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే మోసపూరిత ప్రకటనలను, నకిలీ నోట్ల మార్పిడి ముఠాల మాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. ఎవరైనా ఇలాంటి ఆశలు చూపితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు గానీ లేదా డైల్ 112 / 100 కు గానీ సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# హరిత హిందూపురం వైపు మహా అడుగు.. -కోటి మొక్కల లక్ష్యంతో జిల్లా యంత్రాంగం సిద్ధం

## -అక్టోబర్ 2లోపు హిందూపురంలో 20 లక్షల మొక్కలు -ప్రతి ఇంటా ఒక చెట్టు నాటాలి

## -ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపు

ప్రజాభూమి, హిందూపురం టౌన్



ప్రకృతిని కాపాడితేనే భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తు అందించగలమని, పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షిస్తేనే పచ్చని భవిష్యత్తు సాకారమవుతుందని పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో నూతనంగా అభివృద్ధి చేస్తున్న పార్కులో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన మన హిందూపురం -- స్వచ్ఛ హరిత హిందూపురం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి పనులను పరిశీలించిన కలెక్టర్, పట్టణంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు మున్సిపల్ శాఖ చేపడుతున్న చర్యలను అభినందించారు.పార్కు ప్రహరీ గోడలపై విద్యార్థులు చిత్రించిన పర్యావరణ పరిరక్షణ సందేశాలతో కూడిన కళాఖండాలను పరిశీలించి సంతోషం వ్యక్తం చేశారు. తమ ప్రతిభతో ఆకట్టుకున్న విద్యార్థినీ, విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. పర్యావరణంపై యువతలో పెరుగుతున్న చైతన్యం సమాజానికి మంచి సంకేతమన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ సూచనల మేరకు హిందూపురం నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నామని తెలిపారు. అందులో భాగంగానే జిల్లాను హరిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ఈ వర్షాకాలంలో కోటి మొక్కలు నాటే బృహత్తర లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు వెల్లడించారు. హిందూపురం ప్రాంతంలోనే అక్టోబర్ 2 గాంధీ జయంతి నాటికి 20 లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని విస్తృతంగా చేపడతామని చెప్పారు. మొక్కలు నాటడం ఒక బాధ్యత అయితే, వాటిని పెంచి సంరక్షించడం అంతకంటే గొప్ప బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు కలిసి పనిచేస్తే హిందూపురాన్ని పచ్చని పట్టణంగా మార్చడం సాధ్యమవుతుందన్నారు. వాతావరణ మార్పులు, పెరుగుతున్న కాలుష్యం, భూగర్భ జలాల తగ్గుదల వంటి సమస్యలకు చెట్లే శాశ్వత పరిష్కారమని కలెక్టర్ వివరించారు. ప్రతి ఇంటి ఆవరణలో, ప్రతి పాఠశాల ప్రాంగణంలో, ప్రతి కార్యాలయ పరిసరాల్లో మొక్కలు నాటే ఉద్యమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర చౌదరి, వీరయ్య, బాలాజీ, టిడిపి పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపు సామాజిక బాధ్యతే కాదు.. వ్యక్తిగత బాధ్యత కూడా..! -జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

### కడప నగర వనంలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2026 సందర్భంగా మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభం



ప్రజాభూమి ప్రతినిధి,వైఎస్ఆర్ కడప : మొక్కల పెంపకం, పచ్చదనం పరిరక్షణ వంటి కార్యక్రమాలను.. సామాజిక బాధ్యతగానే కాకుండా.. వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం - 2026 ను పురస్కరించుకుని.. కడప నగర వనంలో జిల్లా అటవీశాఖ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి విచ్చేశారు.ఈ సందర్భంగా.. జిల్లా కలెక్టర్, డిఎఫ్ఓ లు.. పలువురు అధికారులు, విద్యార్థులు, మహిళలతో కలిసి వారికి కేటాయించిన స్థలంలో అడవి జాతి మొక్కలు నాటి 'హరితాంధ్ర ప్రదేశ్' లక్ష్య సాధనలో భాగస్వాములయ్యారు. అనంతరం సీడ్ బాల్స్ విశిష్టతను తెలుసుకుని.. డ్రోన్ ద్వారా సీడ్ బాల్స్ విసిరే కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ యజ్ఞంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రకృతి తల్లిలాంటిదని, ప్రకృతికి ప్రాణాదారం అయిన చెట్లు ప్రాణికోటికి ప్రాణాదారం అని మొక్కల విశిష్టతను క్షుణ్ణంగా తెలియజేశారు. పర్యావరణ పరంగా గతంలో జరిగిన నష్టాలను పూరించే దిశగా ఈ తరం యువత సమాజాన్ని పునర్నిర్మించాలని పిలుపునిచ్చారు. వాతావరణ సమతుల్యతలో ప్రతి జీవికి ఒక్కో పాత్ర ఉందన్నారు. ప్రస్తుతం మనకు అందుబాటు లో ఉన్న ఆధునిక సాంకేతికత ను సద్వినియోగం చేసుకుంటూ.. డ్రోన్ ద్వారా వ్యవసాయ, సామాజిక అటవీ అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతం చేసుకోవాలన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రిలు ప్రత్యేక శ్రద్ధ తో రాష్ట్రాన్ని హరితాంధ్రప్రదేశ్ గా తీర్చిదిద్దే క్రమంలో.. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఎంతో ప్రాముఖ్యతతో వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించుకోవడం గర్వించదగ్గ విషయం అన్నారు. హరితాంధ్ర ప్రదేశ్ సాధనలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ప్రతి ఇల్లు, ప్రతీ ఊరూ పచ్చదనంతో సింగారిద్దామన్నారు. రాష్ట్రాన్ని 50% పచ్చదనంతో నింపాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు.. జూన్ 5 పర్యావరణ దినోత్సవం రోజు నుండి వచ్చే కార్తీక మాసం వరకు వర్షాలు విరివిగా కురిసే సీజన్ కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం విరివిగా మొక్కలను నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. అదే స్ఫూర్తితో.. మన జిల్లాలో డ్రోన్ సహకారంతో దాదాపు 1000 హెక్టార్లలో సీడ్ బాల్స్ త్రోయింగ్ ద్వారా విరివిగా మొక్కలను నాటే లక్ష్యంను నిర్దేశించుకోవడం జరిగిందన్నారు. సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ.. తమ చుట్టూ వున్న పరిసరాలను పచ్చదనంతో నింపాలని ఆయన ఆకాంక్షించారు. పర్యావరణం అనేది మన ఇంటితో మొదలై.. సామాజికమవుతుందన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడుకునే బాధ్యత మన అందరిపై ఉందన్నారు. మనతో పాటు మన చుట్టూ ఉన్న జీవరాశులను కాపాడుకోవడంలో వ్యక్తిగత బాధ్యత తీసుకోవాలన్నారు. డిఎఫ్ఓ వినీత్ కుమార్ మాట్లాడుతూ... జిల్లా విస్తీర్ణంలో అడవులు 33% విస్తరించి ఉన్నాయని, అటవీ విస్తీర్ణంలో జిల్లా అగ్రస్థానంలో ఉందన్నారు.జిల్లాలో పచ్చదనాన్ని మరింత రెట్టింపు చేసేందుకు సామాజిక అడవుల పెంపకం ద్వారా, గ్రామీణ ఉపాధి హామీ పథకం, స్వయం సహాయక సంఘాల మహిళల భాగస్వామ్యంతో ప్రజలకు ఓ వైపు ఉపాధి కల్పిస్తూనే.. పచ్చదనాన్ని పెంచడం జరుగుతోందన్నారు. ప్రభుత్వం చేపట్టే వనమహోత్సవం ద్వారా.. జిల్లాలో విస్తృతంగా మొక్కలు నాటి.. అటవీ విస్తీర్ణాన్ని 50% కు పెంచేందుకు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన వారికి వివిధ రకాల మొక్కలను పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో మురళీ, స్వాడ్ డిఎఫ్ఓ రాజశేఖర్, కేఎంసి అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం,డీఏవో సుబ్రహ్మణ్యేశ్వర రావు, డిసిహెచ్ఎస్ డా. హిమదేవి.. అటవీశాఖ, డ్వామా, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, మహిళలు, విద్యార్థులు తదితరుల పాల్గొన్నారు

## స్మార్ట్ కిచెన్ పనులు వేగవంతం చేయాలి

### -నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీధర్



ప్రజాభూమి, సిద్ధవటం: మండల కేంద్రమైన సిద్ధవటంలో నూతనంగా నిర్మిస్తున్న స్మార్ట్ కిచెన్ భవన పనులను జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పనుల పురోగతిని సమీక్షించి, భవనానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు వెంటనే పంపాలని అధికారులను ఆదేశించారు. స్మార్ట్ కిచెన్ సమీపంలోని పాత భవనాన్ని పూర్తిగా తొలగించాలని సూచించిన కలెక్టర్, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గురు ప్రసాద్, ఏవో సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ పర్యటన సందర్భంగా ఎస్ఐ హారిక ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.


## భూసమస్యల పరిష్కారానికి అధికారులందరూ జవాబుదారీగా ఉండాలి: జిల్లా కలెక్టర్



ప్రజాభూమి ప్రతినిధి,వైఎస్ఆర్ కడప: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు రెవెన్యూ శాఖ ప్రత్యేక చొరవ చూపుతోందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం బద్వేలు లో "ఒక నెల – ఒక నియోజకవర్గం" కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... అధికారులు ప్రజా సమస్యల పట్ల మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ సమావేశం లో స్వీకరించిన సుమారు 200 పిటిషన్లను పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన గడువును విధించామని తెలిపారు.ప్రతి దరఖాస్తును ఒక సమస్యగా పరిగణించి, యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.రాబోయే మూడు నుంచి నాలుగు వారాల్లో ఈ పిటిషన్లన్నింటినీ పరిష్కరించి,తుది నివేదికను దరఖాస్తుదారులకు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. నోటీసులు జారీ చేయడం, దరఖాస్తుదారుల నుంచి వివరణలు తీసుకోవడం వంటి ప్రక్రియలకు 15 రోజుల సమయం కేటాయించాలని అధికారులకు సూచించారు. సివిల్ వివాదాలు లేదా కోర్టు పరిధిలో ఉన్న అంశాలను మినహాయించి, మిగిలిన సమస్యలన్నింటినీ చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. వచ్చే గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఈ పిటిషన్లపై 'యాక్షన్ టేకన్ రిపోర్ట్' సమీక్ష ఉంటుందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఒకే చోట అందుబాటు లో ఉండటంతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందనన్నారు...ఈ సమీక్ష సమావేశానికి సంబంధిత అధికారులు ప్రతి కేసు వివరాలతో హాజరుకావాలని ఆయన హెచ్చరించారు.భూపరిపాలన లో జవాబుదారీతనం ముఖ్యమని, గ్రాస్ రూట్ స్థాయిలో సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలనీ అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు,ఆర్డీఓ చంద్రమోహన్,బద్వేల్ నియోజకవర్గ తాసిల్దార్లు ఎంపీడిఓ లు తదితరులు పాల్గొన్నారు

## మొక్కలు నాటుదాం - పర్యావరణాన్ని కాపాడుకుందాం

### -ముద్దనూరు రేంజ్ ఆఫీసర్



ప్రజాభూమి,పులివెందుల

పులివెందుల పట్టణంలోని రాణి తోపులో పర్యావరణ దినోత్సవ సందర్భంగా ఫారెస్ట్ ఆఫీసర్ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ముద్దనూరు రేంజర్ ఆఫీసర్ ఓబులేసు, ఏపీ కార్లు ఏవో శివప్రసాద్ లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి పెరట్లో మొక్కను నాటుకోవాల న్నా రు. నేటి మొక్కలే రేపటి వృక్షాలు అయ్యి భావితరాలకు బాసటగా నిలుస్తాయన్నారు. మొక్కలు నాటడం వల్ల వర్షాలు సకాలంలో పడతాయన్నారు. రాణి తోపులో రకరకాల మొక్కలను నాటడం జరిగిందన్నారు. ఇక్కడున్న అధికారులు వాటి సంరక్షణ శ్రద్ధగా చూసుకోవా ల్సిన బాధ్యత వారిపై ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వదిలేస్తున్నారే తప్ప వాటిని సంరక్షించేవారు కరువయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, వాకింగ్ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోతున్న కూటమి ప్రభుత్వం

### -ప్రజా సమస్యల పరిష్కారంకోసమే ప్రజా దర్బార్

### -ప్రజా దర్బార్ లో బీటెక్ రవి



ప్రజాభూమి,పులివెందుల

ఇచ్చిన హామీల నెరవేరుస్తూ అభివృద్ధి,సంక్షేమం లో కూటమి ప్రభుత్వం దూసుకుపోతున్నదని, రాష్ట్రంలో వైకాపా పార్టీని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని, ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని బీటెక్ రవి అన్నారు. శుక్రవారం పులివెందుల పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు.ఈ సందర్భంగా పులివెందు ల నియోజకవర్గం నుండి వచ్చిన ప్రజల నుండి పలు సమస్యలను సావదానంగా విని , వారిచ్చిన అర్జీలనుస్వీకరించారు. ప్రజలతో మమేకమై వారి సమస్యలను విని సంబంధిత అధికారులతో చర వాణిలో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకు ని, వాటి పరిష్కారం కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తాను,. పులివెందుల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే నా ప్రధాన ధ్యేయం అని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒకటి ఒకటి నెరవేర్చుకుంటూ వస్తుందన్నారు. రాష్ట్రంలోవైకాపా పని అయిపోయిందని, జరగబో యే ఎన్నికలలో అన్ని టిడిపి కైవశం చేసుకోవడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణే మనందరి బాధ్యత - బీటెక్ రవి



ప్రజాభూమి, పులివెందుల

నేడు అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో తదితర అధికారులతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, గ్లోబల్ వార్మింగ్ తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించిన విధంగా, స్థానికంగా చిన్న చిన్న పనుల కోసం తిరిగేందుకు ఎలక్ట్రిక్ సైకిళ్లను ఉపయోగించాలని, తద్వారా పర్యావరణానికి మేలు జరగడమే కాకుండా శారీరకంగా ఆరోగ్యంగా ఉండొచ్చని ఆయన తెలిపారు. అంతేకాకుండా డీజిల్ వాడకం తగ్గడం వల్ల విదేశీ మారకద్రవ్యం (డాలర్లు) ఆదా అయ్యి దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా మేలు జరుగుతుందన్నారు. దీనిలో భాగంగానే ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తాను పులివెం దుల టీడీపీ కార్యాలయం నుంచి న్యాక్ బిల్డింగ్ వద్ద ఉన్న విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం వరకు,ఈ కార్యక్రమానికి సైకిల్ పై వచ్చానని, పార్టీ ఆఫీస్ పనుల నిమిత్తం ఇప్పటికే 10 ఎలక్ట్రిక్ సైకిళ్ల ను ఆర్డర్ చేశామని చెప్పారు. అలాగే, రాబోయే రెండు మూడేళ్లలో పులివెందులను పూర్తిగా ప్లాస్టిక్ రహిత (ప్లాస్టిక్ ఫ్రీ) ప్రాంతంగా మార్చేందుకు అధికారులతో పాటు ప్రజలందరూ సహకరించాల ని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, మున్సిపల్ కమిషనర్ గారు , తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, అక్కులగారి విజయ్ కుమార్ రెడ్డి, తుమ్మలపల్లె ఎంపీటీసీ విశ్వనాథ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ చంద్ర వర్ధన్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి (వెంకీ) పుష్పగిరి స్కూల్ కరస్పాండెంట్ ఓబుల్ రెడ్డి, పులివెందుల టీడీపీ మండల అధ్యక్షుడు మార్తల జగన్ రెడ్డి, భాస్కర్ రెడ్డి కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్ధవటం తహసీల్దార్‌గా విజయ్ కుమార్ బాధ్యతల స్వీకరణ



ప్రజాభూమి, సిద్ధవటం: మండల తహసీల్దార్‌గా విజయ్ కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన ఆకుల తిరుమల బాబు బద్వేల్‌కు బదిలీ కావడంతో, చాగలమర్రి మండలం నుంచి బదిలీపై వచ్చిన విజయ్ కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతుల భూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. ప్రభుత్వ భూములు, రెవెన్యూ స్థలాలపై ఎలాంటి ఆక్రమణలు జరిగినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు పారదర్శకంగా, అందుబాటులో ఉండే విధంగా రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.

## పోరుమామిళ్ల ప్రభుత్వ ఆస్పత్రి అమ్మ పేరుతో ఒక మొక్క కార్యక్రమంలో పాల్గొన్న బద్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నారిశెట్టి సుప్రజ



ప్రజాభూమి పోరుమామిళ్ల :

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గౌరవ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారి పిలుపు మేరకు నిర్వహిస్తున్న "అమ్మ పేరుతో ఒక మొక్క" కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో బీజేపీ ,టీడీపీ ,జనసేన కుటుంబ సభ్యులతో కలిసి మొక్కలు నాటడం జరిగింది.?పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత. మనకు జన్మనిచ్చిన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దాన్ని ప్రాణప్రదంగా సంరక్షించడం మన కనీస ధర్మం. ఈరోజు మనం నాటే ఒక్కొక్క మొక్క. రేపటి మన పిల్లల భవిష్యత్తుకు ఆక్సిజన్ బ్యాంక్ లాంటిది. ?మొక్కను నాటడంతో పాటు అది వృక్షంగా మారే వరకు ఒక తల్లిలాగా కాపాడుకుంటూ, నిరంతర బాధ్యతగా ప్రకృతి పరిరక్షణలో భాగస్వాములు కావాలని.. అలాగే మరికొందరిని కూడా ఈ మహా యజ్ఞంలో భాగం చేయాలని కోరుతున్నాను. అలాగే ప్రభుత్వ ఆస్పత్రి సౌకర్యాలను,రోగులను పరామర్శించి ,రోగులకు అందుతున్న వైద్యము గురించి ఆస్పత్రి వైద్యులు ఐతీ. సాధు వెంకటేశ్వర్లు , పోతిరెడ్డి నాగలక్ష్మి , తాతిరెడ్డి కళ్యాణ్ చక్రవర్తి ని అడిగి తెలుసుకొని , వైద్యుల పనితీరుపట్ల సంతోషం వ్యక్తం చేసారు .స్వయంగా మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ సుప్రజ ప్రభుత్వ ఆస్పత్రి లో దంతాలకు చెకప్ చేయించుకోవడం జరిగింది .ప్రజలు అందరు కూడా ప్రభుత్వం అందించే వైద్య సదుపాయాలను ఉపయోగించుకోవాలన్నారు .ఈ కార్యక్రమం లో బద్వేల్ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ సెత్తెం ప్రతాప్ ,బీజేపీ నాయకులూ ఉట్టి శ్రీనివాసులు (జిల్లా ప్రధాన కార్యదర్శి ), పోరుమామిళ్ల మండల అధ్యక్షుడు నాగేంద్ర ,నారోజు రమణాచారి (విశ్వకర్మ జిల్లా కన్వీనర్ ), జిల్లా కార్యదర్శి పందరి పల్లంశెట్టి , మండల ప్రధాన కార్యదర్శి దుల్ల శ్రీనివాస్ రెడ్డి , జిల్లా కార్యవర్గ సభ్యుడు కొమినేని రవీంద్ర ,కిసాన్ మోర్చా అధ్యక్షుడు తమ్మిశెట్టి రమణ , ఉపాధ్యక్షుడు పోకల బ్రహ్మయ్య , జనసేన నగిరి రమణ , షైక్ ఇమ్రాన్ , ఓబీసీ మోర్చా టెంకాయల గురయ్యా , శ్రీనివాసులు మోడీ , కషం గురయ్యా , మండల యువ మోర్చా అధ్యక్షుడు మంగళగిరి భరత్, అభిషేక్ , సుదర్శన్ రెడ్డి , మండల కార్యవర్గ సభ్యులు ఉండేలా శ్రీనివాస్ రెడ్డి , రామస్వామి తదితరులు పాల్గొన్నారు .

## కోలాట భజనలతో అలరించిన మహిళలు

### -అభినందించిన అతికారి కృష్ణ



ప్రజాభూమి, సిద్దవటం: హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో కోలాటం వంటి జానపద కళలు కీలక పాత్ర పోషిస్తాయని రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ ఆలయ ప్రాంగణంలో గత మూడు నెలలుగా కోలాటం శిక్షణ పొందుతున్న మహిళలను ఆయన అభినందించి, వారి ప్రదర్శనలను తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధునిక జీవనశైలిలో కనుమరుగవుతున్న సంప్రదాయ కళలను మహిళలు నేర్చుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు. మన పూర్వీకుల నుంచి వచ్చిన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. కోలాటం మాస్టర్ కిరణ్ ఆధ్వర్యంలో మహిళలు ప్రదర్శించిన కోలాట భజనలు, సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం మహిళలు అతికారి కృష్ణనుఈ శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన యువ నాయకుడు దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్, వర్ది వెంకట్రామయ్య, రాష్ట్ర చేనేత విభాగం కార్యదర్శి రాటాల రామయ్య, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు సుధా మురళి, తెలుగు యువత అధ్యక్షుడు పుత్తా సుధీర్ రాయల్, వార్డు సభ్యుడు సామల చెంగయ్య, అతికారి చిన్న వెంకటయ్య, సాయి, గంగయ్య, విజయ్, మురళి, కుమార్, శ్రీనివాసులు, వినోద్, బాలకిశోర్, సోమేష్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

## పచ్చదనం పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి- కమాండెంట్ ఆనంద్ రెడ్డి



ప్రజాభూమి, సిద్దవటం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని భాకరాపేట సమీపంలో ఉన్న 11వ ఏపీఎస్పీ పోలీస్ పటాలయంలో శుక్రవారం మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 11వ పోలీస్ పటాలయం కమాండెంట్ ఆనంద్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. కాలుష్య నియంత్రణకు పచ్చదనం ఎంతో అవసరమని తెలిపారు. అటవీ క్షేత్ర అధికారి కళావతి మాట్లాడుతూ వర్షాకాలంలో అటవీ ప్రాంతాల్లో విత్తన బంతుల కార్యక్రమం చేపట్టి పచ్చదనాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి కుటుంబం తమ ఇంటి ముందు కనీసం ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ రాజశేఖర్, వెంకటప్ప, డిప్యూటీ రేంజర్ ముక్తార్ భాష, పోలీసు సిబ్బంది, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు సాయం చేసి మానవత్వం చాటిన అతికారి క్రిష్ణ

### -రూ.10 వేల ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు



ప్రజాభూమి, సిద్దవటం: మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని రామక్రిష్ణాపురం గ్రామానికి చెందిన మొహన్ కృష్ణ బ్రెయిన్ స్ట్రోక్‌తో ఐదు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం తెల్లవారుజామున కడప రిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందాడు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో అంత్యక్రియలు నిర్వహించేందుకు కూడా డబ్బులు లేక అవస్థలు పడుతున్న విషయం స్థానిక జనసేన నాయకుల ద్వారా తెలుసుకున్న రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి క్రిష్ణ వెంటనే స్పందించి రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ మొత్తాన్ని మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీలేఖ భర్త, జనసేన నాయకుడు దేరంగుల శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి సంక్షేమ సంఘం యువజన విభాగం కార్యదర్శి అవ్వారు రవిశంకర్ మృతుని తల్లి నడిపమ్మకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడంలో అతికారి క్రిష్ణ ఎప్పుడూ ముందుంటారని, సహాయం కోరగానే వెంటనే స్పందించి ఆర్థిక సాయం అందించారని తెలిపారు. ఈ సందర్భంగా మృతుని కుటుంబ సభ్యులు అతికారి క్రిష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో అన్నం పట్లాలు పంపిణీ



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని బొగ్గిడివారిపల్లె పంచాయతీ వడ్డివారిపల్లె గ్రామానికి చెందిన మాజీ చౌకదుకాణం డీలర్ బత్తల సుధాకర్ కుమారుడు బత్తల మిదున్ కుమార్ తన పుట్టినరోజు సందర్భంగా సేవా కార్యక్రమం నిర్వహించారు. లిఖిత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఒంటిమిట్ట, మాధవరం ప్రాంతాల్లోని దేవాలయాల వద్ద నివసిస్తున్న 50 మంది యాచకులకు శుక్రవారం మధ్యాహ్న భోజనం పట్లాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ రాటాల రామయ్య మాట్లాడుతూ, నిరుపేదలు, యాచకులకు సహాయం చేయడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దకోట్ల శివాజీతో పాటు సేవా సంస్థ సభ్యులు, యువకులు పాల్గొన్నారు. స్థానికులు ఈ సేవా కార్యక్రమాన్ని అభినందించారు.

## ఘనంగా గజ్జపూజ మహోత్సవం- అలరించిన కోలాట నృత్య ప్రదర్శన



ప్రజాభూమి, సిద్ధవటం: మండలంలోని మాధవరం-1 గ్రామంలోని శ్రీ భద్రావతి భావనారాయణ సమేత సీతారాముల ఆలయ ప్రాంగణంలో కిరణ్ కోలాట బృందం ఆధ్వర్యంలో గజ్జపూజ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గత మూడు నెలలుగా సుమారు 50 మంది మహిళలు కోలాట భజనలు నేర్చుకోగా, శిక్షణ ముగింపు సందర్భంగా ఈ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా కోలాట గురువు కిరణ్‌ను మహిళలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి హాజరైన గ్రామ ప్రజలకు అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. గురువు కిరణ్ మాట్లాడుతూ, ఒకే గ్రామంలో ఆరు నెలల వ్యవధిలో రెండు కోలాట బృందాలకు శిక్షణ ఇచ్చి, రెండుసార్లు గజ్జపూజ మహోత్సవాలు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, యువతులు, పెద్దలు పాల్గొని కోలాటం నేర్చుకున్న మహిళలను, యువతులను, గురువును అభినందించారు.

ప్రజాభూమి

తిరుపతి,చిత్తూరు 8

శనివారం 06 జూన్ 2026


# మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ఎంతో కీలకం

## పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరం - జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి,తిరుపతి.

మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ఎంతో కీలకమని, పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేణిగుంట (తూకివాకం) సమీపంలో తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్, జె సి ఆర్. గోవింద రావు, తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డి కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం విస్తృతమైన కార్యక్రమాలను చేపడుతోందన్నారు. చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణ, నీరు పోయడం, ఎరువులు, క్రిమి సంహారక మందులు వేయడం వంటి చర్యలు తీసుకోకపోతే మొక్కలు జీవించవన్నారు. చెట్ల సంరక్షణలో ప్రజలందరూ తమ వంతు భాగస్వామ్యం అందించాలని సూచించారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని, సాధారణంగా ప్రపంచ సగటు ఉష్ణోగ్రత 14.4 డిగ్రీలుగా ఉండగా, ప్రస్తుతం 15 డిగ్రీలు దాటితే తీరప్రాంతాల్లో నివసించే మూడో వంతు జనాభా తీవ్ర ప్రభావానికి గురవుతుందన్నారు. ఈ కారణంగా చేపల వేట ఇబ్బందికరంగా మారి తీరప్రాంత జీవనోపాధులు దెబ్బతింటాయన్నారు. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సీడ్ పెల్లెట్స్ కార్యక్రమాన్ని గౌరవ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారన్నారు. విత్తనాలను సహజ పదార్థాలతో (ఆవుపేడ, ఇతర జీవామృతాలు) కలిపి చిన్న గుళికల రూపంలో తయారు చేసి వాటిని నాటడం ద్వారా వర్షాభావం ఉన్నా, నీరు తక్కువ ఉన్నా మొక్కలు ఎక్కువ కాలం జీవిస్తాయని, ఈ విధానం ద్వారా మొక్కల జీవన శాతం పెరుగుతుందన్నారు. తిరుపతి, శేషాచలం కొండల్లో ఉన్న చెట్ల కారణంగా అక్కడ ఉష్ణోగ్రతలు తక్కువగా ఉంటాయి. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా చెట్లు నాటడం ద్వారా వాతావరణాన్ని నియంత్రించవచ్చన్నారు. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు, ప్రజలందరూ కలసి ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని గౌరవ ఉప ముఖ్యమంత్రి గారు పిలుపునిచ్చారన్నారు.







విద్యార్థులను ఉద్దేశించి పర్యావరణ పరిరక్షణలో వారి పాత్రను వివరించారు. పిల్లలు చిన్న వయసులోనే చెట్లను నాటడం, వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో పచ్చదనాన్ని పెంపొందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం సూచనల మేరకు జూన్ 5న జిల్లాలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. చెట్లు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచడం, సంరక్షించడం కూడా అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రతి మనిషి ఏ రంగంలో స్థిర పడినా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటి వద్ద, పాఠశాలల్లో, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు నాటడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని సూచించారు. చెట్లు నరికే పరిస్థితి వచ్చినప్పుడు, దానికి బదులుగా కొత్త చెట్లు నాటడం ద్వారా ప్రకృతితో సమతుల్యత నిలుపుకోగలమన్నారు. తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ చెట్లు నాటడంతో పాటు వాటి సంరక్షించడం కూడా అత్యంత ప్రధా నం అని ఈ కార్యక్రమంలో యువత భాగస్వామ్యం కావాలన్నారు. ఇంటి వద్ద, పాఠశాలల్లో, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు నాటడం ద్వారా కాలుష్యాన్ని నివారించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని సూచించారు. చిన్నతనం నుండే మొక్కలు నాటడం ప్రారంభిస్తే, భవిష్యత్తులో అదొక గొప్ప అలవాటుగా మారుతుందన్నారు. ప్రస్తుతం ఇందన కొరత ఉన్న తరుణంలో సౌర శక్తి వినియోగం, బ్యాటరీ వాహనాల వినియోగం ద్వారా కాలుష్య నివారణ సాధ్యమవుతుందన్నారు. కర్ణాటక రాష్ట్రం గ్రీన్ సిటీగా అభివృద్ధి చెందిందని, అదే విధంగా ఆంధ్ర రాష్ట్రం కూడా గ్రీన్ సిటీగా మారే విధంగా ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. దేశ పరిరక్షణలో సైనికులు శ్రమిస్తున్న తీరులోనే యువత కూడా తమ పరిసర ప్రాంతాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ కు నడుం బిగించాలన్నారు.

# రాగా ఇన్ హోటల్ ప్రారంభోత్సవం

**–రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని**

**–హోటల్ యజమానికి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు**

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తిరుపతి పట్టణంలో నూతనంగా నిర్మించిన రాగా ఇన్ హోటల్ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి హోటల్ యజమాని, కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే పులివర్తి నాని రిబ్బన్ కట్ చేసి, జ్యోతి ప్రజ్వలన చేసి హోటల్‌ను ప్రారంభించారు.





ఈ సందర్భంగా హోటల్ యజమానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపార రంగంలో మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జేబీ శ్రీనివాస్, కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. హోటల్ ప్రారంభం స్థానిక ఉపాధి అవకాశాల పెంపుతో పాటు నగర అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం వేళ అనంత అరణ్యానికి శ్రీకారం

ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ



తిరుపతి జిల్లా బి. ఎన్ కండ్రిగ మండలంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కనుమనం బేడు గ్రామ పంచాయతీ పరిధిలో గల ఏకలవ్య గురుకుల పాఠశాలలో అనంత అరణ్య ఏర్పాటుకు చెట్ల నాటే ప్రదేశాల గుర్తింపు, గుంతల ఏర్పాటుకు సంబంధించిన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు లక్ష్యంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారిణి వెంకట రత్నమ్మ ఆధ్వర్యంలో చెట్ల పెంపకం ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. ప్రకృతి సమతుల్యతను కాపాడటంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, మండల సాంకేతిక సిబ్బంది, గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొని అనంత అరణ్య ఏర్పాటుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం తెలుగుదేశం పార్టీ మండల నాయకులు చెరుకూరి ముంచంద్రనాయుడు, మాజీ మండల అధ్యక్షుడు సుధాకర్ నాయుడు, సింగిల్ విండో డైరెక్టర్, భత్తల మధు నాయుడు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వారు పేర్కొంటూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. పచ్చదనం పెంపొందించే లక్ష్యంతో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడం ద్వారా ప్రకృతికి మన వంతు సేవ చేయాలని, ప్రతి ఇంటి వద్ద కనీసం ఒక మొక్కను పెంచాలని సూచించారు.

# కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు .. వాకాడులో వైసీపీ ఆందోళన


ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



తిరుపతి జిల్లా వాకాడు మండల కేంద్రమైన అశోక్ పిల్లర్ సెంటర్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో"కూటమి ప్రభుత్వ వెన్నుపోటుకు రెండేళ్లు"పేరుతో శుక్రవారం భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. వైకాపా సీఈసీ సభ్యుడు కొడవలూరు భక్తవత్సల రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి విగ్రహం వద్ద నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. వైఎస్సార్ స్మారక విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వ వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా కొడవలూరు భక్తవత్సల రెడ్డి మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా విస్మరించి రాష్ట్ర ప్రజలను మోసగిస్తున్నదని మండిపడ్డారు. రైతులు, మహిళలు, యువత ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతులకు న్యాయం, మహిళలకు భద్రత, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు పెరిగిన ధరలను నియంత్రించే చర్యలు ప్రభుత్వం తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రజాసంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు హక్కులు, సంక్షేమ ఫలాలు అందించాలని సూచించారు. స్థానిక ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో నిరసన కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ప్రజాసంక్షేమ అంశాలపై అవగాహన కల్పిస్తూ రాజకీయ చైతన్యాన్ని పెంపొందించే విధంగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జడ్పీటీసీ రైతు రామకృష్ణ, మండల అధ్యక్షుడు ఏనుగు సుధాకర్ నాయుడు, వాకాడు మాజీ ఉపసర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, అనిల్ రెడ్డి, గూడూరు వెంకటేశ్వర్ రెడ్డి, గూడూరు సుధాకర్ రెడ్డి, తుపిలి మధు రెడ్డి, నేదురుమల్లి హిమకుమార్ రెడ్డి, లోక్ కళ్యాణ్, వాకాటి రవి కుమార్, యువ నాయకుడు ఆనం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆక్రమణలు తొలగించాలని తొట్టంబేడు గ్రామస్తుల ధర్నా

ప్రజా భూమి ప్రతినిధి: తొట్టంబేడు



మండలంలోని తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని చెరకురాగప్పనాయుడు కండ్రిగ గ్రామ సర్వే నెంబరు 198 లో గల గుంట పోరంబోకు భూమి ఆక్రమణకు గురైందని,వెంటనే తొలగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. దాదాపు 100 కుటుంబాలకు పైగా నిరుపేదలు సదరు పోరంబోకు భూమిలో నివాసం ఉంటుండగా చుట్టు పక్కల గ్రామాలకు చెందిన కొందరు వ్యక్తులు నకిలీ పట్టాలు సృష్టించి భూమిని కబ్జా చేశారని బాధితులు ఆరోపించారు. ఈ విషయమై ఇదివరకే పలుమార్లు తాహసిల్దార్‌కు అర్జీలు ఇచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు వాపోయారు. కబ్జాకు గురైన సర్వే నెంబర్లను ఆన్‌లైన్ రికార్డుల నుంచి తొలగించాలని,ఆక్రమణలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గ్రామస్తులు తాహసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తాహసిల్దార్ భారతిని కలిసి అర్జీ అందజేశారు. పేదల నివాసాలకు విఘాతం కలగకుండా చూడాలని,ప్రభుత్వ పోరంబోకు భూములను పరిరక్షించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో తొట్టంబేడు గ్రామానికి చెందిన పలువురు మహిళలు, పెద్దలు పాల్గొన్నారు. అర్జీని పరిశీలించి విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తాహసిల్దార్ భారతి హామీ ఇచ్చినట్లు గ్రామస్తులు తెలిపారు.

# రాష్ట్రంలో సొంత ఇల్లు లేని నాయకులు అభివృద్ధి మాటలు చెబుతున్నారు - కూటమి ప్రభుత్వంపై నేదురుమల్లి తీవ్ర విమర్శలు

ప్రజాభూమి ప్రతినిధి, వాకాడు



ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి తమ లక్ష్యమని ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు రాష్ట్రంలో సొంత ఇల్లు కూడా లేదని, ఇతర రాష్ట్రాల్లో నివాసం ఉంటూ ఆంధ్రప్రదేశ్‌పై కపటి ప్రేమ చూపిస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శించారు. వాకాడులోని తన నివాసంలో కార్యకర్తలతో సమావేశమైన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో సొంత నివాసం నిర్మించకపోవడం వెనుక కారణం ఏమిటని ప్రశ్నించారు. అలాగే 12 సంవత్సరాలుగా ప్రజల సమస్యలపై పోరాడుతున్నానంటున్న ప్రస్తుత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇప్పటికీ హైదరాబాద్‌లోనే నివాసం ఉంటున్నారని వ్యాఖ్యానించారు. అదే సమయంలో, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలో సొంత నివాసం ఏర్పాటు చేసుకున్నారని గుర్తు చేశారు. తమ తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్ రెడ్డి 34 ఏళ్ల క్రితమే వెంకటగిరిలో నివాసం ఏర్పాటు చేసుకుని ప్రజలకు అందుబాటులో ఉంటూ సుపరిపాలన అందించారని తెలిపారు. రాష్ట్ర ప్రజలను మాయ మాటలు, మోసపూరిత హామీలతో తప్పుదోవ పట్టించడం కూటమి ప్రభుత్వానికి అలవాటైపోయిందని నేదురుమల్లి విమర్శించారు. ఎన్నికల ముందు తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టోలోని పథకాల అమలుపై ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. "తల్లికి వందనం"పథకం ఈ ఏడాది అమలు కావాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో"అమ్మ ఒడి" పథకం కింద రూ.15 వేల నగదు సాయంతో పాటు విద్యార్థులకు అవసరమైన విద్యా సామాగ్రి కిట్లను జూన్ మొదటి వారానికే సిద్ధం చేసిన ఘనత వైఎస్ జగన్మోహన్ రెడ్డిదేనని పేర్కొన్నారు. ప్రస్తుతం అదే పథకాన్ని పేరు మార్చి"తల్లికి వందనం"గా ప్రకటించిన కూటమి ప్రభుత్వం తల్లుల ఖాతాల్లో నిధులు జమ చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. 2019లో వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు గత టీడీపీ ప్రభుత్వం రూ.2250 కోట్ల బకాయిలను వదిలేసి వెళ్లిందని,అయినప్పటికీ అప్పటి సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి విద్యార్థులకు మూడు నెలలకోసారి విడతల వారీగా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించారని తెలిపారు. ప్రస్తుతం విద్యార్థులకు అందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నికల సమయంలో ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్కరికైనా అందించిందా అని ప్రశ్నించారు. అలాగే పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని చెప్పిన నారా లోకేష్ పన్ను రాయితీల విషయంలో విఫలమయ్యారని విమర్శించారు. పథకాల అమలులో కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని, చంద్రబాబు నాయుడు రాజకీయ జిమ్మిక్కులను గుర్తించిన బీజేపీ సైతం టీడీపీ మేనిఫెస్టోలో తమ పార్టీ గుర్తును ఉపయోగించడానికి నిరాకరించిందని వ్యాఖ్యానించారు. ప్రశ్నించే వైసీపీ నాయకులపై తప్పుడు కేసులు బనాయించడం కూటమి నేతలకు అలవాటైపోయిందని ఆరోపించిన నేదురుమల్లి, ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు జరిగినా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి ప్రజలు మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

# ఘనంగా కిషోర్ వికాసం కార్యక్రమం

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



ఈరోజు రేణిగుంట ఐసిడిఎస్ ప్రాజెక్టులోని ఏర్పేడు మండలం లోని రాజులపాలెం అంగన్వాడి నందు సిడిపిఓ కృష్ణవేణి. ఆదేశాల మేరకు కిశోర వికాసం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది మే నెల 1 వా తేదీ నుండి జూన్ 12వ తేదీ వరకు ప్రతి మంగళవారం శుక్రవారం బాలికలతో సమావేశం నిర్వహించడం జరుగుతుంది . ఇందులో వారికి విద్య యొక్క ప్రాముఖ్యత వ్యక్తిగత పరిశుభ్రత జీవన నైపుణ్యాలు సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్ ఆరోగ్యమేల మరియు అనీమియా పై అవగాహన కల్పించడం జరిగింది రక్తహీనత కిషోర్ బాలికల ఆరోగ్య సమస్యల గురించి మాట్లాడడం జరిగింది మరి ముఖ్యంగా ఈ వయసులో పిల్లలు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించడం జరిగింది .ఈ రోజు ముఖ్యంగా నా అవసరాలు మరియు మన సవాళ్లు (గ్రామం/పాఠశాల/సమాజం లో పిల్లలు ఎదుర్కొనే వ్యక్తిగత మరియు సమూహ అవసరాలు సవాళ్లు అర్థం చేసుకునే సెసన్ నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ప్రగతి సంస్థ నుండి మండల కోఆర్డినేటర్ జి శిరీష ఐసిడిఎస్ సూపర్వైజర్ రత్న కుమారి. ఆముదూరు ఏ డబ్ల్యు డబ్ల్యు అశోకరాని , ఆశా రమాదేవి ,మల్లంపల్లి ఏ డబ్ల్యూ డబ్ల్యూ వసంత , ఆశా వర్కర్ అమల పాల్గొనడం జరిగింది.

# పర్యావరణన్ని కాపాడుదాం

## పచ్చదనానికి తోడుగా నిలుద్దాం. కలెక్టర్ వెంకటేశ్వర్

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



ప్రకృతిని సంపదను, కాపాడుకుంటేనే మానవ మనుగడ సాధ్యమవుతుందని, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రకృతి,పర్యావరణ పరిరక్షణలో భాగంగా, తుడా ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మొక్కలు నాటి నీరు పోశారు. భావితరాల ,భవిష్యత్తు కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన ఆవశ్యకతను కూడా చైర్మన్ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కేవలం మొక్కలను నాటడమే కాకుండా వాటిని రక్షించి వృక్షాలుగా మార్చే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, కలెక్టర్ వెంకటేశ్వర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జెసి ,గోవిందరావు, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి, తుడా, ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర, ఉన్నతాధికారులతోపాటు రేణిగుంట టిడిపి నాయకులు, మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి, చెర్లోపల్లి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, సింగల్ విండో చైర్మన్ వీరాపురంభాస్కర్ రెడ్డి, ఆంధ్ర 29 ఎన్, సి, సి, బ్యాచ్, విద్యార్థులు మరియు అధికారులు,ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం

# అమ్మ పేరు తో మొక్క నాటుదాం... భవిష్యత్ తరాలకు పచ్చని బహుమతి అందిద్దాం

ప్రజా భూమి ప్రతినిధి సువర్ధయపాలెం.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వరదయ్యపాలెం మండలంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణ కు తమ అంకితభావాన్ని చాటుకున్నారు. "అమ్మ పేరు తో మొక్క నాటుదాం" అనే ప్రధానమంత్రి పిలుపును ఆచరణలో పెడుతూ, ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రకృతి పరిరక్షణ కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని నాయకులు పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలకు చెట్ల పెంపకం ఒక శాశ్వత పరిష్కారమని తెలిపారు. ఒక మొక్క నేడు నాటితే రేపటి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధితో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా ప్రాధాన్యత ఇస్తున్న కూటమి ప్రభుత్వం "గ్రీన్ ఆంధ్రప్రదేశ్" లక్ష్యంతో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. పచ్చదనం పెంపు ద్వారా గ్రామాలు, పట్టణాలు మరింత ఆహ్లాదకరంగా మారడంతో పాటు ప్రకృతి సమతుల్యత కూడా కాపాడబడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కె,దిలీప్ రాయల్, మాజీ మండల అధ్యక్షులు వేలూరు పురుషోత్తం,డివిజనల్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు గుత్తి త్యాగరాజు, సీనియర్ మహిళా నాయకురాలు శుభరత్నమ్మ, జనసేన జిల్లా కార్యదర్శి,తడ శ్రీను, ప్రధాన కార్యదర్శి వేలూరు,సూర్యనారాయణ,, మాజీ ఉపాధ్యక్షులు బి ప్రసాద్, ఉపాధ్యక్షులు లోకేష్, ఓబీసీ మోర్చా, కమ్యూనిటీ అధ్యక్షులు, వాసు రెడ్డి,భరణి, బాల్ రెడ్డి, రమణయ్య తదితరులు పాల్గొని మొక్కలు నాటారు. "ఒక్కో ఇంట్లో ఒక్కో మొక్క.. ప్రతి గ్రామంలో పచ్చని భవిష్యత్" అనే సందేశంతో ప్రజలందరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటిన కలెక్టర్

ప్రజా భూమి ప్రతినిధి చిత్తూరు.



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటి, సీడ్ బాల్స్ పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్. చిత్తూరు, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గుడిపాల జడ్పీ హైస్కూల్‌లో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్, డీఎఫ్ఓ సుబ్బరాజు కలిసి సీడ్ బాల్స్ పంపిణీ చేసి మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, పచ్చదనం పెంపొందించేందుకు విద్యార్థులు, ప్రజలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు.

# కలుషిత ఆహార పానీయాలవల్ల వచ్చే వ్యాధులపై, అవగాహన సదస్సు

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రేణిగుంట మండల వైద్యాధికారి డాక్టర్ తేజస్విని, ఆదేశాల మేరకు ఒడ్డిమిట్ట,వేణు గోపాలపురాలలో కలుషిత ఆహార పానీయాల వల్ల, సులభంగా వచ్చే టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి హెల్త్ సూపర్వైజర్ కామరాజు,హెచ్ఈఓ బాబు సిబ్బందితో కలిసి ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు.ఇటీవలే గ్రామంలో ఊరి గంగమ్మ జాతర జరిగి ఉండటంతో ముందు జాగ్రత్తగా పరిశుభ్రత మరియు కచ్చితమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా ఈ అంటు వ్యాధుల నుంచి సురక్షితంగా ఉండవచ్చననే ఆలోచనలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు హెల్త్ సూపర్వైజర్ కామరాజు తెలిపారు. కలుషిత మైన మురుగునీరు కలిసిన త్రాగునీరు లేదా కలుషితమైన ఐస్ ముక్కలను పానీయాలలో వాడటం వల్ల కూడా టైఫాయిడ్ వ్యాధి వ్యాపిస్తుందని, బహిరంగ ప్రదేశాల్లో సరైన మూతలు లేకుండా విక్రయించే ఆహార పదార్థాలు, కట్ చేసిన పండ్లు, మరియు పానీయాలు ఈ బ్యాక్టీరియాకు నిలయమని, టైఫాయిడ్ బ్యాక్టీరియా సోకిన వ్యక్తుల మలం లేదా మూత్రం ద్వారా ఆహారం కలుషితం కావడం వల్ల ఒకరి నుంచి మరొకరికి ఈ వ్యాధి వ్యాపిస్తుందని అందుకే బహిరంగ మలమూత్రవిసర్జన కూడదని పేర్కొన్నారు.వ్యాధి వచ్చినప్పుడు తీవ్రమైన జ్వరం,తల నొప్పి,అలసట, మరియు ఆకలి మందగించడం ఉంటాయని,రెండవ దశలో విరేచనాలు లేదా మలబద్ధకం, పొట్టఉబ్బడం, కడుపు నొప్పి వంటి సమస్యలొస్తాయని తెలిపారు.త్రాగేనీటిని ఎల్లప్పుడు మరిగించి వడకట్టి సురక్షితంగా చేసి త్రాగాలని,వీలైతే వాటర్ ప్యూరిఫైయర్లు లేదా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే వాడాలని,ఏదైనా తినడానికి ముందు, వంట చేయడానికి ముందు, మరుగుదొడ్డి వాడిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఎప్పుడూ వేడిగా, తాజాగా వండిన ఆహారాన్ని మాత్రమే తినడం,పచ్చి కూరగాయలు మరియు సలాడ్లను బయట తినడం మానేయాలని,వీధి వ్యాపారుల వద్ద లభించే పానీయాలు, ఐస్ క్రీములు,పానీ పూరీ,మసాలపూరీ, మరియు కవర్ చేయని ఆహారాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పించారు. టైఫాయిడ్ సోకినప్పుడు శరీరానికి శక్తినిచ్చే, సులభంగా జీర్ణమయ్యే ఆహారాలు మాత్రమే తీసుకోవాలనీ,గంజి, కిచిడీ,ఉడికించిన బంగాళ దుంపలు, అరటిపండు, బొప్పాయి వంటి సులువుగా జీర్ణమయ్యే పండ్లను తినవచ్చునని, శరీరం డీహైడ్రేట్ కాకుండా పుష్కలంగా నీరు, కొబ్బరి నీరు,లేదా మరగకాచి చల్లార్చిన మంచినీరు మాత్రమే త్రాగాలని,కారం, మసాలాలు,మరియు నూనె ఎక్కువగా ఉన్న జంక్ ఫుడ్స్ను పూర్తిగా కూడదనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఎవరికైనా టైఫాయిడ్ వంటి లక్షణాలుంటే వ్యాధి నిర్ధారణ, చికిత్స,జ్వరం తీవ్రత ఎంత ఉంది,కడుపు నొప్పి లేదా విరేచనాలు ఏమైనా ఉన్నాయా, అని అడిగి మరీ అడిగినవారు.ఎవరైనా ఉంటే దగ్గరలోనే ఉన్న మన ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యుల సేవలు పొందాలని, వ్యాధి నిర్ధారణ పరీక్షలు,చికిత్స ఉచితమని (హెచ్,ఈ,ఓ )బాబు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు రేవతి, లోహిత,ఆశాకార్య కర్తలు విమల,లక్ష్మీ ప్రసన్న, పాల్గొన్నారు.

# అమర రాజా ఎనర్జీ - మొబిలిటీ లిమిటెడ్లో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

అమర రాజా ఎనర్జీ ట మొబిలిటీ లిమిటెడ్ అన్ని ప్రదేశాల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం--2026ను ఘనంగా నిర్వహించింది. సుస్థిరత, వాతావరణ చర్యలు, సహజ వనరుల సంరక్షణ మరియు పర్యావరణ పరిరక్షణ పట్ల సంస్థకు ఉన్న అచంచలమైన కట్టుబాటును ఈ సందర్భంగా మరొక్కసారి చాటిచెప్పింది. ఈ ఏడాది ప్రపంచ పర్యావరణ దినోత్సవం "నౌ ఫర్ క్లైమేట్ -- ప్రకృతి నుండి ప్రేరణ... వాతావరణం కోసం... మన భవిష్యత్తు కోసం..." అనే ప్రపంచ థీమ్తో నిర్వహించబడింది. ఈ థీమ్ ప్రకృతి ఆధారిత పరిష్కారాల ద్వారా వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొనేందుకు సమిష్టి అవసరమన్నారు. అమర రాజా ఎనర్జీ ట మొబిలిటీ లిమిటెడ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నారాయణ్ చౌదరి మార్గదర్శకత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇండస్ట్రియల్ బిజినెస్ యూనిట్ ఆపరేషన్స్ హెడ్ ఎం. శ్రీనివాసరావు, ఆటోమోటివ్ బిజినెస్ యూనిట్ ఆపరేషన్స్ హెడ్ బి. మునీశ్వర నాయుడు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి తిరుపతి జోనల్ కార్యాలయానికి చెందిన సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ బి.వై. మునిప్రసాద్, సీనియర్ ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ చి. రాజశేఖర్ మరియు ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ మనోహర్ చీలి హాజరై సభను ఉద్దేశించి ప్రసంగించారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం నియంత్రణ పరమైన బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి వ్యక్తి, ప్రతి సంస్థ యొక్క సమిష్టి బాధ్యత అని వారు పేర్కొన్నారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా హెల్త్, సేఫ్టీ అండ్ ఎన్విరాన్మెంట్ విభాగాధిపతి డా. సదాశివన్ సురేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న వాతావరణ మార్పుల ప్రభావాలను ప్రస్తావించారు. పారిశ్రామిక యుగానికి ముందు ఉన్న స్థాయిలతో పోలిస్తే భూమి ఉష్ణోగ్రత పెరుగుదలను 1.5 డిగ్రీల సెల్సియస్ లోపు పరిమితం చేయడం అత్యంత అవసరమని తెలిపారు. సహజ వనరుల సంరక్షణ, జీవ వైవిధ్య పరిరక్షణ, పర్యావరణ ప్రభావాల తగ్గింపు మరియు భావితరాల భద్రత కోసం తక్షణ చర్యలు అవసరమని ఆయన వివరించారు. కార్యక్రమంలో భాగంగా అమర రాజా చేపడుతున్న పలు సుస్థిరత కార్యక్రమాలను ప్రదర్శించారు. పునరుత్పాదక ఇంధన వినియోగం, ఇంధన సామర్థ్య మెరుగుదల, నీటి సంరక్షణ, మురుగు నీటి శుద్ధి మరియు పునర్వినియోగం, వ్యర్థాల తగ్గింపు, పునర్వినియోగ ప్రక్రియలు, హరిత వలయాల అభివృద్ధి, కాలుష్య నివారణతో పాటు కార్బన్ ఉద్గారాల తగ్గింపునకు చేపడుతున్న చర్యలను వివరించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా తిరుపతి జిల్లా కరకంబాడి మరియు చిత్తూరు జిల్లా నూనెగుండ్లపల్లి ప్రాంతాల్లోని సంస్థ ప్రాంగణాల్లో విభాగాధిపతులు, ఉద్యోగులు కలిసి 450కు పైగా మొక్కలను నాటారు. ఈ మొక్కల నాటే కార్యక్రమం హరితావరణ విస్తరణ, పర్యావరణ సమతుల్యత పరిరక్షణ మరియు సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి సంస్థ చేస్తున్న కృషికి నిదర్శనంగా నిలిచింది. ఈ వేడుకల ద్వారా అమర రాజా ఎనర్జీ - మొబిలిటీ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాల్లో పర్యావరణ బాధ్యతను మరింత బలోపేతం చేస్తూ, వాతావరణానికి అనుకూలమైన మరియు సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి తన నిబద్ధతను మరోసారి నిరూపించుకున్నారు.





# టీటీడీ ఆసుపత్రుల్లో 'శ్రీవారి వైద్య సేవ' ప్రారంభం

## ప్రపంచవ్యాప్తంగా వైద్య నిపుణులకు స్వచ్ఛంద సేవలందించే అవకాశం -- ఐటీ అప్లికేషన్ ఆవిష్కరణ

ప్రజాభూమి ప్రతినిధి తిరుమల

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ ఆసుపత్రుల్లో "శ్రీవారి వైద్య సేవ" కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్ను ఆవిష్కరించారు. అనంతరం ఈవో మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల సేవలను శ్రీవారి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రయోగాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల అభిప్రాయాలను సేకరించి మరింత మెరుగుపరిచే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు విద్య, వైద్యం, ఐటీ తదితర రంగాల్లో సేవాభావంతో ముందుకు వచ్చే నిపుణులకు టీటీడీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. టీటీడీ ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి, భోజన సౌకర్యాలను కల్పించనున్నట్లు వెల్లడించారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసి, అధిక సంఖ్యలో నిపుణుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు, వైద్య నిపుణులు తమకు అనుకూలమైన తేదీల్లో ఆన్లైన్లో నమోదు చేసుకుని సేవలందించవచ్చున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులకు మూడు రోజుల పాటు, ఎంబీబీఎస్ వైద్యులకు ఏడు రోజుల పాటు స్వచ్ఛంద సేవ చేసే అవకాశం కల్పించనున్నారు. వీరికి తిరు మల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలను టీటీడీ అందించనుంది. అశ్విని ఆసుపత్రి, స్విమ్స్, బర్డ్ ఆసుపత్రి, ఆయుర్వేద ఆసుపత్రి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, ఎస్వీ గోశాల తదితర టీటీడీ అనుబంధ సంస్థల్లో వైద్య నిపుణులు తమ సేవలను అందించనున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్య నిపుణులు టీటీడీ వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో తమ స్లాట్ను బుక్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ వెంకటాచలం, సికింద్రాబాద్ కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్.ఏ. శాస్త్రి, వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్ర ప్రసాద్, బెంగళూరు ఈఎస్ఐ ఆసుపత్రి ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ పురుషోత్తం వర్చువల్గా ఈవోతో మాట్లాడి, టీటీడీ ఆసుపత్రుల్లో సేవలందించే అవకాశం కల్పించడం శ్రీవారి అనుగ్రహంగా భావిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈవోలు (విద్య, వైద్యం) డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీకృష్ణ, వివిధ ఆసుపత్రుల డైరెక్టర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.






# ప్రజాధనం దుర్వినియోగమా?

## ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామ సచివాలయంలో వ్యక్తిగత వాహనాలకు చార్జింగ్.

ప్రజా భూమి ప్రతినిధి ఏర్పేడు.



తిరుపతి జిల్లా, ఏర్పేడు మండలం లోని, ప్రజా సేవల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయాలను కొందరు సిబ్బంది సొంత అవసరాలకు వాడుకుంటున్న తీరు విమర్శలకు దారితీస్తోంది. ఏర్పేడు మండలం ఎండి పుత్తూరు గ్రామ సచివాలయంలో బ్యాటరీ వాహనాలకు చార్జింగ్ పెట్టుకుంటున్న దృశ్యాలు బయటపడ్డాయి.

అసలు ఏం జరిగింది : ఎండి పుత్తూరు గ్రామ సచివాలయం భవనం బయట ఒక టి (వి ఎస్ హై క్యూబ్),ఎలక్ట్రిక్ స్కూటర్కు సచివాలయం నుంచి వైరు వేసి చార్జింగ్ పెట్టినట్లు ఫోటోల్లో స్పష్టంగా కనిపిస్తోంది. సచివాలయం అనేది ప్రజలకు సేవలందించే ప్రభుత్వ కార్యాలయం. అలాంటి చోట ప్రభుత్వ కరెంటును వ్యక్తిగత అవసరాలకు వాడుకోవడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సచివాలయానికి వచ్చే కరెంటు బిల్లును ప్రభుత్వమే చెల్లిస్తుంది. అంటే ఇది ప్రజల సొమ్ము. దాన్ని సిబ్బంది తమ బైకుల చార్జింగ్కు వాడుకోవడం నిబంధనలకు విరుద్ధం. ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగత విద్యుత్ వినియోగం నిషేధం. అయినా బహిరంగంగానే చార్జింగ్ పెట్టడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనం.




సేవలకు ఆటంకం: అత్యవసర సేవల కోసం వచ్చిన 104 వాహనం కూడా సచివాలయం ముందు నిలిపి ఉంది. ఇలాంటి చోట బాధ్యతగా ఉండాల్సిన సిబ్బందే నిబంధనలు పాటించకపోతే ఎలా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

అధికారులు ఏమంటున్నారు : ఈ విషయంపై ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శి స్పందించాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల్లో వ్యక్తిగత వాహనాల చార్జింగ్కు అనుమతి లేదు. ఒకవేళ సిబ్బంది గానీ, ఎవరైనా గానీ ఇలా చేస్తే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

సచివాలయం సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వినియోగంపై స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని, జిల్లా యంత్రాంగం తక్షణమే విచారణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

# తిరుపతి డిజిటల్ మహిళ కార్యక్రమానికి తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి ఆహ్వానం

ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి



స్థానిక తుడా కార్యాలయంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డిని 'తిరుపతి డిజిటల్ మహిళ' కోఆర్డినేటర్ల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా మహిళల సాధికారత, ఉపాధి ప్రోత్సాహాన్ని లక్ష్యంగా నిర్వహించనున్న 'తిరుపతి డిజిటల్ మహిళ' కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేయాల్సిందిగా కోరుతూ ఆహ్వాన పత్రికను అందజేశారు. మహిళల డిజిటల్ అక్షరాస్యత పెంపు, ఆర్థిక స్వావలంబన సాధన లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు కోఆర్డినేటర్లు వివరించారు. సమాజంలో మహిళల పాత్రను మరింతబలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు డాలర్స్ దివాకర్ రెడ్డిని ఆహ్వానించారు. డాలర్స్ దివాకర్ రెడ్డిని కలిసి ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో 'తిరుపతి డిజిటల్ మహిళ' కోఆర్డినేటర్ డాక్టర్ ఆయేషా, కమిటీ సభ్యులు గాయత్రి, అపర్ణ, హరిప్రియ, కళావతి పాల్గొన్నారు.



# రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ,కు సాదర వీడ్కోలు.

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



రెండు రోజులు తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంత్రి పీయూష్ గోయల్,కు రేణిగుంట విమానాశ్రయం నందు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్ సుబ్బారాయుడు, శ్రీకాళహస్తి ఆర్ ,డి, ఓ బానుప్రకాష్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు , కేంద్ర వాణిజ్య,పరిశ్రమల మంత్రిత్వ శాఖ మంత్రి సాదర వీడ్కోలు పలికారు.

# శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రి ఎమర్జెన్సీ గేట్కు అడ్డంగా ద్వి చక్ర వాహనాలు

## రోగుల ప్రాణాలతో చెలగాటం

ప్రజా భూమి ప్రతినిధి శ్రీకాళహస్తి.



శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా హాస్పిటల్లో అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆసుపత్రిలో అత్యంత కీలకమైన అత్యవసర విభాగం ద్వారం వద్దే సిబ్బందికి చెందిన ద్విచక్ర వాహనాలు అడ్డంగా నిలిపి ఉంచారు.గురువారం రాత్రి 8:27 గంటల సమయంలో తీసిన ఈ ఫోటోలో ఎమర్జెన్సీ గేటుకు ఎదురుగా 5 ద్విచక్ర వాహనాలు నిలిపి ఉండటం స్పష్టంగా కనిపిస్తోంది.గేటు లోపల పోలీస్ సిబ్బంది, మరికొందరు వ్యక్తులు ఉన్నారు.ప్రాణాపాయ స్థితిలో వచ్చే రోగులకు ఇబ్బంది. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం యాక్సిడెంట్ కేసులు, పాయిజన్ కేసులు, గుండెపోటు వంటి అత్యవసర కేసులు వస్తుంటాయి. అంబులెన్స్లో వచ్చే రోగులను స్ట్రెచర్పై నేరుగా ఎమర్జెన్సీ వార్డులోకి తీసుకెళ్లాల్సి ఉంటుంది. కానీ గేటు ఎదురుగా ఇలా వాహనాలు నిలపడం వల్ల స్ట్రెచర్ తీసుకెళ్లడానికి కూడా వీలు లేకుండా పోయింది.నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బంది. ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ స్థలం ఉన్నప్పటికీ సిబ్బంది తమ వాహనాలను నేరుగా ఎమర్జెన్సీ గేటు ముందే నిలుపుతున్నారు. దీనిపై పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. ఒక్క నిమిషం ఆలస్యం అయినా రోగి ప్రాణం పోయే ప్రమాదం ఉన్న ఎమర్జెన్సీ విభాగం వద్ద ఇలాంటి నిర్లక్ష్యం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.వెంటనే జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించి ఎమర్జెన్సీ గేటు వద్ద వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి. "నో పార్కింగ్" బోర్డు ఏర్పాటు చేసి, నిబంధనలు అతిక్రమించిన వారిపై జరిమానా విధించాలని ప్రజలు కోరుతున్నారు.

# డాక్టర్ బాలకృష్ణ నాయక్ చేతుల మీదుగా వాకింగ్ ఫ్రేమ్స్, చేతికర్రలు అందజేత

ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.



తేదీన డాక్టర్ బాలకృష్ణ నాయక్ డి ఎం అండ్ హెచ్ ఓ గారు తిరుపతి, మరియు డాక్టర్ పి. శైలజ, జిల్లా కుష్టు ఎయిడ్స్ మరియు టీబీ అధికారి గారు తిరుపతి లోని అనంత సేన మరియు జ్యోతి లెప్రసీ కాలనీల నందు అర్హులైన కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం పొందిన వారికి వాకింగ్ ఫ్రేమ్స్, చేతి కర్రలు, ప్రత్యేకంగా తయారుచేసిన మైక్రో సెల్యులార్ రబ్బరు( ఎం ,సి ,ఆర్ )తో తయారు చేసిన పాదరక్షలు మరియు అవసరమైన డ్రెస్సింగ్ మెటీరియల్స్ అందజేశారు. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ గారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం పొందినవారు ప్రతిరోజు అరికాళ్ళు మరియు అరిచేతులను నీటిలో నానబెట్టి శుభ్రపరచుకొని తర్వాత వేప నూనె పూసుకోవాలని, పుండ్లు ఉంటే డ్రెస్సింగ్ చేసుకోవాలని మరియు తీసుకోవాల్సిన స్వీయ జాగ్రత్తలను తెలియజేశారు మరియు వారికి రావాల్సిన అంగవైకల్య పెన్షన్లు వస్తున్నాయా లేదా అని విచారించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజా, డిఎన్ఎమ్ఓ, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రాజేష్, డాక్టర్ వసుధ, ఆరోగ్య విస్తరణ అధికారి బాబు నెహ్రూ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ శ్రీరాములు నాయక్, డిపిఎంవోలు ముని సుబ్బరామిరెడ్డి, సుధాకర్ నాయక్ మరియు స్వచ్ఛంద కార్యకర్త రమణ మొదలగు వారు పాల్గొన్నారు



# ప్రజల ఆశీర్వాదంతో మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రజాభూమి ప్రతినిధి -సత్యవేడు



సత్యవేడు నియోజకవర్గ శాసనసభ్యుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకుని, మూడో సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత రెండు సంవత్సరాలుగా నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజలు అందించిన సహకారం, విశ్వాసం తనకు మరింత బాధ్యతను పెంచాయని పేర్కొన్నారు. నియోజకవర్గ ప్రగతి కోసం నిరంతరం సహకరిస్తూ మార్గనిర్దేశం చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే ఈ ప్రయాణంలో అడుగడుగునా అండగా నిలిచిన సత్యవేడు నియోజకవర్గ ప్రజలకు, అభిమానులకు, యువతకు, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, అలాగే నిరంతరం శ్రమిస్తున్న వాటర్ మహాసేన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో కూడా ప్రజల సహకారంతో సత్యవేడు నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని కోనేటి ఆదిమూలం తెలిపారు. ప్రజల ఆశీస్సులు, సహకారమే తనకు బలమని పేర్కొన్నారు.

# ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు అందరూ సహకరించాలి

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి.

ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి



ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ (ఎఫ్.ఏ. సి.) శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం నగరంలోని జీవకోన నందు పారిశుధ్య పనుల నిర్వహణ, రైతు బజార్ నందు పారిశుధ్య పనులతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైనవి వినియోగించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లలో కట్టి వేసిన చెత్తచెదారం వస్తోందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో మట్టి, చెత్త తొలగించాలని తెలిపారు. రుతుపవనాల వలన కురిసే వర్షాలతో రోడ్లపై నీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా తగుచర్యలు చెపట్టాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రమణ, మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేద కుటుంబం నుంచి ప్రజావైద్యుడిగా ఎదిగి వేలాది మందికి జీవనాధారంగా నిలిచిన డాక్టర్ కారణి మునస్వామి

## - స్విమ్స్ సంతాప సభలో వక్తల నివాళి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

పేదరికాన్ని జయించి, కృషి మరియు పట్టుదలతో వైద్య విద్యను అభ్యసించి, మూడు దశాబ్దాలకు పైగా వేలాది మంది రోగులకు వైద్య సేవలు అందించిన ప్రజావైద్యుడు డాక్టర్ కారణి మునస్వామి జీవితం నేటి తరానికి ఆదర్శమని వక్తలు పేర్కొన్నారు. వైద్య వృత్తిని ఉద్యోగంగా కాకుండా మానవ సేవగా భావించి, చివరి వరకు రోగుల ఆరోగ్య సంరక్షణకే అంకితమైన ఆయన మరణం వైద్య రంగానికి, స్విమ్స్ కుటుంబానికి తీరని లోటని అన్నారు. పేద కుటుంబంలో పుట్టిన ప్రతి విద్యార్థికి డాక్టర్ మునస్వామి జీవితం ఒక స్ఫూర్తిదాయకమైన ప్రస్థానమని కొనియాడారు. వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) అత్యవసర విభాగం చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించిన డాక్టర్ కారణి మునస్వామి మృతికి సంతాపంగా స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు), వార్డు బాయ్స్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం పద్మావతి ఆడిటోరియంలో సంతాప సభ నిర్వహించారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో ముందుగా డాక్టర్ మునస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయన ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి సంతాప సభను ప్రారంభించారు. స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిఐటియు నగర ఉపాధ్యక్షులు కే. వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన ఈ సభలో అత్యవసర విభాగం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకర్, స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, స్విమ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ (పీఆర్) వి. రాజశేఖర్, తిరుపతి నగర ప్రముఖులు ఓం ప్రకాష్, సిపిఎం తిరుపతి జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సుబ్రహ్మణ్యం, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎస్. జయచంద్ర, సిఐటియు నగర అధ్యక్షురాలు పి. బుజ్జి, స్విమ్స్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జి. రవి తదితరులు పాల్గొని తమ సంతాపాన్ని తెలియజేశారు. అత్యవసర విభాగం చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకర్ మాట్లాడుతూ, మూడు దశాబ్దాలకు పైగా డాక్టర్ మునస్వామి తో కలిసి పనిచేసిన అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. అత్యవసర వైద్య సేవల్లో ఎన్నో క్లిష్ట పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొని అనేక మంది ప్రాణాలను కాపాడిన అంకితభావం కలిగిన వైద్యుడని అన్నారు. రోగుల కుటుంబ సభ్యులతో సైతం ఆప్యాయంగా మాట్లాడి వారికి ధైర్యం చెప్పే అరుదైన వ్యక్తిత్వం ఆయనదని పేర్కొన్నారు.



వైద్యులు, నర్సులు, సిబ్బంది అందరితో స్నేహపూర్వకంగా వ్యవహరించడం వల్ల అందరి అభిమానాన్ని చూరగొన్నారని తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి మాట్లాడుతూ, డాక్టర్ మునస్వామి కేవలం ఒక వైద్యుడు మాత్రమే కాదని, ప్రజల ఆరోగ్యాన్ని తన బాధ్యతగా భావించిన నిజమైన ప్రజావైద్యుడని అన్నారు. పేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించడంలో ఎప్పుడూ ముందుండేవారని చెప్పారు. ఆయన మరణం వల్ల స్విమ్స్ ఒక సమర్థుడైన వైద్యుడిని, సమాజం ఒక మంచి మనిషిని కోల్పోయిందన్నారు. వక్తలు మాట్లాడుతూ తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గంలోని మాంబట్టు గ్రామంలో అత్యంత నిరుపేద కుటుంబంలో జన్మించిన డాక్టర్ మునస్వామి చిన్ననాటి నుంచే ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నారని తెలిపారు. గ్రామంలో సరైన మౌలిక సదుపాయాలు కూడా లేని పరిస్థితుల్లో విద్యాభ్యాసం కొనసాగించి, పట్టుదలతో ఎంబీబీఎస్ పూర్తి చేశారని గుర్తు చేశారు. 1994లో స్విమ్స్‌లో చేరిన ఆయన 2026 వరకు నిరంతరంగా వైద్య సేవలు అందిస్తూ వేలాది మంది రోగుల జీవితాల్లో ఆశాకిరణంగా నిలిచారని పేర్కొన్నారు. డాక్టర్ మునస్వామి జీవితం కేవలం ఒక వ్యక్తి విజయగాథ మాత్రమే కాదని, కష్టపడితే ఏ స్థాయికైనా ఎదగవచ్చని నిరూపించిన స్ఫూర్తిదాయకమైన ప్రస్థానమని వక్తలు తెలిపారు. పేద కుటుంబాల్లో జన్మించిన విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేసే స్థాయికి ఎదగడమే డాక్టర్ మునస్వామి కి ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఆయన చూపిన సేవా మార్గం, మానవతా విలువలు, అంకితభావం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు, స్విమ్స్ ఉద్యోగులు, వార్డ్ బాయ్స్, కార్మిక నాయకులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని డాక్టర్ కారణి మునస్వామి కి నివాళులు అర్పించారు.

# గుడిపాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక.



ప్రజా భూమి ప్రతినిధి గుడిపాల.

చిత్తూరు జిల్లా గుడిపాల మండలం గుడిపాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక పి జి ఆర్ ఎస్ ఒక నెల, నాలుగు సందర్శనలు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సంబంధిత అధికారులకు పరిష్కారం కోసం ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్ర, మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# వాకర్స్ అసోసియేషన్‌కు సౌండ్ సిస్టం విరాళం అందజేసిన డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి

సామాజిక సేవా కార్యక్రమాలకు ఎల్లప్పుడూ ముందుండే శ్వేతా హాస్పిటల్ అధినేత, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ అధ్యక్షుడు డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి, తిరుపతి పట్టణంలోని శ్రీ ప్రకాశం పార్క్ మునిసిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్‌కు సౌండ్ సిస్టంను విరాళంగా అందజేశారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపీనాథ్ మరియు సభ్యులు పార్కులో నిర్వహించే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, సామాజిక సేవా కార్యక్రమాలు, ప్రజలకు ఉపయోగపడే సమావేశాల కోసం సౌండ్ సిస్టం అవసరమని కోరగా, వెంటనే స్పందించిన డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి సౌండ్ సిస్టంను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి మాట్లాడుతూ సమాజంలో సేవాగుణం, దానధర్మాలు ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అన్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నివారణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణలో ఈ సౌండ్ సిస్టం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆరోగ్య సదస్సులు, వ్యాధుల నివారణపై అవగాహన కార్యక్రమాలు, ప్రజా చైతన్య కార్యక్రమాలకు ఇది దోహదపడుతుందని తెలిపారు. వాకర్స్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ ఏ.ఆర్. రెడ్డి అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సౌండ్ సిస్టం ద్వారా ప్రజలకు ఆరోగ్య సంబంధిత అవగాహన కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా నిర్వహించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తిరుపతి శాఖ కోశాధికారి డాక్టర్ రెడ్డప్ప, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలి

## తుడా ప్లానింగ్ విభాగం అధికారులతో డాలర్స్ దివాకర్ రెడ్డి సమీక్ష




ప్రజాభూమి ప్రతినిధి తిరుపతి

తుడా కార్యాలయంలో తుడా చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెలుగుదేశం పార్టీ తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డాలర్స్ దివాకర్ రెడ్డి ప్లానింగ్ విభాగం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.తుడా పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, మౌలిక సదుపాయాల కల్పన, భవిష్యత్ ప్రణాళికల అమలు తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్లానింగ్ విభాగంలో లేఅవుట్ అప్రూవల్స్, భవన నిర్మాణ అనుమతులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను నిబంధనల మేరకు వీలైనంత త్వరగా పరిష్కరించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరం మరియు పరిసర ప్రాంతాల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా మాస్టర్ ప్లాన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని సూచించారు. నగర సుందరీకరణతో పాటు ప్రణాళికాబద్ధమైన అభివృద్ధికి ప్లానింగ్ విభాగం మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాల అమలులో పారదర్శకత, వేగం పెంచాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో తుడా సెక్రటరీ డాక్టర్ ఎన్.వి. శ్రీకాంత్ బాబు, సీపీఓ దేవికుమారి, ఏపీఓలు, జేపీఓలు, ప్లానింగ్ విభాగం అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ పరికరాల అద్దె తో రైతులకు మెరుగైన సేవలు

## రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలను బలోపేతం చేయాలని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభావతి

ప్రజా భూమి ప్రతినిధి, బుచ్చినాయుడు కండ్రిగ




తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండల వెలుగు కార్యాలయంలో వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రం ద్వారా చేపట్టాల్సిన కార్యక్రమాలపై గురువారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తిరుపతి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీమతి పి. ప్రభావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధ్వర్యంలో వ్యవసాయ పరికరాల అద్దె కేంద్రం ఏర్పాటు చేయడం ద్వారా రైతులకు అవసరమైన వ్యవసాయ పరికరాలు సకాలంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. దీంతో రైతుల సాగు ఖర్చులు తగ్గడంతో పాటు వ్యవసాయ పనులు మరింత సులభతరం అవుతాయని పేర్కొన్నారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ప్రతినిధి శ్రీమతి ద్రాక్షాయణి మాట్లాడుతూ అద్దె కేంద్రం ద్వారా కొనుగోలు చేయాల్సిన వ్యవసాయ పరికరాలు, వాటిని రైతులకు అద్దెకు అందించే విధానం, నిర్ణయించాల్సిన అద్దె రుసుములు, సమాఖ్య ద్వారా చేపట్టాల్సిన వ్యాపార కార్యకలాపాల గురించి వివరించారు. రైతు ఉత్పత్తిదారుల సమాఖ్యలు గ్రామీణ రైతుల ఆర్థికాభివృద్ధికి కీలకమని, సమిష్టి కృషితో వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయవచ్చని సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల ప్రాజెక్టు నిర్వాహకులు మునెయ్య, సుదర్శన్ రాజు, సమన్వయకర్తలు పయని, వెంకటరత్నం, జీవ, లెక్కల నిర్వహకులు హిమగిరిజ, శిరీషతో పాటు రైతు ఉత్పత్తిదారుల బృందాల నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతనను పెంపొందించుకోవాలి - ఎమ్మెల్యే పులివర్తి నాని

## కోటిలింగేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనుల ప్రారంభించిన ఎమ్మెల్యే పులివర్తి నాని



ప్రజా భూమి ప్రతినిధి,రామచంద్రపురం



సమాజంలో ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక దైవచింతన, భక్తి మార్గాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే కొలుమర్తి వెంకట మణి ప్రసాద్ ( నాని) అన్నారు. మండలంలోని రాయల చెరువు కట్ట కింద ఉన్న శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయం వద్ద దాతల సహకారంతో చేసిన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పులివర్తి నాని ప్రారంభించారు. శుక్రవారం పివిపురం పంచాయతీ, రాయల చెరువు కట్ట సమీపంలో శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి ఆలయ పరిసరాలలో నూతనంగా నిర్మించిన దుకాణాల సముదాయాన్ని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే పులివర్తి నానికి ఆలయ నిర్వాహకులు తంజావూరు మణి,జయభారతి దంపతులు, వేద పండితులు మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం శ్రీ జలకంఠేశ్వర స్వామి, శ్రీ కామాక్షి సమేత కోటిలింగేశ్వర స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. అర్చకులు ఎమ్మెల్యే పులివర్తి నానిని శాలువలతో సత్కరించి వేద ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయల చెరువు పరిసర ప్రాంతం ఆధ్యాత్మికత, పర్యాటకంగా అభివృద్ధికి అనుకూలంగా ఉందని పేర్కొన్నారు. రూ.రెండు కోట్ల రూపాయలతో ఆలయ ప్రాంగణంలో దాతలు సహకారంతో అభివృద్ధి చేయడం అభినందనీయమని దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మేకల తిరుమలరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ చేకూరు జనార్దన్ చౌదరి, ఆరి లీలా మోహన్ నాయుడు, నీలకంఠ చౌదరి, కేశవులనాయుడు, విజయ్ కుమార్, ఆర్ గిరిబాబు, సుగుణమ్మ, లతా సుబ్రహ్మణ్యం రెడ్డి, బాదురు ధనుంజయులు, మల్లిరెడ్డి జయరామయ్య, కుప్పా త్యాగరాజులు, రాజేష్ రెడ్డి, ఈశ్వర్ రాయల్, దాతలు భాస్కర్ నాయుడు, దేవరాజు నాయుడు, మరియు స్థానికులు దేశి రెడ్డి, కోటేశ్వర్ రెడ్డి, శేఖర్ నాయుడు, సురేంద్ర నాయుడు, మహేష్ నాయుడు, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# మీ భద్రత - మా బాధ్యత"

## - పుల్లంపేట మండలం అప్పరాజుపేట గ్రామంలో మహిళల భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం.






ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

పుల్లంపేట మండలం అప్పరాజుపేట గ్రామంలో మహిళల భద్రత, సంక్షేమం మరియు నేరాల నివారణ లక్ష్యంగా "మీ భద్రత -- మా బాధ్యత" అనే థీమ్‌తో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు, ఐపీఎస్., ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు వివిధ భద్రతా అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు. పుల్లంపేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మండల అధికారులతో సమన్వయం చేసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో అప్పరాజుపేట గ్రామం మరియు పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి రైల్వే కోడూరు రూరల్ సీఐ డి. శ్రీనివాసులు, పుల్లంపేట మండల డిప్యూటీ ఎంపీడీఓ, పుల్లంపేట ఎస్ఐ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు, వెలుగు సంస్థ ప్రతినిధులు తదితరులు హాజరయ్యారు. అవగాహన కార్యక్రమంలో భాగంగా మహిళలు మరియు చిన్నారులపై జరుగుతున్న నేరాలు, చైన్ స్నాచింగ్, సైబర్ మోసాలు, సోషల్ మీడియా ద్వారా జరిగే నేరాలపై అధికారులు వివరించారు. అలాగే కుటుంబ వివాదాలు, దాంపత్య సమస్యలు, వాటి వల్ల కుటుంబ వ్యవస్థపై పడే ప్రభావం గురించి అవగాహన కల్పిస్తూ, కుటుంబ సభ్యులు పరస్పర అవగాహనతో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. పిల్లలకు మంచి సంస్కారం, నాణ్యమైన విద్య అందించడం ద్వారా వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. మహిళలు ఏదైనా అత్యవసర పరిస్థితి ఎదురైనప్పుడు వెంటనే డయల్-112 నెంబర్లకు కాల్ చేసి పోలీసుల సహాయం పొందాలని సూచించారు. అదేవిధంగా మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ వినియోగం, అందులో అందుబాటులో ఉన్న సేవల గురించి వివరించారు. ఈ సందర్భంగా మహిళలు తమ భద్రతకు సంబంధించిన సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.

# చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు.. మంటల్లో చంద్రబాబు మేనిఫెస్టో!

**-సూపర్ సిక్స్ హామీల దహనం.. ప్రభుత్వం ప్రజలను మోసం చేసిదంటూ ఆగ్రహం**

**-ఆర్ సి పురం మండల కూడలిలో వైఎస్సార్‌సీపీ భారీ నిరసనలు**



ప్రజాభూమి ప్రతినిధి, రామచంద్రపురం

ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రెండేళ్లుగా మోసం చేస్తున్నారంటూ చంద్రబాబు ప్రభుత్వంపై వైఎస్సార్‌సీపీ నేతలు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" పేరుతో శుక్రవారం చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రపురం మండల కూడలి లో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. సూపర్ సిక్స్ హామీలకు సంబంధించిన ప్లకార్డులు, మేనిఫెస్టో పుస్తకాలను దహనం చేస్తూ ప్రభుత్వ వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి నాయకత్వంలో, రాష్ట్ర వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సూచనలతో చేపట్టిన నిరసన కార్యక్రమాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. నియోజకవర్గంలోని అన్ని మండలాల పార్టీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భరీగా పాల్గొని నిరసనలను విజయవంతం చేశారు.ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలను ప్రజలకు గుప్పించి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పూర్తిగా విస్మరించారని పలువురు వైఎస్ఆర్‌సీపీ నేతలు ఆరోపించారు. రెండేళ్లుగా సూపర్ సిక్స్ పథకాల అమలుపై స్పష్టత లేకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. ఈ సందర్భంగా "చెట్టుమీద కొంగ.. చంద్రబాబు దొంగ", "సూపర్ సిక్స్.. అట్టర్ ఫ్లాప్", "అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డౌన్ డౌన్" అంటూ నినాదాలతో మండల కేంద్రాలు మార్మోగాయి. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డిల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



# పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా సైకిల్ పర్యటన

## - 3 కిలోమీటర్ల మేర సైకిల్‌పై పద్మావతి నగర్ లేఔట్‌ను పరిశీలించిన తుడా చైర్మన్ డా॥ డాలర్స్ దివాకర్ రెడ్డి



ప్రజా భూమి ప్రతినిధి, తిరుపతి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని తుడా చైర్మన్,తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి వినూత్నంగా వ్యవహరించి అందరికీ ఆదర్శంగా నిలిచారు. పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించాలనే సదుద్దేశంతో ఆయన కూటమి నాయకులతో కలిసి సైకిల్ పర్యటన చేపట్టారు.తుకివాకం పద్మావతి నగర్ లేఔట్ ఆర్చ్ వద్ద ప్రారంభమైన సైకిల్ పర్యటన సురప్పకశం పద్మావతి నగర్ లేఔట్ వరకు ఉత్సాహంగా కొనసాగింది.సుమారు 3 కిలోమీటర్ల మేర సైకిల్‌పై ప్రయాణించిన తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి పద్మావతి నగర్ లేఔట్‌లోని అభివృద్ధి పనులను, మౌలిక సదుపాయాలను పరిశీలించారు. వాహన కాలుష్యాన్ని తగ్గించి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డా॥డాలర్స్ దివాకర్ రెడ్డి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడా చైర్మన్ గారితో పాటు పలువురు కూటమి నాయకులు, స్థానిక ప్రతినిధులు సైకిళ్లపై ఉత్సాహంగా పాల్గొని పర్యావరణ దినోత్సవ స్ఫూర్తిని నింపారు.



# మీ భూమి-- మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే పులివర్తి నాని..!

- గత వైసిపి ప్రభుత్వం ల్యాండ్ టైటిల్ యాక్ట్ ద్వారా రైతుల భూములను దోచేయాలని చూసింది..
- కూటమి ప్రభుత్వం రాకతో ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు..
- రాష్ట్ర ప్రభుత్వ రాజ ముద్ర తో కూడిన పట్టాదారు పాసుపుస్తకం పంపిణీ..
- రీసర్వే ద్వారా భూ వివాదాలు తొలగి,రైతులకు తమ భూములపై సర్వ హక్కులు: పులివర్తి నాని..





ప్రజా భూమి ప్రతినిధి,చంద్రగిరి :

చంద్రగిరి మండలం లోని మామండూరు పంచాయతీ లో మీ భూమి --మీ హక్కు పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్యఅతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే పులివర్తినానికి ఆర్డిఓ రామ్మోహన్, మండల స్థాయి అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మాటల ప్రభుత్వం కాదు.... చేతల ప్రభుత్వం అని.... కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు తొలి సంతకం ల్యాండ్ టైటిల్ ఆక్ట్ పై సంతకం చేసి ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను రద్దు చేసిన ఘనత మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కి దక్కుతుంది అని ఎమ్మెల్యే తెలిపారు.గత ఐదు సంవత్సరాలలో రెవెన్యూ వ్యవస్థను పూర్తిగా నిర్వీనం చేసిన గత పాలకులు. గత వైసిపి ప్రభుత్వంలో రిసర్వే పేరుతో రెవెన్యూ శాఖలో భారీగా అవకతవకలు జరిగాయన్నారు. గత ప్రభుత్వంలో రైతు పట్టాదారు పాసుపుస్తకాల పై మాజీ సీఎం ఫోటో ముద్రించి పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు.గత వైసిపి ప్రభుత్వంలో భూరక్ష పథకం కింద భూముల రీసర్వే కోసం సర్వే రాళ్లుకు సుమారు 600 కోట్లు ఖర్చు పెట్టడంతో పాటు సర్వే రాళ్లపై మాజీ సీఎం ఫోటోతో పాటు లోగోలు ముద్రించడం జరిగింది అని ఎమ్మెల్యే గుర్తుచేశారు. ఎలక్షన్ సమయంలో యువనాయకుడు నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రలో 70% భూ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లిన రైతులు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మీ భూమి పై మీకు సర్వ హక్కులు కల్పించే విధంగా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ శాఖలో రీ సర్వేలో నిర్వహించడం జరిగింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 2 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా చంద్రగిరి మండలం, మామండూరు పంచాయతీలో నిర్వహించిన రీ సర్వే పూర్తి చేసి 165 మందికి రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాజ ముద్రతో ముద్రించిన పాస్ పుస్తకాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు. పాస్ పుస్తకాలు అందుకున్న రైతులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కి, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్య ప్రసాద్ కి ఎమ్మెల్యే పులివర్తి నానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి రెవెన్యూ అధికారులు, రైతులు , కూటమి నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో ఐదు రోజుల ఏఐ టూల్స్ డెవలప్‌మెంట్ - సైబర్ సెక్యూరిటీ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ విజయవంతం



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

గూడూరు లోని ఆడిశంకర డీమ్డ్ టు బి యూనివర్సిటీలో అధ్యాపకుల కోసం నిర్వహించిన “ఏఐ టూల్స్ డెవలప్‌మెంట్ మరియు సైబర్ సెక్యూరిటీ” అంశాలపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ శుక్రవారం విజయవంతంగా ముగిసింది. జూన్ 1 నుండి 5 వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయంలోని అన్ని విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, ఇండియన్ సర్వర్స్ సంస్థ వ్యవస్థాపకుడు మరియు సీఈఓ సాయి సతీష్ వనరుల వ్యక్తిగా వ్యవహరించారు. ఐదు రోజుల పాటు కృత్రిమ మేధస్సు సాధనాలు, ఆధారిత కంటెంట్ తయారీ, ఆటోమేషన్ టెక్నాలజీలు, సైబర్ సెక్యూరిటీ మౌలికాంశాలు, సైబర్ దాడుల నివారణ, సురక్షిత డిజిటల్ పద్ధతులు, విద్యారంగంలో ఏఐ వినియోగం తదితర అంశాలపై ఆయన సమగ్రంగా శిక్షణ అందించారు.ముగింపు సమావేశంలో ఎఫ్ డి పి కోఆర్డినేటర్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ డీన్ డా. కె. ధనుంజయ మాట్లాడుతూ, అధ్యాపకులకు అత్యంత ఉపయోగకరమైన శిక్షణను అందించిన శ్రీ సాయి సతీష్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిక్షణ ద్వారా పొందిన నైపుణ్యాలను బోధనలో ఉపయోగించి విద్యార్థులకు మరింత స్పష్టతతో కూడిన అభ్యాసాన్ని అందించాలని అధ్యాపకులకు సూచించారు.విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. ఎం. రాజయ్య మాట్లాడుతూ, ఆధునిక బోధనా విధానాల్లో ఏఐ సాధనాల ప్రాధాన్యత రోజురోజుకూ పెరుగుతోందన్నారు. అధ్యాపకులు~ా× ఆధారిత బోధనా వనరులను అభివృద్ధి చేసుకొని విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని పిలుపునిచ్చారు. ప్రో వైస్-చాన్సలర్ డా. ఎ. మోహన్, బోధనలో అధునాతన కృత్రిమ మేధస్సు సాంకేతికతలను నేర్చుకుని వాటిని విద్యా విధానాల్లో సమర్థవంతంగా వినియోగించేందుకు ఆసక్తి చూపిన అన్ని అధ్యాపకులను అభినందించారు. ఈ శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, సాంకేతికత ఆధారిత అంశాలను బోధించే అధ్యాపకులకు మరింత సమర్థవంతమైన బోధన అందించడానికి తోడ్పడుతుందని, అలాగే విద్యార్థుల అభ్యాస అనుభవాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.శ్రీ సాయి సతీష్ కార్యక్రమం సందర్భంగా అధ్యాపకులు రూపొందించిన వివిధ ఏఐ టూల్స్, బోధనా సహాయక వనరులు, డిజిటల్ కంటెంట్, పుస్తకాలు మరియు ఇతర ప్రాజెక్టులను సమీక్షించారు. అధ్యాపకుల సృజనాత్మకతను అభినందిస్తూ, భవిష్యత్తులో కూడా నూతన సాంకేతికతలను విద్యారంగంలో వినియోగించాలని సూచించారు. ఈ ఎఫ్ డి పి లో ముఖ్య ఆకర్షణగా అధ్యాపకులు రూపొందించిన ఏఐ నమూనాలు, ఆధారిత అప్లికేషన్లు, బోధనా సహాయక సాధనాలు, డిజిటల్ లెర్నింగ్ వనరుల ప్రదర్శనలు నిలిచాయి. శిక్షణ ద్వారా పొందిన జ్ఞానం, నైపుణ్యాలను అధ్యాపకులు విజయవంతంగా ఆచరణలో పెట్టినట్లు ఈ ప్రదర్శనలు స్పష్టం చేశాయి.ఈ ముగింపు కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్లు, విభాగాధిపతులు మరియు అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ జడ రామయ్య కృతజ్ఞతా ప్రసంగంతో కార్యక్రమం ముగిసింది.

# సంతాన భాగ్యాన్ని ప్రసాదించే కార్వేటినగరం వేణుగోపాలస్వామి

## -జూన్ 6 నుంచి 14 వరకు వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

ప్రజాభూమి ప్రతినిధి కార్వేటినగరం

కార్వేటినగరంలోని వేణుగోపాలస్వామివారి ఆలయం భక్తుల కోరికలను తీర్చే కల్పవృక్షంగా, సంతానం లేని దంపతులకు సంతాన భాగ్యాన్ని ప్రసాదించే దివ్యక్షేత్రంగా విశేష ఖ్యాతి పొందింది. ఈ పవిత్ర ఆలయంలో జూన్ 6 నుంచి 14వ తేదీ వరకు వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఉత్సవాలకు నేడు అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలకు ముందు శాస్త్రోక్తంగా జూన్ 5న సాయంత్రం మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం నిర్వహించి అనంతరం అంకురార్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఉదయం సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు సేవలతో పాటు మహాలక్ష్మి అమ్మవారికి, రుక్మిణి--సత్యభామ సమేత వేణుగోపాలస్వామికి అభిషేకాలు నిర్వహించారు. సుమారు 5.15 ఎకరాల విస్తీర్ణంలో అద్భుత శిల్పకళా వైభవంతో నిర్మితమైన ఈ ఆలయం చరిత్ర, ఆధ్యాత్మికత, శిల్పకళలకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచింది.







ఆసియాలోనే అతిపెద్దదిగా పేరుగాంచిన 16 ఎకరాల స్కంద పుష్కరిణి ఈ క్షేత్రానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. చోళుల కాలం నాటికే ఈ ఆలయం ఉనికిలో ఉన్నట్లు చారిత్రక ఆధారాలు తెలియజేస్తున్నాయి. సుమారు 400 ఏళ్ల క్రితం కార్వేటినగర రాజవంశీయుడు వెంకటపెరుమాళ్ రాజు ఆలయాన్ని పునర్నిర్మించారు. వేణువు ధరించి, పాదాల వద్ద వెన్నకుండ, వెనుక గోవుతో, ఇరువైపులా రుక్మిణి, సత్యభామ అమ్మవార్లతో దర్శనమిచ్చే మూలవిరాట్ భక్తులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఆలయ ప్రాంగణంలోని కోదండరామస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు కూడా విశేష ప్రాధాన్యం కలిగి ఉన్నాయి. సీతారామలక్ష్మణుల విగ్రహాలు తోరణంతో సహా ఏకశిలలో చెక్కబడటం ఈ క్షేత్ర శిల్పకళా వైభవానికి నిదర్శనంగా నిలుస్తోంది. ప్రఖ్యాత వాగ్గేయకారుడు సారంగపాణి ఈ క్షేత్రాధిదేవుడైన వేణుగోపాలస్వామిపై 200కు పైగా భక్తి కీర్తనలు రచించడం విశేషం. 1936 నుంచి దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో కొనసాగిన ఈ ఆలయం 1989 ఏప్రిల్ 10న టీటీడీలో విలీనం అయింది. అప్పటి నుంచి ఆలయ అభివృద్ధికి టీటీడీ విశేష ప్రాధాన్యం ఇస్తోంది. ఆలయంలో ప్రతిరోజూ నవనీతం, పెరుగన్నం, కట్టె పొంగలి, పులిహోర, మిరియాల పొంగలి, పాలు, డ్రైఫ్రూట్స్, పండ్లు తదితర నైవేద్యాలను సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందజేస్తున్నారు. పర్వదినాల్లో క్షీరాన్నం, బెల్లం పొంగలి, అప్పం, లడ్డూ, వడ, సుగిలు, బెల్లం దోస వంటి విశేష నైవేద్యాలు సమర్పిస్తారు. ప్రతి శుక్రవారం మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా గృహస్తులు రూ.700 చెల్లించి స్వామి--అమ్మవార్ల కళ్యాణోత్సవంలో పాల్గొనే అవకాశం కల్పించారు. తెప్పోత్సవాలు, పవిత్రోత్సవాలు, వసంతోత్సవాలు, శ్రీరామనవమి, గోకులాష్టమి, పశువుల పండుగ వంటి ఉత్సవాలను ఆలయంలో ఘనంగా నిర్వహించడం ప్రత్యేకత.అలాగే భక్తులకు ప్రతిరోజూ దాతల సహకారంతో ఉచిత అన్నప్రసాదాలను భక్తిశ్రద్ధలతో పంపిణీ చేస్తున్నారు. టీటీడీ ఆధ్వర్యంలోకి వచ్చిన తరువాత ఆలయంలో నిత్యకైంకర్యాలు, ఆర్జిత సేవలు, వార్షిక ఉత్సవాలు శాస్త్రోక్తంగా నిర్వహించబడుతూ, భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో ఈ దివ్యక్షేత్రం మరింత ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకుంది.

# జే.వి.వి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు సన్మానం...



ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో గత నెల రోజుల నుంచి వేసవి లో విజ్ఞాన కార్యక్రమం లో భాగంగా చిల్లకూరు శేషమ్మ మున్సిపల్ హైస్కూల్ నందు జరుగుతున్న ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్స్, మ్యాథ్స్ ఈరోజుతో ముగియనున్న సందర్భముగా నెలరోజుల పాటు క్లాసులు చెప్పినటువంటి టీచర్లు నరేంద్రనాథ్ చౌదరి, సునీల్ రాజ్, శంకరయ్య ను ముఖ్య అతిథి డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు.డిప్యూటీ డిఇఓ సనత్ కుమార్ మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక వారు ఈ వేసవి సెలవులలో విద్యార్థులకు ఇంగ్లీష్ స్పీకింగ్ కోర్సు మ్యాథ్స్ క్లాసులు నిర్వహించటం చాలా అభినందనీయమని విద్యార్థుల భవిష్యత్ కొరకు తోడ్పాటు అందిస్తున్న జే.వి.వి సభ్యులందరినీ అభినందిస్తున్నానని ఇలాంటి క్లాసులు ప్రతి సంవత్సరం నిర్వహించాలని కోరారు. క్లాసులకు వచ్చే విద్యార్థిని, విద్యార్థులకు ప్రతిరోజు డ్రైఫ్రూట్స్, చిక్కీలు, అరటిపండు, బిస్కెట్స్‌తో పాటుగా నోట్ బుక్స్, పెన్ లు ఉచితంగా ఇవ్వడం ఎక్కడా జరగదని అది ఒక్క గూడూరు జనవిజ్ఞాన వేదిక వారు మాత్రమే చేసినందుకు వారిని అభినందిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, రామమోహన్, పురుషోత్తమరావు, ఆనంద్ ,సుబ్బారావు, సుబ్రహ్మణ్యం, పీ.వీ.కే శర్మ, మనోహర్ గౌడ్, ఉపాధ్యాయులు నరేంద్రనాథ్ చౌదరి, సునీల్ రాజ్, శంకరయ్య స్కూల్ ప్రధాన ఉపాధ్యాయుడు శ్రీనివాసులు గారు తదితరులు పాల్గొన్నారు.

# వరదయ్యపాలెం నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన శివరామ సుబ్బయ్య




ప్రజా భూమి ప్రతినిధి వరదయ్యపాలెం.

వరదయ్యపాలెం మండల నూతన తహసీల్దార్‌గా శివరామసుబ్బయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు పాకాల డిప్యూటేషన్ మీద తహసీల్దార్ గా పనిచేస్తున్న ఆయన, బదిలీపై వరదయ్యపాలెం మండలం వచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మార్వో సిబ్బంది, రెవెన్యూ అధికారులు నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం అధికారికంగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ, “ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించడమే నా ప్రధాన లక్ష్యం. రైతులు, భూ సమస్యలు ఉన్నవారు ఎలాంటి ఇబ్బంది లేకుండా నేరుగా కార్యాలయానికి వచ్చి కలవవచ్చు. ప్రతి దరఖాస్తును సకాలంలో పరిష్కరిస్తాం” అని హామీ ఇచ్చారు. అలాగే మండలంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఆక్రమణల సమస్యలు, స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్,వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత...

## - ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.లెనిన్ బాబు



ప్రజా భూమి ప్రతినిధి రేణిగుంట.

తిరుపతి కోర్టు సముదాయంలో ఉన్న ప్రత్యేక సబ్ జైల్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ముఖ్య అతిథిగా జడ్జిగారు పాల్గొనడం పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ ఒక చెట్టును నాటడం అలవాటుగా చేసుకోవాలని, దాని ద్వారా మనమంతాఆరోగ్యంగా ఉంటామని అన్నారు. పర్యావరణం బాగుంటుందని, పర్యావరణం పరిశుభ్రంగా ఉంచుకోని, మంచి అలవాటుగా అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు చెట్లునాటడంతో పాటు, ఆ మొక్కలని ప్రతిరోజు నీరుపోసి పెద్దవి అయ్యేవిధంగా చూసుకోవాలని తెలియజేశారు. వాహనాల నుండి వచ్చే వాయువులను కూడా ఇది నివారిస్తుందని తెలియజేశారు. సబ్ జైల్లో మొక్కలను నాటి, ఖైదీలను, వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకొని. సబ్ జైలును సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూపరిడెంట్ , కోర్టు సిబ్బందిపాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల వాడకం మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



ప్రజా భూమి ప్రతినిధి సత్యవేడు.

మాదకద్రవ్యాల వాడకం వల్ల మానసిక ఆరోగ్యం, శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తిరుపతి జిల్లా సత్యవేడు ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి స్పష్టం చేశారు.శుక్రవారం పేరడం అంగన్వాడీ కేంద్రం లో కిషోర్ వికాసంపై బాలబాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ జ్యోతి మాట్లాడుతూ మద్యం సేవించడం మొదట్లో సరదాగా మొదలైన తదుపరి అది వ్యసనంగా మారుతుంది అన్నారు.దీర్ఘకాలికంగా మద్యాన్ని తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతినడం,గుండె సమస్యలు,క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉందన్నారు. పైగా ఇది మెదడు పనితీరును మందగించి, ఆలోచనా శక్తిని తగ్గిస్తుందన్నారు. గంజాయి,కొకైన్,హెరాయిన్ వంటి మాదకద్రవ్యాల వినియోగం వల్ల మెదడులోని నరాలను దెబ్బతీస్తాయని ఆమె వివరించారు.మద్యం మానడానికి డిసల్ఫిరామ్ వంటి ట్యాబ్లెట్లు అందుబాటులో ఉన్నట్టు ఆమె గుర్తు చేశారు.అందువల్ల మద్యపానం సేవించడం,డ్రగ్స్కు వినియోగానికి దూరంగా ఉండాలని ఆమె కోరారు. అనంతరం దీనిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దీప,ఎంఎల్ హెచ్పి మహాలక్ష్మి,అంగన్వాడీ కార్యకర్తలు హాజీరా,కస్తూరి, ఆశా వర్కర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును వ్యతిరేకించండి

## నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి



ప్రజా భూమి ప్రతినిధి తిరుపతి.

కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుకు వ్యతిరేకంగా శుక్రవారం స్విమ్స్ ఆస్పత్రి వద్ద సిఐటియు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమం ఉద్దేశించి సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు మాట్లాడుతూ ఇరాన్ యుద్ధ ప్రభావం కారణంగా పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు పెంచామని కేంద్ర ప్రభుత్వం చెప్పడాన్ని ఒక మోసపూరిత చర్య అని పేర్కొన్నారు. ఇరాన్ యుద్ధం ప్రారంభం కాకముందు కూడా ఎన్డీఏ పాలనలో దాదాపు 12సార్లు పెట్రోల్ డీజిల్ ధరలు పెంచి ప్రజల నడ్డి విరిచారని విమర్శించారు. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం నాలుగు సార్లు పెట్రోలు, డీజిల్ , గ్యాస్ ధరలు పెంచి ప్రజలపై తీవ్రమైన భారాలు వేయడాన్ని తప్పు పట్టారు. ఇప్పటికే పెరిగినటువంటి ధరలతో ప్రజలు అల్లాడిపోతున్నారని, ప్రజల కొనుగోలు శక్తి రోజు రోజుకు దిగజారి పోతుందని, ఇటువంటి పరిస్థితులలో ప్రజలు బతకడమే కష్టంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ల ప్రయోజనాల కోసం ధరలు పెంచుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కూటమి నేతలు కూడా ధరల పెరుగుదలపై నోరు మెదపడం లేదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. కాంట్రాక్ట్ కార్మికులకు గత 12 సంవత్సరాల నుండి జీతాలు పెంచకపోవడం వల్ల కుటుంబాలు జీవనం సాగించడం కష్టతరమవుతుందన్నారు. కాంట్రాక్ట్ కార్మికులందరికీ వేతనాలు పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెంచిన పెట్రోలు, డీజిల్ ,గ్యాస్ ధరలు తగ్గించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు . ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు టి సుబ్రమణ్యం, ఎస్.జయచంద్ర, పి మునిరాజా, కే వేణుగోపాల్, పి బుజ్జి, వాసు, పార్థసారథి రెడ్డి, రవి, ఆటో డ్రైవర్లు, తోపుడు బండ్ల వ్యాపారస్తులు పాల్గొన్నారు.

# బిసి గురుకుల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు చేపట్టిన తిరుపతయ్య.




ప్రజా భూమి ప్రతినిధి దొరవారిసత్రం.

దొరవారి సత్రం మండల కేంద్రంలో ఉన్న జ్యోతిరావ్ పూలే బిసి బాలుర గురుకులం ప్రిన్సిపాల్ గా తిరుపతయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఇదే గురుకులంలో లెక్చరర్ గా అనేక ఏళ్ళు పనిచేసి, ఇన్చార్జి ప్రిన్సిపాల్ గా కొంతకాలం కొనసాగారు. ప్రభుత్వం గత ఏడాది రెగ్యులర్ ప్రిన్సిపాల్ గా పదోన్నతి కల్పించి అనంతపురం జిల్లా మడకశిర గురుకులానికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపాల్ పదవి విరమణ పొందడం, 2025-26 విద్యా వార్షిక సంవత్సరం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అనేకమంది విద్యార్థులు ఫెయిల్ కావడంతో ఆ పొరపాట్లను సరి చేసి మళ్ళీ పూర్వం సాధించిన 100 శాతం ఫలితాల కొరకు తిరుపతయ్యను రెగ్యులర్ ప్రిన్సిపాల్ గా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో శుక్రవారం ఆయన తన బాధ్యతలను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నాపై నమ్మిక ఉంచి పెట్టిన బాధ్యతను చిత్తశుద్ధితో నెరవేరుస్తూ, విద్యార్థులు మంచి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అహర్నిశలు కృషి చేస్తానని, వెల్లడించారు. ప్రిన్సిపాల్ తిరుపతయ్యకు సిబ్బంది సాదర స్వాగతం పలికారు.

# ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘము గూడూరు తాలూకా ఎన్నిక ఏకగ్రీవం





ప్రజా భూమి ప్రతినిధి, గూడూరు,

ఆంధ్రప్రదేశ్ ప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘము గూడూరు తాలూకా ఎన్నికలు, ఎన్నికల అధికారి వెంకటేశ్వరా రావు ఆధ్వర్యంలో శుక్రవారం చెన్నూరు నందు నిర్వహించారు. ఈ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగినట్లు ప్రటించారు. అధ్యక్షులుగా కె. శేఖర్ రావు, ప్రధాన కార్యదర్శిగా జి. శంకరయ్య, సహా అధ్యక్షులుగా పవన్, సంయుక్త కార్యదర్శి డి. వెంకటేశ్వరరావు మరియు 15 మందితో మొత్తం కలిపి 19 మందితో గూడూరు తాలూకా ఏపీ జి ఈ ఏ ఎక్రీవంగా ఎన్నికయారు. ఈ ఎనికైనా కమిటీ సభ్యులు 3 సంవత్సరాలు పాటు చెల్లమనిలో ఉంటారని ఎన్నికల అధికారి ప్రకటిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథి గా ఏపీ జి ఈ ఏ జిల్లా అధ్యక్షులు పాల్గోని, ఈ సంఘము ఉద్యోగుల సమస్యల పై నీకార్సుగా నిజాయితీగా పని చేస్తుందని,గెలిసిన సభ్యులకు శుభాకాంక్షలు అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రకృతి వనరులను కాపాడదాం

## కృష్ణా వర్సిటీ వీసీ ఆచార్య కె. రాంజీ

### ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్లాస్టిక్ రహిత క్యాంపస్‌గా మార్చేందుకు పిలుపు సిబ్బందితో కలిసి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించిన ఉపకులపతి

మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

ప్రకృతి ప్రసాదించిన వనరులను కాపాడుకోవడాన్ని ప్రతి ఒక్కరూ ఒక బాధ్యతగా స్వీకరించాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి (వీసీ) ఆచార్య కె. రాంజీ పిలుపునిచ్చారు. శుక్రవారం వర్సిటీలో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసం గిం చారు.ఈ సందర్భంగా వీసీ రాంజీ మాట్లాడుతూ.. నీరు, భూమి, వాయువు కాలుష్యమవ్వడం వల్ల సమాజం ప్రస్తుతం భారీ మూల్యాన్ని చెల్లించుకుంటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్లాస్టిక్ రహిత సమాజం ప్లాస్టిక్ వాడకాన్ని వీలైనంతగా తగ్గించడం ద్వారానే కాలుష్య భూతాన్ని సమర్థవంతంగా నివారించవచ్చని పిలుపునిచ్చారు.నీటి పొదుపు తప్పనిసరి: వాతావరణ మార్పుల వల్ల తీవ్ర నీటి కొరత ఏర్పడుతోందని, నీరు పుష్కలంగా ఉన్న ప్రాంతాల వారికి ఆ కష్టాలు తెలియవని.. అందుకే ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడాలని సూచించారు.మొక్కల పెంపకమే పరిష్కారం: పర్యావరణ సమస్యలన్నింటికీ చెట్లను పెద్ద ఎత్తున పెంచడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు.మన దేశంలో వృక్షాల సంఖ్య ఆందోళనకరం:విశ్వవిద్యాలయ క్రీడల విభాగం కార్యదర్శి డా. నవీన లావణ్యాలత మాట్లాడుతూ, ఐరోపా దేశాల్లో సరాసరిన ఒక వ్యక్తికి 6,000 వృక్షాలు ఉంటే.. మన దేశంలో ఆ సంఖ్య కేవలం 29 మాత్రమే ఉండటం ఆందోళనకరమని గణాంకాలతో వివరిం చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల్లో ప్రజలంతా భాగస్వాములు కావాలన్నారు.మొక్కలు పెంచడం ద్వారా క్యాంపస్‌కు అందం, ఆకర్షణతో పాటు పరిశుభ్రమైన గాలి లభిస్తుందని, తద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడపవచ్చని ఐఎస్ఓ లీడ్ ఆడిటర్ చక్రవర్తి కొనియాడారు. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో పచ్చదనం కోసం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.శ్రమదానంలో పాల్గొన్న వీసీ:సరికొత్త స్ఫూర్తిని నింపుతూ.. అనంతరం వర్సిటీ పరిపాలనా భవనం వెనుక భాగంలో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించే శ్రమదాన కార్యక్రమంలో వీసీ ఆచార్య కె. రాంజీ స్వయంగా పాల్గొన్నారు.



బోధన, బోధనేతర సిబ్బందితో కలిసి ఆయన క్యాంపస్ క్లీనింగ్ చేపట్టారు.ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు డా. పి. వీరబ్రహ్మాచారి, డా. కిరణ్ కుమార్, డిప్యూటీ రిజిస్ట్రార్ మార్కండేయులు మరియు వర్సిటీ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# వైసీపీకి 90 స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కవు



### ప్రజా దర్బార్‌లో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర సంచలన వ్యాఖ్యలు అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దుతాం

### పేర్ని నాని వ్యాఖ్యలపై మంత్రి తీవ్ర ఆగ్రహం

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాబోయే ఏ ఎన్నికల్లో అయినా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 90 శాతం స్థానాల్లో డిపాజిట్లు కూడా దక్కవని రాష్ట్ర భూగర్భ గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తీవ్ర వ్యాఖ్యలు చేశారు. వైసీపీ ప్రజల్లో పూర్తిగా విశ్వాసం కోల్పోయిందని ఆయన ఎద్దేవా చేశారు.మచిలీపట్నంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడారు.అమరావతి.. ప్రపంచ స్థాయి రాజధానిగత ప్రభుత్వం రాజధాని వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. కానీ మన కూటమి ప్రభుత్వం అమరావతిని ప్రపంచ స్థాయి రాజధానిగా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తోంది. ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే పర్యాటకులు తప్పక సందర్శించే విధంగా అద్భుతమైన నిర్మాణాలతో రాజధానిని రూపుదిద్దుతాం. కొల్లు రవీంద్ర, రాష్ట్ర మంత్రిపేర్ని నానికి గట్టి కౌంటర్..మాజీ మంత్రి పేర్ని నానిపై మంత్రి కొల్లు రవీంద్ర ఈ సందర్భంగా తీవ్ర విమర్శలు గుప్పించారు. గుడివాడ, గన్నవరం ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లు లేవని వ్యాఖ్యానించే ముందు, అసలు నెక్స్ట్ టైం తనకే టిక్కెట్ ఉందో లేదో పేర్ని నాని చూసుకోవాలి అని హితవు పలికారు.గత ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీకి భారీ మద్దతు ఇచ్చారని, తాము 50 వేలకుపైగా మెజార్టీతో చారిత్రాత్మక విజయం సాధించామని మంత్రి గుర్తు చేశారు.రాబోయే ఎన్నికల్లో కూటమి మరింత భారీ మెజార్టీతో విజయకేతనం ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్..వైసీపీకి రాబోయే రోజుల్లో 90 స్థానాల్లో డిపాజిట్లు కూడా రావంటూ మంత్రి కొల్లు రవీంద్ర చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అటు కృష్ణా జిల్లాలోనే కాకుండా రాష్ట్ర రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.ఈ ప్రజా దర్బార్ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు వెంకటేశ్వర్లు,జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి గోపు సత్యనారాయణ, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచే నాని, మాజీ మున్సిపల్ చైర్మన్ బాబా వెంకటప్రసాద్, కోస్తా మురళీకృష్ణ మరియు పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పెడనలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ సైకిల్ ర్యాలీ

ప్రజాభూమి పెడన



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యా వర ణ పరిరక్షణపై ప్రజల్లో అవగా హన కల్పించేందుకు తోట ముల తెలుగుదేశం పార్టీ కార్యా ల యం నుండి పెడన పట్టణ మున్సిపల్ కార్యాలయం వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించిన పెడన శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పెడన పట్టణం బంగ్లా స్కూల్ వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గున్నారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ స్వచ్ఛ హరిత పెడనగా మారుద్దాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.. భవిష్యత్ తరాలకు వెలుగునిద్దాం. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి వ్యక్తి మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు.ర్యాలీలో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, యువత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకే పాలన మీకోసం వేదికతో సత్వర పరిష్కారం

### పెడన నియోజకవర్గంలో మూడో వారం ప్రత్యేక పిజిఆర్ఎస్ (PGRS) నిర్వహణ శాసన స భ్యులు కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి అర్జీలు స్వీకరించిన కలెక్టర్ డీకే బాలాజీ



ప్రజాభూమి బ్యూరో కృష్ణాజిల్లా

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు పాలనను మరింత చేరువ చేయాలనే సంకల్పంతో నియోజకవర్గాల వారీ గా ప్రత్యేక పిజిఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక) కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేప ట్టిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం పెడన మునిసిపల్ కార్యాల యంలో స్థానిక శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్‌తో కలిసి ఆయన 'మీకోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి స్వయంగా అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా పంచాయతీల పరిధిలోనే పరిష్కారమవ్వాల్సిన చిన్నచిన్న సమస్యలను కూడా పెండింగ్‌లో పెట్టడంపై కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కృత్తివెన్ను ఎంపీడీవో నూతలపాటి శ్రీనివాసరావును పిలిచి, సమస్యలు పరిష్కరించకుండా పంచాయతీ కార్యదర్శులు ఏం చేస్తున్నారు? అని నిలదీశారు.సమస్యల ఆన్‌లైన్ నమోదు.. సత్వర పరిష్కారం: కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ప్రతి శుక్రవారం నియోజకవర్గాల్లో ప్రత్యేక 'మీకోసం' నిర్వహిస్తున్నాం. వరుసగా నాలుగు వారాల పాటు ఒకే నియోజకవర్గంలో ఈ కార్యక్రమం ఉం టుంది. పెడనలో ఇది మూడో వారం. జిల్లా కేంద్రానికి రాలేని వారికి ఇది ఒక మంచి అవకాశం. ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసి, పరిష్కారమయ్యే ప్రతి సమస్యకూ సత్వర చర్యలు తీసు కుంటాం.అధికార యంత్రాంగమంతా ప్రజల వద్దకే రావడం శుభపరిణామం: ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నియోజకవర్గంలో ప్రతి శుక్రవారం ప్రజాదర్బార్ జరుపుతున్నాం. ప్రజల సమస్యల కోసం కలెక్టర్‌తో సహా జిల్లా స్థాయి అధికారులంతా ఇక్కడికే రావడం శుభపరిణామం. నియోజకవర్గ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.హాజరైన అధికారులు:ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఆర్డీఓ సాంబశివరావు, డీఎస్పీ శ్రీనివాసరావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ ఆనంద్ కుమార్, ఆర్టీసీ పర్యవేక్షకులు గోపాల్, విద్యుత్ శాఖ ఈఈ గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ కొండయ్య, పెడన తహసీల్దారు వహీదా, ఎంపీడీవో అరుణ, గూడూరు తహసిల్దార్ దేవాదాయ శాఖ ఈవో అరుణ తదితర అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



- డా. టి. నాంచారయ్య (బి.ఇ., ఎం.టెక్., పీహెచ్.డి.)పాలిటెక్నిక్ ప్రోగ్రామ్, 26 సంవత్సరాలు ఎక్స్పీరియన్స్ వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాల, మచిలీపట్నం.

## సాంకేతిక విద్యలో కొత్త అధ్యాయం ..

# వైజేఆర్ డీఎంఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ ప్రారంభం

### మొదటి సంవత్సరంలోనే సివిల్, ఎలక్ట్రికల్, ఈసీఈ, కంప్యూటర్, మెకానికల్ విభాగాల్లో భారీగా చేరిన విద్యార్థులు

మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో రోజురోజుకూ సాంకేతిక విద్యకు ప్రాధాన్యత పెరుగుతోంది. పదో తరగతి పూర్తయిన వెంటనే తక్కువ కాలం లోనే మంచి ఉపాధి అవకాశాలను అందుకోవడానికి, అలాగే ఉన్నత సాంకేతిక విద్యకు బలమైన పునాది ఏర్పరచుకోవడానికి పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఈ నేపథ్యంలో మచిలీపట్నంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ యలమంచిలి జనార్ధనరావు - దైతా మధుసూదన శాస్త్రి ఇంజినీరింగ్ కళాశాల (YJR DMS College of Engineering) 2025-26 విద్యా సంవత్సరం నుండి పాలిటెక్నిక్ డిప్లొమా కార్యక్రమాన్ని ప్రారంభించి సాంకేతిక విద్యాభివృద్ధిలో మరో ముందడుగు వేసింది. ప్రారంభ సంవత్సరం లోనే సివిల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగా లలో ఆశించిన స్థాయిలో విద్యార్థులు ప్రవేశాలు పొందారు.పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా ప్రాయోగిక శిక్షణ:ఇక్కడి పాలిటెక్నిక్ విద్య కేవలం తరగతి గదులకే పరిమితం కాకుండా, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యా ర్థులలో ప్రాయోగిక నైపుణ్యాలను పెంపొందించే విధంగా రూపొందించబడింది. ఇందుకోసం కళాశాలలో అత్యాధునిక ప్రయోగశాలలు, కంప్యూటర్ సెంటర్లు, వర్క్‌షాప్లు, స్మార్ట్ క్లాస్ రూమ్లు మరియు అనుభవజ్ఞులైన అధ్యాపక బృందాన్ని ఏర్పాటు చేశారు.డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు భవిష్యత్తులో పరిశ్రమలు, తయారీ రంగం, నిర్మాణ రంగం, ఐటీ మరియు సేవా రంగాలలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అంతేకాకుండా, డిప్లొమా అనంతరం లేటరల్ ఎంట్రీ ద్వారా నేరుగా బి.టెక్ రెండవ సంవత్సరంలో ప్రవేశం పొందే అవకాశాన్ని కూడా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు. ఈ దృష్ట్యా విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు మరియు ఉద్యోగ నైపుణ్యాలపై ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు.తల్లిదండ్రులు, విద్యార్థుల నుండి విశేష స్పందన: పాలిటెక్నిక్ విభాగం ప్రారంభమైన తొలి సంవత్సరంలోనే విద్యార్థులు, తల్లిదండ్రుల నుండి విశేష స్పందన లభించింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని డిప్లొమా విద్యలో ప్రవేశం పొందుతున్నారు. సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే కళాశాల లక్ష్యం ఈ స్పందనతో మరింత బలపడింది.విద్యార్థులు పాఠశాల విద్య నుంచి డిప్లొమా విద్యలోకి సులభంగా మారేందుకు ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు ఇక్కడ 'బ్రిడ్జ్ కోర్సులు' నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా గణితం, సైన్స్, ఇంగ్లీష్, ప్రాథమిక ఇంజినీరింగ్ అంశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించి ఉన్నత విద్యా ప్రయాణానికి సిద్ధం చేస్తున్నారు.సమగ్రాభివృద్ధికి పెద్దపీట:విద్యా ప్రమాణాలతో పాటు




విద్యార్థుల సమగ్రాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ నిరంతరం సెమినార్లు, వర్క్‌షాప్లు, నిపుణుల ఉపన్యాసాలు, పారిశ్రామిక సందర్శనలు, సాంకేతిక పోటీలు మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిణామాలను తెలుసుకుని పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకునే అవకాశం పొందుతున్నారు.కళాశాల ప్రెసిడెంట్ పి.వి. రావు నేతృత్వంలో యాజమాన్య ప్రతినిధి వీరమాచినేని కిరణ్ పాలిటెక్నిక్ విభాగాన్ని రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన సాంకేతిక విద్యా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. నాణ్యమైన విద్య, ఆధునిక మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అనుసంధానం మరియు విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ సాంకేతిక నిపుణులను తయారు చేయడమే తమ ప్రధాన లక్ష్యమని వారు పేర్కొన్నారు.సాంకేతిక విద్య ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించి, స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను విస్తరించాలనే దృక్పథంతో ప్రారంభమైన వైజేఆర్ డీఎంఎస్ కళాశాల పాలిటెక్నిక్ కార్యక్రమం ఇప్పటికే విద్యార్థుల విశ్వాసాన్ని సంపాదించుకుని విజయవంతమైన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది.

# కానూరులో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

### మొక్కలు నాటి, పరిసరాలను శుభ్రం చేసిన గోపు సత్యనారాయణ

మచిలీపట్నం/రూరల్ ప్రజాభూమి ప్రతినిధి

మచిలీపట్నం నార్త్ మండలం కానూరు పంచాయతీ పరిధిలోని పెద్ద కానూరు గ్రామంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.తెలుగుదేశం పార్టీ పిలుపు మేరకు ఆయన తన నివాసం నుం డి స్వర్ణ గ్రామ కార్యాలయానికి కాలినడకన వ చ్చి ఈ పర్యావరణ ఉద్యమంలో స్వయంగా పాల్గొన్నారు.పరిశుభ్రత - మొక్కల పెంపకం గోపు సత్యనారాయణ, కానూరు పరిసరాలను పరిశుభ్రం చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ ర్యా లీ చెట్లను నాటుదాం - కాలుష్యాన్ని నిర్మూ లి ద్దాం' అనే నినాదంతో గ్రామంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ సంకల్పం: ప్రభుత్వం చేపట్టిన ఇటువంటి పర్యావరణహిత కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సత్యనారాయణ స్పష్టం చేశారు. గోపు సత్యనారాయణ పిలుపుప్రతి ఒక్క రూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు లేదా ఏదైనా శుభకార్యాన్ని ప్రారంభించే సమయంలో ఒక మొక్కను నాటడాన్ని అలవాటు చేసుకోవాలి. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలి. వాహనాల వినియోగాన్ని అవసరమైన మేరకే పరిమితం చేస్తూ, వాటి ద్వారా వచ్చే కాలుష్య కారకాలను అదుపు చేయాలి.ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ వరప్రసాద్, క్రై ఆర్గనైజేషన్ కన్సల్టెంట్ సుధారాణి, ఎఫ్రాయం, పీత రాము, గోపు వెంకటరమణ, గణపబత్తుల యేసురాజు, బొట్ల రాజేష్, విజయ్ లతో పాటు విలేజ్ హెల్త్ క్లినిక్ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది, బుక్ కీపర్స్ మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# చౌడు భూముల్లోనూ వరి సిరులు

### రైతులకు అండగా 'ఏఎన్‌జీఆర్ఏయూ' ప్రత్యేక వంగడాలు మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాస్థానం అద్భుత ఆవిష్కరణ; మార్కెట్ యార్డ్ చైర్మన్ చేతుల మీదుగా రైతులకు విత్తనాల పంపిణీ



మచిలీపట్నం/ప్రజాభూమి ప్రతినిధి

రాష్ట్రంలో మారుతున్న వాతావరణ పరిస్థితులు, చేపల చెరువుల విస్తరణ కారణంగా తీర ప్రాంతాల్లో చౌడు భూముల సమస్య గణనీయంగా పెరుగుతోంది. ఈ సవాలును అధిగమించి, చౌడు భూముల్లోనూ రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం (ANGRAU) పరిధిలోని మచిలీపట్నం వ్యవసాయ పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు సరికొత్త వరి వంగడాలను అభివృద్ధి చేశారు.ఇటీవల పరిశోధనాస్థానం ఆవరణలో నిర్వహించిన రైతు అవగాహన కార్యక్ర మంలో ఈ ప్రత్యేక రకాల విశిష్టతలను వివరించారు. ఈ సందర్భంగా నూతనంగా రూపకల్పన చేసిన 'ఎంసీఎం-140' రకాన్ని ప్రదర్శించి, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచెనాని చేతుల మీదుగా ఎంపిక చేసిన రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు.చౌడును తట్టుకునే ప్రత్యేక వరి రకాలు - దిగుబడి వివరాలు: పరిశోధనాస్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త (ప్లాంట్ బ్రీడింగ్) డాక్టర్ కె. నాగేంద్రరావు తెలిపిన వివరాల ప్రకారం... చౌడు పరిస్థితులను తట్టుకుని మెరుగైన దిగుబడులు ఇచ్చే రకాలు ఇవే:పాండురంగా (ఎంసీఎం-100): 2018లో విడుదలైన ఈ రకం చౌడును సమర్థవంతంగా తట్టుకుని హెక్టారుకు సుమారు 6 టన్నుల దిగుబడిని ఇస్తుంది.ఎంసీఎం-103: 2022లో విడుదలైన ఈ రకం మిక్కిలి సన్నగింజ నాణ్యతతో పాటు హెక్టారుకు 6.5 టన్నుల వరకు దిగుబడి అందిస్తుంది.ఎంసీఎం-109: విడుదలకు సిద్ధంగా ఉన్న ఈ రకం సార్వా, దాళ్వా రెండు సీజన్లకూ ఎంతో అనుకూలం. ఎంసీఎం-125: 2026లో విడుదలైన ఈ రకం చౌడు భూముల్లోనూ అత్యంత ప్రతిభావంతంగా పనిచేస్తూ మంచి దిగుబడి ఇస్తోంది.ఎంసీఎం-140 (నూతన రకం): 140 రోజుల కాలపరిమితి గల ఈ రకం చౌడును తట్టుకోవడమే కాకుండా.. ధాన్యపు నాణ్యత, గింజ ఆకారం, దిగుబడి సామర్థ్యంలో రైతులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది.శాస్త్రవేత్తల కీలక సూచనలు: చౌడు భూముల యాజమాన్యం ఇలా...నాట్లు వేయడమే మేలు: చౌడు భూముల్లో వెదజల్లే పద్ధతి కంటే నారు నాటడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయి.నీటి యాజమాన్యం: భూమిని దమ్ము చేసిన తర్వాత మంచినీటిని పలుమార్లు నిల్వ చేసి బయటకు వదలడం వల్ల చౌడు తీవ్రత తగ్గుతుంది.అదనపు ఎరువులు: సిఫారసు చేసిన మోతాదు కంటే 25 శాతం అదనపు ఎరువులను (ముఖ్యంగా పొటాష్) వాడాలి.పోషకాల లోపం: చౌడు భూముల్లో జింక్ లోపం వచ్చే అవకాశం ఎక్కువ కాబట్టి జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలి.సేంద్రియ పద్ధతులు: వేసవిలో పచ్చిరొట్ట ఎరువులు, పశువుల ఎరువు, చెరకు ప్రెస్‌మడ్, వరిగడ్డి వంటి సేంద్రియ పదార్థాలను భూమిలో కలియదున్నాలి.ఘనంగా విత్తనాల పంపిణీఈ అవగాహన కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచెనాని చేతుల మీదుగా రైతులకు నూతన వరి విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ నాగభూషణం, ఏవో మండల్ ఆఫీసర్ రామ్ కుమార్, ఏఎంసి భాస్కర్ రావు, పలువురు వ్యవసాయ శాఖ అధికారులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన యాజమాన్య పద్ధతులు పాటిస్తే చౌడు భూముల్లోనూ సాధారణ భూములతో సమానంగా దిగుబడులు సాధించవచ్చని అధికారులు భరోసా .


Printed by MK PUBLICATIONS AND OFFSET PRINTERS Published by ANKIREDDYPALLE RAMAMOHAN REDDY on behalf of ANKIREDDYPALLE RAMAMOHAN REDDY , printed at visakhapatnam and published at D. No.k31-27-31/3,oppsite pavanpublic school,duvvada station road,kurmnnapalem, visakhapatnam, editor ANKIREDDYPALLE RAMAMOHAN REDDY .
RNI NO:APTEL/25/A1888.cell:9502116677.

## పచ్చదనమే భావితరాల భద్రత



ప్రజాభూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గాడ్సన్ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి, సుందరయ్యనగర్, పోతవరప్పాడు గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ కోలేటి పాల రమేష్ మాట్లాడుతూ మొక్కలు నాటడం, వాటిని పెంచడం, సంరక్షించడం ప్రకృతికి చేసే గొప్ప సేవ అని అన్నారు. నీటి వనరులను పరిరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడవచ్చని, తద్వారా భావితరాలకు మెరుగైన జీవనాధారాన్ని అందించగలమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

## మన డబ్బులు - మన లెక్కలు అవగాహన ర్యాలీ.




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం.

ద్వాక్రా సంఘాల మహిళలకు సులభమైన ఆర్థిక లావాదేవీల కోసం మన డబ్బులు - మన లెక్కలు పేరుతోతయారైన యాప్ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మండల సమాఖ్య ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం చేపట్టిన ర్యాలీలో ఏపీఎం పద్మావతి మాట్లాడుతూ మన డబ్బులు మన లెక్కలు యాప్ వలన ఇప్పటివరకు సంఘంలో ఆర్థిక లావాదేవీలపై కొరవడిన అవగాహనను ద్వాక్రా సంఘాల సభ్యులకు కల్పించడం జరుగుతుందని అన్నారు. ప్రతి 10 సంఘాలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసిన ఇ - నారి ద్వారా ప్రతి సంఘానికి వారి యొక్క ఆర్థిక అంశాలను వాయిస్ మెసేజ్ ద్వారా వివరించడం జరుగుతుందని పేర్కొన్నారు. రాబోయే ఆరు నెలల కాలంలో మండలంలోని అన్ని ద్వాక్రా సంఘాలకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా మన డబ్బులు మన లెక్కలు 50 పూర్తి అవగాహన కల్పించబడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి చంద్రమోహన్, జనసేన మండల కన్వీనర్ మెట్ట బుచ్చిరాజు, ఎంపీడీవో, ఏపీ డి, వివో ఏలు, వెలుగు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి బాల్య వ్యాధుల గుర్తింపు, ఆరోగ్య పరిరక్షణపై శిక్షణ

ప్రజా భూమి ప్రతినిధి-ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె. జ్ఞాన సందీప్ మాట్లాడుతూ చిన్నారుల్లో బాల్యదశలో వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించడం, పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ, ఆరోగ్య అవగాహన కల్పించడం, పోలియో నిర్మూలన కార్యక్రమం, గర్భిణీలకు ప్రసవపూర్వ సంరక్షణ అందించడం వంటి అంశాలపై వివరించారు. చిన్నారులు, గర్భిణీల ఆరోగ్య రక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు కె. హరిశంకర్, గుర్రం రాగమయి, బహుళ ప్రయోజన ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతాంగ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందజేత




ప్రజా భూమి ప్రతినిధి-వేలేరుపాడు

రైతాంగ సమస్యలను పరిష్కరించడంతోపాటు సకాలంలో విత్తనాలు అందజేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం శుక్రవారం వేలేరుపాడు తాసిల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేసింది. అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా, రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ, జూన్ 5న వేలేరుపాడు మండల డిప్యూటీ తహసిల్దార్ కి వేలేరుపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్కే గౌస్ మాట్లాడుతూ, 2026 వ్యవసాయ సీజన్ ప్రారంభంలో రాష్ట్రంలో ఎల్ ని నో ప్రభావంతో ఏ ఏ ప్రాంతాలలో సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షాలు కురుస్తాయో వాతావరణ శాఖ ప్రకటించింది. వ్యవసాయానికి మూలం విత్తనం. విత్తనం లేనిదే వ్యవసాయం లేదు. వ్యవసాయ ఆధారిత ఆయా ప్రాంతాల కు రైతాంగానికి సరిపడినన్ని పూర్తి సబ్సిడీపై ఏ ఏ విత్తనాలు అవసరాన్ని బట్టి ఇవ్వాలి. రాష్ట్రంలో7.46 లక్షల క్వింటాళ్ల వరి అవసరం కాగా, కేవలం 1.62 లక్షల క్వింటాళ్లు సబ్సిడీపై సరఫరా చేస్తుంది. హైబ్రిడ్ జొన్న, మొక్కజొన్న 75 % చిరుధాన్యాలు 50% పప్పు ధాన్యాలు 30% సెనగ 25 % వేరుశెనగ, నువ్వులు 40 % మినుము, కందులు, సబ్సిడీపై అందించాల్సి ఉండగా పూర్తిస్థాయిలో అందడం లేదు. ఏజెన్సీ ప్రాంతాలలో 90 % సబ్సిడీపై ఇవ్వాలని నిబంధనలు ఉన్నప్పటికీ వేలేరుపాడు, కుకునూరు మండలాలలో పోలవరం ముంపు పేరుతో రైతులందరికీ సబ్సిడీపై ఇవ్వడానికి అనేక కొర్రీలు పెడుతున్నారు. ముంపుతో సంబంధం లేకుండా అన్ని రకాల విత్తనాలు ఇవ్వాలని ఏ యు కె ఎస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర జిల్లా నాయకులు సిరికొండ రామారావు, గడ్డ ల ముత్యాలరావు, కట్టం వీరాస్వామి, కట్టం ముత్యాలరావు, పిఓడబ్ల్యు జిల్లా కార్యదర్శి ఎస్కె మున్ని, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క మొక్క- వెయ్యి ప్రాణాలకు ఆధారం

### మంత్రి కొలుసు పార్థసారథి



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాలు మంత్రి విజయవాడ క్యాంపు కార్యాలయం చుట్టూ ఉన్నఖాళీ స్థలాల్లో శుక్రవారం మంత్రి కొలుసు పార్థసారథి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ "ఒక్క మొక్క-వెయ్యి ప్రాణాలకు ఆధారం" అనే సందేశంతో హరితాంధ్ర సాధనకు అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రతి ఒక్కరూ కనీసం రెండు మొక్కలను నాటి, సంరక్షించి నట్టయితే పర్యావరణ పరిరక్షణకు తమనిబద్ధతను చాటాలని అన్నారు. ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొంటూ, పచ్చదనమే భావితరాలకు అమూల్యమైన సంపద అన్నారు. పర్యావరణ సమతుల్యత కోసం సమిష్టిగా కృషిచెయ్యాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా మోరు రామరాజు నియామకం



ప్రజాభూమి ప్రతినిధి-ఏలూరు

వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి,దెందులూరు మాజీ శాసనసభ్యులు అబ్బయ్య చౌదరి ఆదేశాల మేరకు,మోరు రామరాజుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, మోరు రామరాజుకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ సిద్ధాంతాలు,కార్యక్రమాలు ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్ర స్థాయిలో పార్టీ ప్రచార కార్యక్రమాలను మరింత బలోపేతం చేయడంతో పాటు,ప్రజలకు పార్టీ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాలను విస్తృతంగా చేరవేయడంలో మోరు రామరాజు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అలాగే పార్టీ శ్రేణులతో సమన్వయం చేసుకుంటూ సంస్థాగతంగా పార్టీని మరింత బలోపేతం చేయాలని సూచించారు. ఈ నియామకం పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ,మోరు రామరాజు కి అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శిగా ఆయన పార్టీ అభివృద్ధి మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

## ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ కార్యకర్తలు ముందుండాలి

### బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు పిలుపు



ప్రజాభూమి ప్రతినిధి-పాలకొల్లు

ప్రజల సమస్యల పరిష్కారానికి బీజేపీ కార్యకర్తలు ముందుండాలని పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట గంగరాజు పిలుపు ఇచ్చారు మోదీ పరిపాలన 12సంవత్సరాలు పూర్తి ఐన సందర్భంగా ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకు వెళ్లాలని అన్నారు. జనతా వారధిలో ప్రజా సమస్యలను చెప్పాలని అన్నారు. కలెక్టరేట్ లో ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు ప్రజా సమస్యలపై జనతా వారధి ద్వారా వినతి పత్రం అందచేస్తున్నట్లు తెలిపారు.

అనంతరం పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కను నాటారు. పట్టణ అధ్యక్షుడు కొల్లి కొండ ప్రసాద్ అధ్యక్షతన బ్రాడిపేటలో పట్టణ కార్యవర్గ సమావేశం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఉన్నమట్ల కబర్ది, జక్కంపూ డి కుమార్, మల్లవోలూ సురేష్,చెరుకూరి శ్రీనివాస్,బోడా కనకరాజు, పులఖండం కీర్తిచంద్,గవర పవన్ నాయుడు, పసుపులేటి నందబాబు,నాళం బాబీ,ఇస్సాకు నాగలక్ష్మి, అడ్డాల దాసు,బెల్లంకొండ నరసింహారావు, బైల శ్రీధర్,బొక్కా నరసింహమూర్తి,పలివెల భాస్కర్,చందాని లక్ష్మీనారాయణ,శ్యామల గౌరీ,యడ్ల జగన్నాథం,పాటపత్రి గోపాల కృష్ణంరాజు,కాయల కిషోర్,పోలిశెట్టి వెంకటేశ్వరరావు,ఇనుకొండ శేషాద్రి,బేతిరెడ్డి మల్లికార్జున రెడ్డి, చేగొండి బాబీ,పవన్,ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

### నూజివీడు 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో హాజరైన

# స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ పట్టాభిరామ్



ప్రజాభూమి ప్రతినిధి-నూజివీడు

నూజివీడుని స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతామని స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ చెప్పారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆయన నూజివీడు పట్టణంలో పర్యటించారు. మున్సిపాల్టీ పరిధిలో రూ. 2. 80 కోట్ల వ్యయంతో నిర్మించే ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ పనులను పర్యవేక్షించారు. డంపింగ్ యార్డ్ వద్ద ఇంకా మిగిలి ఉన్న చెత్తని త్వరగా తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రాసెసింగ్ ప్లాంట్ నిర్మాణానికి సంబంధించి కొన్ని సూచనలు చేశారు. పట్టణంలో మురుగునీటి కాలువలలో పూడిక తీత పనులలో ఆయన స్వయంగా పాల్గొన్నారు. చీపురు పట్టుకుని వీధులను శుభ్రం చేశారు. పారిశుధ్య కార్మికులతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చైర్మన్ పట్టాభిరామ్ మాట్లాడుతూ, మంత్రి పార్థసారధి ఈ మున్సిపాల్టీపై ప్రత్యేక దృష్టి పెట్టారని, ఆయన సారధ్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ దీనిని స్వచ్ఛ మున్సిపాల్టీగా తీర్చిదిద్దుతుందని చెప్పారు. 'ఆపరేషన్ క్లీన్ స్వీప్'లో భాగంగా రాష్ట్రంలోని మున్సిపాల్టీలలో ఈ వారం డ్రైనేజీలు క్లీన్ చేస్తున్నట్లు తెలిపారు. నూజివీడులో కూడా కాలువలలో పూడిక తీస్తున్నట్లు చెప్పారు. నూజివీడు మున్సిపాల్టీ పరిధిలో ప్రతి రోజు వచ్చే 35 టన్నుల చెత్తని ఏ రోజుకా రోజు ప్రాసెస్ చేయడానికి స్వచ్ఛ ఆంధ్ర కార్పోరేషన్ ఈ ప్లాంట్ ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో ఇక్కడ పేరుకుపోయిన 30 వేల టన్నుల చెత్తని క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు. చాలా వరకు పూర్తి అయిందని, మిగిలిన చెత్తని కూడా త్వరగా తొలగించమని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఈ ప్రాసెసింగ్ ప్లాంట్ ని త్వరగా పూర్తి చేసి, ఈ మున్సిపాల్టీ పరిధిలో డంపింగ్ అనేది లేకుండా చేయాలనుకుంటున్నట్లు చెప్పారు. డోర్ టు డోర్ వేస్ట్ సేకరణకు అతి త్వరలో ఎనిమిది ఎలక్ట్రిక్ వాహనాలను సమకూర్చనున్నట్లు తెలిపారు. ఈరోజు ప్రపంచ పర్యావరణ దినోత్సవం అని, పర్యావరణానికి హాని జరగకుండా ఉండాలంటే, వేస్ట్ ప్రాసెసింగ్ అనేది చాలా ముఖ్యం అని తెలిపారు. సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ ని బ్యాన్ చేశామని, దానిని అన్ని మున్సిపాల్టీలలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా బయో డిగ్రేడబుల్ ఉత్పత్తులను 'స్వయం' బ్రాండ్ పై పెద్దఎత్తున ప్రమోట్ చేయనున్నట్లు తెలిపారు. వేస్ట్ వాటర్ మేనేజ్ మెంట్ కోసం మూడు ఎస్టీపీ(మురుగునీటి శుద్ధి ప్లాంట్)లు మంజూరయ్యాయని, వాటి నిర్మాణం కూడా అతి త్వరలో ప్రారంభిస్తామన్నారు. వాటికి కావలసిన భూసేకరణ పనులను వేగవంతం చేసినట్లు తెలిపారు. మున్సిపల్ శాఖా మంత్రి నారాయణ, ఈ నియోజకవర్గానికి చెందిన మంత్రి పార్థసారధి, ఇతర అధికారులతో చర్చించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారానికి తాము కృషి చేస్తామని చెప్పారు. ఈ మున్సిపాల్టీ పరిధిలో పనిచేస్తున్న సిబ్బందికి, కమిషనర్ కు పట్టాభిరామ్ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొరపాటి పీరయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ అన్నే నాని, ఫ్లోర్ లీడర్ దుర్గా ప్రసాద్, మున్సిపల్ మాజీ చైర్మన్ పి.సత్యనారాయణ, టీడీపీ టౌన్ అధ్యక్షులు జగదీష్, క్లస్టర్ ఇన్‌చార్జి కె.విజయకుమార్,ఇళయరాజా, మానవత స్వచ్ఛంద సంస్థ, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వాసవీ క్లబ్ ల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కూటమి పాలన పట్ల ప్రజల్లో సానుకూలత

వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరిన పేరవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి.

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన జిల్లా తెదేపా అధ్యక్షుడు గుత్తుల సాయి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు.



ప్రజాభూమి ప్రతినిధి-కొత్తపేట

కూటమి పాలన పట్ల ప్రజల్లో సానుకూలత నెల కొందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. కూటమి పాలనలో రాష్ట్ర అభి వృద్ధి, సంక్షేమం జోడెడ్లలా పరుగులు తీస్తున్నాయని ప్రజలు అభిప్రాయపడుతున్నా రన్నారు. వైసీపీ నాయకుల సైతం కూటమి వైపు ఆకర్షితులవుతున్నారన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం పేరవరం వైసీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు దాసరి రామాంజనేయులు, వైసీపీ నాయకుడు అత్తిలి సుబ్బారావు, 40 మంది కార్యకర్తలతో జిల్లా పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి, ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో తెలుగు దేశం పార్టీలో చేరారు. వారికి పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. స్థానిక ఎన్నికల్లో కూటమి విజయానికి కృషి చేయా లని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆకుల రామ కృష్ణ,పల్లి మంగాదేవి భీమరావు,కంఠంశెట్టి శ్రీనివాస్, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, కుసంపూడి రామకృష్ణరాజు, పాలింగి రవిచంద్ర పాల్గొన్నారు.

## మృతురాళ్ల కుటుంబ సభ్యులను పరామర్శించిన టీడీపీ నాయకులు



ప్రజాభూమి ప్రతినిధి-విఆర్.పురం

మండలంలోని ములకనపల్లి పంచాయతీ కుంజవారిగూడెం గ్రామంలో మోసం ప్రభాకర్ తల్లి శుక్రవారం మృతి చెందారు, అలాగే మోసం ప్రభాకర్ పెద్దమ్మ గురువారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మండల టీడీపీ నాయకులు కుంజవారిగూడెం గ్రామానికి వెళ్లి, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇలాంటప్పుడే గుండె ధైర్యం చేసుకోవాలని ఓదార్చి మీ కుటుంబానికి ఎప్పుడూ తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలొ తెలుగుదేశం పార్టీ మండల నాయకులు బురక కన్నారావు, బురక సారయ్య, కారం శీరమయ్య, బోదేబోయిన సురేష్ రావు, సోడే జోగారావు, కూర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## 2 లక్షల ప్రధానమంత్రి భీమా పథకం చెక్కు పంపిణీ.

-తిప్పరాజుపాలెంలో నామిని వీరలక్ష్మి కి యూనియన్ బ్యాంక్ అధికారులు అందజేత.




ప్రజాభూమి ప్రతినిధి-కాజులూరు

కాజులూరు మండలం తిప్పారాజుపాలం గ్రామంలో ఇటీవల మృతి చెందిన దంగేటి దుర్గమ్మకు సంబంధించిన భీమా సొమ్ము రెండు లక్షల రూపాయల చెక్కును నామిని వీరలక్ష్మికి కాజులూరు యూనియన్ బ్యాంకు ద్వారా అందజేశారు. ప్రధాన మంత్రి భీమా పథకం ద్వారా అంద్రంగి గ్రామానికి చెందిన బిజినాస్ క్యాస్పాండెంట్ శేషరావు ద్వారా తిప్పరాజుపాలెం గ్రామానికి చెందిన దంగేటి దుర్గమ్మ ఇన్సూరెన్స్ చేయంచడంతో దుర్గమ్మ ఇటివల మృతి చెందగా నామిని వీరలక్ష్మి కి యూనియన్ బ్యాంక్ ద్వారా వచ్చిన 2 లక్షల రూపాయలు చెక్ ను కాజులూరు యూనియన్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ దున్న సురేష్, బిసి జ్యోతి కుమారి ,అనిమీటర్ కాశీ తరంగిని, తిప్పరాజుపాలెం గ్రామ మాజి సర్పంచ్ యాళ్ల మాణిక్యాంబ ఆంజనేయ వరప్రసాద్, బిసి శేషరావు, తదితరులుపాల్గొని చెక్కుని నామినికి అందజేశారు.

## అంగన్వాడి చిన్నారుల ఆరోగ్యంపై ఒకరోజు శిక్షణా కార్యక్రమం.




ప్రజాభూమి ప్రతినిధి-బుట్టాయగూడెం

అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారుల ఆరోగ్యం, తదితర అంశాలపై తగిన శ్రద్ధ వహించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిణి యు వి. పద్మావతి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం "నవచేతన యాప్ ద్వారా చిన్నారుల ఆరోగ్యం - సమగ్ర అభివృద్ధి" అంశంపై ఒకరోజు శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిడిపిఓ పద్మావతి మాట్లాడుతూ అంగన్వాడి చిన్నారుల ఆరోగ్య స్థితిని మరింత సమర్థవంతంగా అంచనా వేసేందుకు నవచేతన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత స్క్రీనింగ్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు చెప్పారు. ఒకరోజు శిక్షణా కార్యక్రమానికి రాష్ట్రీయ బాల స్వస్త్య ఫిజియోథెరపీ డాక్టర్ స్వప్న, సోషల్ వర్కర్ సురేంద్ర, సూపర్వైజర్స్, అంగన్వాడి కార్యకర్తలు హాజరయ్యారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణలో సున్నా నుంచి ఆరు సంవత్సరాల వయసు పిల్లల్లో ఎదుగుదల లోపాలు, అభివృద్ధి మైలురాళ్లు, పోషకాహార స్థితి, ఇతర ఆరోగ్య సంబంధిత సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించుట ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని తెలిపారు. ఈ కార్యక్రమానికి సూపర్వైజర్ ఝాన్సీ, వెంకటలక్ష్మి, ఉష, సత్యవతి, అంగన్వాడి కార్యకర్తలు, ఆర్బిఎస్కే సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాభూమి



# ప్రకృతి బాగుంటేనే.. మానవ మానగడ సాధ్యం

ప్రజా భూమి ప్రతినిధి–కుక్కునూరు

ప్రకృతిని కాపాడుకుంటేనే మానవాళికి మనుగడు ఉంటుందని ప్రకృతి నాశనం చేసే పనులకు మనసులు స్వస్తిపలకాలని ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర కమిటీ సభ్యులు కూరం సంజీవరావు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఏలూరు జిల్లా, కుక్కునూరు మండలం రెడ్డిగూడెం గ్రామంలో ఆదివాసి సంక్షేమ పరిషత్ మరియు మాధుర్య హనీ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి మొక్కల నాటిన అనంతరం జరిగిన అవగాహన సదస్సులో కూరం సంజీవరావు ముఖ్యఅతిథిగా మాట్లాడారు ఈ సృష్టిలో సమస్త జీవకోటికి మొక్కలే ప్రధాన జీవనాధారం అని ఆయన స్పష్టం చేశారు. ఆహారం నీరు లేకపోయినా మనిషి ఒకటి రెండు రోజులు జీవించగలడేమో కానీ ప్రాణవాయువు లేకపోతే ఒక్క నిమిషం కూడా బతకలేదని గుర్తు చేశారు.

అటువంటి అమూల్యమైన ప్రాణవాయునందించే చెట్లను నరకడం అడవుల నాశనం చేయడం అత్యంత విచారకరమన్నారు .ప్రజల భాగస్వామ్యంతోటే



అడవుల సంరక్షణ జరుగుతుందని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ మరియు ఎఫ్ పి ఓ నిబంధనలకు లోబడి పర్యావరణ హిత కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తానని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాధుర్య హాని ప్రొడ్యూసర్ కంపెనీ ప్రతినిధులు, ఆదివాసి సంక్షేమ పరిషత్ నాయకులు, స్థానిక గిరిజన మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని పర్యావరణాన్ని రక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం గ్రామాల్లోని పలు ప్రాంతాల్లో మొక్కలను నాటారు.

## అంగన్‌వాడీ సిబ్బందికి బాల్య వ్యాధుల గుర్తింపు, ఆరోగ్య పరిరక్షణపై శిక్షణ




ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండలంలోని ఈదర ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి కె. జ్ఞాన సందీప్ మాట్లాడుతూ చిన్నారుల్లో బాల్యదశలో వచ్చే వ్యాధులను ముందుగానే గుర్తించడం, పిల్లల ఎదుగుదలపై పర్యవేక్షణ, ఆరోగ్య అవగాహన కల్పించడం, పోలియో నిర్మూలన కార్యక్రమం, గర్భిణీలకు ప్రసవపూర్వ సంరక్షణ అందించడం వంటి అంశాలపై వివరించారు. చిన్నారులు, గర్భిణీల ఆరోగ్య రక్షణలో అంగన్‌వాడీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకుడు కె. హరిశంకర్, గుర్రం రాగమయి, బహుళ ప్రయోజన ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ పర్యవేక్షకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పే ఏక్ పేడ్ మా కె నామ్ అమ్మ పేరుతో ఒక మొక్క



ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు

నూజివీడు గ్రామీణమండలం బత్తులవారి గూడెం గ్రామంలో "నగరవనం" నందు ఒక మొక్కను తల్లి పేరు మీద తల్లికిచ్చిన గౌరవముగా భావిస్తూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నూజివీడుఅటవీశాఖసౌజన్యంతో ,బిజేపి రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షుడు చిగురుపాటి కుమార స్వామి ముఖ్య అతిథిగా, బీజేపీ ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు చౌటపల్లి విక్రమ్ కిశోర్ అధ్యక్షతన, ఏలూరు జిల్లా పార్లమెంట్ ఇంచార్జ్ కట్నేని లక్ష్మీ కృష్ణ ప్రసాద్,, జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కీర్తి రాంప్రసాద్, నూజివీడు వ్యవసాయ మార్కెటింగ్ యార్డ్ చైర్మన్ శ్రీమతి కుంపటి అరుణ, టీడీపీ జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు మరియు మాజీ సర్పంచ్ ముసునూరు రాజా, నూజివీడు మండల పరిషద్ ప్రెసిడెంట్ ఆరేపల్లి శిరీష, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర పాదధి కారి దొడ్డ నాగరాజులు అతిథులుగా మరియు బిజేపి నాయకులు మరియు గొల్లపల్లి మాజీ సర్పంచ్ గోగినేని శ్రీనివాస్ కుమార్ అప్పారావు మరియు బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు, జిల్లా పదాధికారులు,టీడీపీ నేతలు, జనసన నేతలు పాల్గొనగా అటవీ అధికారులు సహకారం తో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం జరిగింది.పర్యావరణ పరిరక్షణ సంరక్షణ తద్వారా పచ్చదనాన్ని పెంచి పర్యావరణాన్ని కాపాడే విధంగా "సీడ్ బాల్స్" తయారీ, వాటిలో వాడే వివిధ రకాల విత్తనాలు గురించి రేంజ్ అధికారులు వివరించగా అతిథులు తెలుసుకున్నారు.

## మొక్కలు నాటిన ఏ ఎం సి చైర్మెన్ కుంపటి అరుణ

ప్రజాభూమి ప్రతినిధి–నూజివీడు



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా " పే ఏక్ పేడ్ మా కె నామ్ " అమ్మ పేరుతో ఒక మొక్కను. ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వ్యవసాయ మార్కెటింగ్ సం స్థ నందు ఒక మొక్కను తల్లి పేరు మీద తల్లికిచ్చిన గౌరవముగా భావించి నూజివీడు వ్యవ సాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ కుంపటి అరుణ ఆధ్వర్యాన మొక్కలు నాటడం చేశారు ఈ కార్యక్రమములో భారతీయ జనతా పార్టీ ఏలూరు జిల్లా నాయకులు వై ఎస్ దొర్రై, కే రంగారావు, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ సిబ్బంది ,తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



ప్రజా భూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఈదర--సగ్గూరు--ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ జ్ఞాన సందీప్, డాక్టర్ మంజుల దేవి, డాక్టర్ టీనా ఆధ్వర్యంలో ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి, కలుపు మొక్కలను తొలగించి మొక్కలు నాటారు. పచ్చదనం పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు, మధ్యస్థాయి ఆరోగ్య సేవల సిబ్బంది, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన ప్రకృతి అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత

ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి



ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఆగిరిపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో మొక్కల నాటే కార్యక్రమాలు నిర్వహించినట్లు ఎంపీడీవో అబ్దుల్ సలాం తెలిపారు. చిన్న ఆగిరిపల్లిలో ఎంపీడీవో అబ్దుల్ సలాం, చొప్పరమెట్లలో డిప్యూటీ ఎంపీడీవో బి. ఆనందబాబు పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరి రక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతిని అందిం చేందుకు ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి సంరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ అభివృద్ధి అధికారి, సచివాలయ సిబ్బంది, మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### ఢిల్లీలో మెరిసిన తెలుగు తేజం

# ఏకంగా 3 గోల్డ్ మెడల్స్, 9 డిస్టింక్షన్స్

- ఎంబీబీఎస్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన కమ్మెల భవ్య
- కుమార్తె అద్వితీయ ప్రతిభకు పులకించిపోయిన ఏపీ మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి



ప్రజాభూమి ప్రతినిధి–అమరావతి

కృషి, పట్టుదల, లక్ష్యసాధన పట్ల అంకితభావం ఉంటే విజయాలు తప్పక సొంతమవుతాయని నిరూపించారు కమ్మెల భవ్య. దేశ రాజధాని ఢిల్లీలోని ఢిల్లీ విశ్వవిద్యాలయం పరిధిలో ఎంబీబీఎస్ విద్యను అత్యుత్తమ ప్రతిభతో పూర్తి చేసి అరుదైన రికార్డును నెలకొల్పారు. ఏపీ మాదిగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్, తాడికొండ మాజీ ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి కుమార్తె అయిన భవ్య, వైద్య విద్యలో అసాధారణ ప్రతిభ కనబరిచి తెలుగు రాష్ట్రాల గర్వకారణంగా నిలిచారు. విద్యాభ్యాసం ప్రారంభం నుంచి క్రమశిక్షణ, అంకితభావంతో ముందుకు సాగిన ఆమె ఎంబీబీఎస్ కోర్సులో మూడు బంగారు పతకాలు సాధించడమే కాకుండా, తొమ్మిది ప్రధాన విభాగాల్లో డిస్టింక్షన్లు సాధించి అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. ప్రసూతి మరియు స్త్రీ జననేంద్రియ శాస్త్రం , ఫిజియాలజీ , పీడియాట్రిక్స్ విభాగాల్లో భవ్య బంగారు పతకాలు సాధించారు. అలాగే జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఈఎన్‌టీ, ఫోరెన్సిక్ మెడిసిన్, అనాటమీ, బయోకెమిస్ట్రీ, పాథాలజీ, ఫార్మకాలజీ, మైక్రోబయాలజీ వంటి కీలక విభాగాల్లో డిస్టింక్షన్లు కైవసం చేసుకుని తన ప్రతిభను చాటుకున్నారు. వైద్య విద్యలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈ సబ్జెక్టుల్లో అత్యున్నత మార్కులు సాధించడం ద్వారా ఆమె తన మేధస్సు, కృషిని మరోసారి నిరూపించారు.ఎంతో నిశ్శబ్దంగా, నిరాడంబరంగా తన విద్యాభ్యాసాన్ని కొనసాగించిన భవ్య అతి చిన్న వయసులోనే వైద్య పట్టా పొందడం విశేషంగా నిలిచింది. ఆమె సాధించిన ఈ విజయం తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు, ముఖ్యంగా వైద్య రంగంలో ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగుతున్న యువతకు స్ఫూర్తిదాయకంగా మారింది. భవ్య సాధించిన ఈ అరుదైన ఘనతపై రాష్ట్రవ్యాప్తంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, వైద్య రంగ ప్రముఖులు, సామాజిక వర్గాల నాయకులు ఆమెను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.ఈ సందర్భంగా ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ, తన కుమార్తె భవ్య సాధించిన ఈ విజయం కుటుంబానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. చిన్ననాటి నుంచే లక్ష్యసాధన కోసం కష్టపడి చదివిన భవ్య తన కలను నిజం చేసుకుందని అన్నారు. ఈ సందర్భంగా భవ్యకు అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీ వేదికగా తెలుగు రాష్ట్రాల కీర్తి పతాకాన్ని ఎగురవేసిన డాక్టర్ కమ్మెల భవ్య భవిష్యత్తులో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి వైద్య రంగంలో విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించారు.

## పర్యావరణ పరిరక్షణకై.... జగ్జీవన్ సమైక్య ఆధ్వర్యంలో మొక్కలు నాటిన కొప్పాక జవహర్.



ప్రజాభూమి ప్రతినిధి–తాళ్లపూడి

పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని తాళ్లపూడి మండలం పైడిమెట్ట గ్రామంలో జగ్జీవన్ సమైక్య ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కమిటీ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ కొప్పాక జవహర్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు మాదిగ సామాజిక భవనం వద్ద మొక్కలు నాటారు. కార్యక్రమం లో కమిటీ చైర్మన్ డా జె వి ప్రమోద్, ఉపాధ్యక్షులు కొల్లి చినబాబు, సెక్రటరీ కొడమంచిలి విమల్ పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామసభ నిర్వహణ



ప్రజాభూమి ప్రతినిధి–ఆగిరిపల్లి

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఈదర సీతారామపురం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. ప్రత్యేక అధికారి కొవ్వలి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, మొక్కల పెంపకం ప్రాధాన్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షేక్ హజరాబాయి, డబ్ల్యూఈఏ శిరీష, ఆశా కార్యకర్త మౌనిక తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణం- ఆరోగ్య హితం కోసం సైకిల్
## తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ పై సీఎం చంద్రబాబు

ప్రజాభూమి ప్రతినిధి–విశాఖపట్నం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు తన తిరుగు ప్రయాణంలోనూ సైకిల్ పై హెలిపాడ్ వరకూ ప్రయాణించారు. నోవోటెల్ హోటల్ నుంచి బీచ్ రోడ్డు మీదుగా వైఎంసీఏ, వుడాపార్కు సర్కిల్ , పోలమాంబ గుడి మీదుగా ఏయూలోని ఇంజనీరింగ్ కాలేజ్ గ్రౌండ్ దగ్గర ఏర్పాటు చేసిన హెలిపాడ్ కు సైకిల్ పై ప్రయాణించారు. 5.5 కిలోమీటర్ల దూరాన్ని 17 నిమిషాల్లో సీఎం చేరుకున్నారు. దారిలో ప్రజలకు అభివాదం చేసుకుంటూ ముఖ్యమంత్రి ముందుకు సాగారు. పర్యావరణ హితంతో పాటు వ్యక్తిగత ఆరోగ్యం కోసం సైకిల్ వినియోగించాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. విశాఖ సుందరమైన నగరమని.. ఇలాంటి నగరంలో సైకిల్ పై ప్రయాణించటం మరింత ఆహ్లాదం కలిగిస్తుందని సీఎం పేర్కొన్నారు. విశాఖలో సైకిల్ పాత్ ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామని సీఎం వివరించారు. కాలుష్య రహితంగా మన రాష్ట్రాన్ని తయారు చేసేందుకు ఉద్దేశించిన నెట్ జీరో కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఏ కార్యక్రమం ప్రారంభించినా విశాఖ వాసులు విజయవంతం చేస్తారని .. వివిధ సందర్భాల్లో నగర వాసులు తనకు అండగా నిలబడ్డారని సీఎం అన్నారు. విశాఖకు మరిన్ని పెట్టుబడులు తీసుకురావటం ద్వారా రుణం తీర్చుకుంటానని



ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విశాఖను నాలెడ్జ్ హబ్ గా చేయాలని ప్రయత్నిస్తుంటే కొందరు దుష్ప్రచారం చేస్తున్నారని వచ్చే రోజుల్లో అనేక అవకాశాలకు విశాఖ కేంద్రం అవుతుందని సీఎం అన్నారు. వివిధ ప్రాజెక్టులతో సమీప భవిష్యత్తులోనే అనేక అవకాశాల కేంద్రంగా విశాఖ రూపుదిద్దు కుంటుందన్నారు. త్వరలోనే పోలవరం ఎడమ కాలువ పనులు పూర్తి చేసి విశాఖకు గోదావరి నీళ్లు తీసుకువస్తామని అన్నారు. విశాఖను మరింత సుందరంగా తీర్చిదిద్దటంతో పాటు సంపద సృష్టికి కేంద్రంగా మారుస్తామన్నారు.

# 15 రోజుల యోగా పండగకు సర్వం సిద్ధం

- ఈ నెల 7న పోలీస్ థీమ్ యోగా కార్యక్రమం
- ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు
- విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో నిత్య యోగా
- ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు

ప్రజాభూమి ప్రతినిధి–విజయవాడ

స్వర్ణాంధ్ర–ఆరోగ్యాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ నెల 7 నుంచి అంతర్జాతీయ యోగా దినోత్సవమైన 21వ తేదీ వరకు పండగలా యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తుందని.. జిల్లాలోనూ ఊరూ వాడా యోగా కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేశామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు.

కలెక్టర్ లక్ష్మీశ.. పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు, అడిషనల్ సీపీ కేజీవీ సరిత, సమన్వయ శాఖల అధికారులతో కలిసి యోగాంధ్ర–2026పై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం, ప్రతి ఇంటికి యోగాను చేరవేయడం, ప్రజల్లో నిత్య యోగా సాధన అలవాటును పెంపొందించే లక్ష్యంతో యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 7న పోలీసు సిబ్బందితో బీఆర్‌టీఎస్ రోడ్డులో థీమాటిక్ యోగా, ఈ నెల 10న పవిత్ర సంగమం వద్ద, 13వ తేదీన బెర్మ్ పార్కు వద్ద కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో ప్రతిరోజూ ఉదయం 6 గంటలకు నిత్య యోగా కార్యక్రమం జరుగుతుందని.. రైతులు, మహిళలు, యువత, వైద్యులు, కార్మికులు, విద్యార్థులు, క్రీడాకారులు, వయోవృద్ధులు, ఉపాధ్యాయులు.. ఇలా వివిధ వర్గాలకు ఇందులో భాగస్వాములను చేయనున్నట్లు వివరించారు. గ్రామాల్లో, వార్డుల్లో, దేవాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, పార్కులు, మైదానాలు తదితర ప్రాంతాల్లోనూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 21న జిల్లాస్థాయి కార్యక్రమం జరుగుతుందని.. జిల్లాలో 300 మంది మాస్టర్ ట్రైనర్లు, అయిదు వేల మందికిపైగా యోగా శిక్షకులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. కృష్ణానది వెస్ట్‌బైపాస్ రోడ్డుపై రాష్ట్రస్థాయి కార్యక్రమం జరుగుతుందని.. ఇందులో గౌరవ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర ప్రముఖులు పాల్గొంటారన్నారు. గౌరవ ప్రజాప్రతినిధులు కూడా కార్యక్రమాల్లో భాగస్వాములవుతారని.. ఇదేవిధంగా ప్రతిఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు.

### గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు యోగా పోటీలు:

ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు గ్రామ/వార్డు స్థాయిలో యోగా ఫర్ ఆల్ – గ్రాస్‌రూట్స్ వెల్‌నెస్ ఇతివృత్తంతో పోటీలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఔత్సాహికులు స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో విజేతలు మండల స్థాయికి, మండలస్థాయిలో విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ విజేతలుగా నిలిచిన




వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు యునిటీ త్రో యోగా–బ్రిడ్జింగ్ కమ్యూనిటీస్ థీమ్‌తో మండలస్థాయిలో, ఈ నెల 14వ తేదీ నుంచి 16వ తేదీ వరకు యోగా అండ్ యూత్ – బిల్డింగ్ ఎ హెల్దీ ఫ్యూచర్ థీమ్‌తో జిల్లాస్థాయిలో, ఈ నెల 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు యోగాంధ్ర–ఆంధ్రాస్ గ్లోబల్ యోగా షోకేజ్ థీమ్‌తో రాష్ట్రస్థాయిలో పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. వ్యక్తిగత కేటగిరీ (ఆసన, ప్రాణామాయ ప్రదర్శనలు), గ్రూపు కేటగిరీలో సింక్రనైజ్డ్ గ్రూప్ యోగా పోటీలు ఉంటాయని.. అదే విధంగా యోగా క్విజ్, యోగా స్లోగన్ పోటీలు కూడా నిర్వహించనున్నట్లు వివరించారు. జూనియర్ (10–18 ఏళ్లు), యంగ్ (19–35 ఏళ్లు), సీనియర్ గ్రూప్ (35 ఏళ్లు, ఆపైన) విభాగాల్లో పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మహిళలు, పురుషులకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పోటీల్లో విజేతలను రాష్ట్రస్థాయి కార్యక్రమంలో సత్కరించనున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

### నేర నియంత్రణకు యోగా ఓ మంచి మార్గం: సీపీ ఎస్‌వీ రాజశేఖరబాబు

మనిషికి శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యమూ ముఖ్యమని.. నేర నియంత్రణకు, నేర రహిత జిల్లాగా ఎన్‌టీఆర్ జిల్లాను తీర్చిదిద్దేందుకు యోగా కూడా ఓ మంచి మార్గమని పోలీస్ కమిషనర్ ఎస్‌వీ రాజశేఖరబాబు అన్నారు. డ్రగ్స్‌పై దండయాత్ర 2.0ను విజయవంతంగా నిర్వహిస్తున్నామని... ఇందులో గుర్తించిన గంజాయి పాజిటివ్స్‌కు కూడా 28 పోలీస్ స్టేషన్ల పరిధిలో యోగా కార్యక్రమాలు, శిబిరాలు నిర్వహించి మంచి మార్గంలో నడిచేలా, జనజీవన స్రవంతిలోకి తీసుకొచ్చేందుకు కార్యాచరణ రూపొందించామన్నారు. జిల్లాలో పోలీస్ థీమ్ యోగాకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నామని సీపీ రాజశేఖరబాబు పేర్కొన్నారు.

లిజిల్లా ఆయుష్ అధికారి డా. వై.రత్న ప్రియదర్శిని మాట్లాడుతూ ఈ ఏడాది ఆరోగ్యవంతమైన వృద్ధాప్య జీవనానికి యోగా థీమ్‌తో అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. జీవితంలో ఏ సంక్షోభం ఎదురైనా ఆత్మస్థైర్యంతో ఎదుర్కొనే సామర్థ్యం ఉండాలంటే శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఆధ్యాత్మిక ఆరోగ్యం ఉండాలని, అదే నిజమైన ఆరోగ్యమని పేర్కొన్నారు. ఆయుష్, వైద్య ఆరోగ్యం, రెవెన్యూ, పోలీస్, యువజన సంక్షేమం, క్రీడలు, విద్య, పంచాయతీరాజ్, మునిసిపల్ ఇలా వివిధ శాఖల సహకారంతో కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు రత్నప్రియదర్శిని తెలిపారు.సమావేశంలో జిల్లా ఆయుష్ అధికారి డా. వై. రత్నప్రియదర్శిని, డీఈవో ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌వో డా. జె.ఇందుమతీదేవి తదితరులు పాల్గొన్నారు.